ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

బుధవారం 19, మార్చి 2025



డ్వామాలో అక్రమార్కులపై వేటు మొదలైంది. మొత్తం ఆ సంస్థ ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఒకవైపు బదిలీల ప్రక్రియ నడుస్తుండగా, మరోవైపు గత ప్రభుత్వంలో ఇష్టానుసారం అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలు ప్రారంభమయ్యాయి. ఈమేరకు 14మందిపై వేటు పడింది. పలు ఆరోపణల నేపథ్యంలో పూర్వపు పీడీ శీనారెడ్డి అక్రమాలపై త్రిసభ్య కమిటీ విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేసింది. దాని ప్రకారం ప్రస్తుతం యాక్షన్ తీసుకుంటున్నారు. కాగా శీనారెడ్డిపైనా చర్యలు ఉంటాయని సమాచారం. అలాగే కమిటీ నివేదిక ఆధారంగా మరోసారి డ్వామాపై సమగ్ర విచారణ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

వేటు మొదలైంది!



డ్వామా సిబ్బందిని విచారిస్తున్న త్రిసభ్య కమిటీ (ఫైల్)

- డ్వామాలో 14మందిపై చర్యలు
- ఒక టెక్నికల్ అసిస్టెంట్ తొలగింపు
- ఇన్‌చార్జి ఏపీడీ జడ్పీకి సరెండర్
- నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్ రద్దు
- మరికొందరి నుంచి నగదు రికవరీ
- లోకేశ్వరరావు కమిటీ నివేదిక ఆధారంగా యాక్షన్
- పూర్తిస్థాయిలో చర్యల కోసం సమగ్ర విచారణకు ఆదేశం

ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా పలువురు డ్వామా సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో మొత్తం 14 మందిపై చర్యలు తీసుకుంటూ పీడీ జోసఫ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అందులో జడ్పీ నుంచి డిప్యుటేషన్‌పై డ్వామాలో పనిచేస్తున్న ఒకరిని తిరిగి ఆ శాఖకు సరెండర్ చేశారు. నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్ల రద్దు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సర్వీసు నుంచి తొలగింపు, నలుగురికి నగదు రికవరీలు పెట్టారు. త్రిపురాంతకం మండలంలో 11వ విడత సోషల్ ఆడిట్ అవకతవకలకు సంబంధించి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శాఖాపరంగా మరోసారి సమగ్ర విచారణకు నిర్ణయించారు. అందులో 10మంది సిబ్బంది ఉన్నారు. అలా మొత్తంగా 24మందిపై చర్యలకు నిర్ణయించారు.

శీనారెడ్డిపై చర్యలకు సిఫార్సు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో దాదాపు నాలుగున్నరేళ్లు డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేశారు. ఆయన అధికారిగా కన్నా వైసీపీ నాయకుడిగా వ్యవహరించారు. శీనారెడ్డి పనిచేసిన కాలంలో డ్వామాలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదులతో విచారణకు ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ అన్సారియా నియమించారు. ఆ కమిటీ డిసెంబరు, జనవరి నెలల్లో విచారణ నిర్వహించింది. నివేదికను జనవరి ఆఖరులో కలెక్టర్‌కు అందించింది. దానిని పరిశీలించిన కలెక్టర్.. అవినీతి, అక్రమాలు జరిగాయని, శీనారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అదేసమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలువురు డ్వామా జిల్లా కార్యాలయ, అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది పేర్లను కమిటీ ప్రస్తావించింది. వారిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆయన పలువురిపై వేటు వేశారు. డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన

మిగతా 6వ పేజీలో

సెల్‌ఫోన్‌పై తలో మాట

- ఎవరి మాట వినాలో తెలియని అయోమయం
- తలలు పట్టుకుంటున్న పదో తరగతి పరీక్షల చీఫ్‌లు

ఒంగోలు విద్య, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ వినియోగంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తలా ఒక మాట చెప్తున్నారు. దీంతో ఎవరి మాట విని ముందుకు వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఏమి చేయాలో పాలుపోక పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తలలు పట్టుకుంటున్నారు. పరీక్షల నిర్వహణలో గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గత ఏడాది నుంచి కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించింది. రెండేళ్ల క్రితం వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాలు బయటకు లీకవడంతో ముందుజాగ్రత్తగా పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లను నిషేధించారు. ఈ ఏడాది కూడా ముందుగానే పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించి సెల్‌ఫోన్లను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లపై వెబెక్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ఆర్జేడీలు ఇతర జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. దీంతో కేంద్రాల్లోకి చీఫ్‌లు, డీవోలు, ఇన్విజిలేటర్లు, ఏఎన్ఎంలు, పోలీసులు ఫోన్లు తీసుకురావద్దని ఆదేశించారు. అయితే పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు నిర్వహించిన వెబెక్స్‌లో చీఫ్‌లు మాత్రమే ఆండ్రాయిడ్‌లు కాకుండా ఇతర మామూలు ఫోన్లను వాడవచ్చన్నారు. ఏదైనా అత్యవసరమైతే వినియోగించాలని ఆదేశించారు. పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి కూడా మామూలు ఫోన్‌ను చీఫ్‌లు పరీక్షా కేంద్రాలకు




మిగతా 6వ పేజీలో

నేటి నుంచి రెండో దశ పొగాకు కొనుగోళ్లు

- ఏడు కేంద్రాల్లో ప్రారంభం
- ఒంగోలు-2, వెల్లంపల్లిలో పాల్గొననున్న బోర్డు చైర్మన్



ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో రెండో దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ప్రాంతంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. అందులో ఈనెల 10న తొలి విడతగా ఒంగోలు-1, పొదిలి, కొండపి, కందుకూరు-1 కేంద్రాల్లో కొనుగోళ్లను బోర్డు అధికారులు చేపట్టారు. గరిష్ఠ ధర కిలో రూ.280తో వేలం కొనసాగుతోంది. అయితే గ్రేడింగ్ సరిగా లేదంటూ కొన్ని బేళ్లను కంపెనీల ప్రతినిధులు తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో రెండో దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు-2, కలిగిరి డీసీపల్లి కేంద్రాల్లో బుధవారం ఉదయం వేలం ప్రక్రియ మొదలవుతుంది. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాలలో వేలం ప్రక్రియను ప్రారంభించనున్నారు. మూడో విడతగా ఈనెల 24 నుంచి ఉత్తరాది వేలం కేంద్రాలుగా పిలిచే రాజమండ్రి రీజియన్‌లోని మిగిలిన ఐదు కేంద్రాల్లో వేలం ప్రారంభించనున్నారు.



తెరపైకి మళ్లీ ఆదరణ

- కులవృత్తిదారులకు పరికరాలు
- 90శాతం సబ్సిడీతో యూనిట్లు అందజేయనున్న ప్రభుత్వం

ఒంగోలు నగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి అవసరమైన వస్తువులను 90శాతం సబ్సిడీపై అందజేయనుంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 1997-99 సంవత్సరంలో ఆదరణ-1, 2018-19లో ఆదరణ-2 ను అమలు చేసింది. 335 రకాల వృత్తిదారులకు వారికి అవసరమైన పరికరాలు అందజేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సంబంధించిన అన్ని పథకాలను నిలిపేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ బీసీలకు మంచిరోజులు వచ్చాయి. ఆదరణ-3 పేరుతో కులవృత్తులతో జీవిస్తున్న వేలాది మంది బీసీలకు అవసరమైన వస్తువులను కొద్దిరోజుల్లోనే అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

కులవృత్తిదారులకు భారీగా లబ్ధి

జిల్లాలో 15 వేల నుంచి 20వేల మంది వరకూ ఆదరణ పథకం కింద లబ్ధి చేకూరనుంది. వృత్తిదారుల అవసరాలను తెలుసుకుని వారికి ఉపయోగపడే

మిగతా 6వ పేజీలో

విద్యార్థినులపై టీచర్ అనుచిత ప్రవర్తన

- వారం తర్వాత వెలుగులోకి విషయం
- అతని ఇల్లు, పోలీసు స్టేషన్ వద్ద పిల్లల బంధువుల ఆందోళన
- రంగంలోకి పామూరు సీఐ
- బాధితులకు న్యాయం చేస్తామని నచ్చజెప్పి పంపిన వైనం

7



ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్తున్న సీఐ భీమానాయక్

పౌరసరఫరాల శాఖ అధికారుల దాడులు

- 16 సిలిండర్లు స్వాధీనం

వివరాలు 7వ పేజీలో

బంగారు బాల్యంకు స్కోచ్ అవార్డు

- కలెక్టర్‌ను అభినందించిన మంత్రి స్వామి

వివరాలు 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.26 (బుధవారం సాయంత్రం)
సహర్: 4.54 (గురువారం ఉదయం)

పోతురాజు కాలువ పనుల్లో అవకతవకలు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే జనార్దన్ డిమాండ్
- ఒంగోలులో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు విజ్ఞప్తి



ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర ముంపు నివారణ కోసం ఉద్దేశించిన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులలో గత వైసీపీ పాలనలో అవకతవకలు, అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆరోపించారు. ఆయా అక్రమాలపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే జనార్దన్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో ముంపు నివారణ కోసం 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పోతురాజు కాలువ ఆధునికీకరణ అవసరాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి స్థానిక ఎమ్మెల్యేగా పలుమార్లు తీసుకెళ్లగా రూ.89.75 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ పనులు చేపట్టేలోపు ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిందన్నారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.62 కోట్లతో పనులు చేపట్టి రూ.41.75 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపిం దన్నారు. అందులో ముగ్గురు కాంట్రాక్టర్లు మారారని, అయినా పనులు పూర్తికాకపోవడమే కాక పలు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వాటిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు గతంలో యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఆ పథకాన్ని మంజూరు చేసి నగరంలో ఇక్కట్లు తీర్చాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. వాటిపై మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమాధానం ఇస్తూ సుమారు రూ.78.03 కోట్లతో పోతురాజు కాలువ పనులు మంజూరు చేయగా రూ.68.51 కోట్లకు టెండర్ పొంది రూ.48.10 కోట్ల పనులు చేశారన్నారు. ఈ పనులలో భాగంగా 5.10 కి.మీ మేర కాంక్రీట్ బెడ్‌తో వాల్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. అయితే గత ప్రభుత్వ కాలంలో జరిగిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, బెడ్ లేకుండా వాల్ నిర్మాణం చేశారన్నారు. అందులో 50 మీటర్ల మేర వాల్ కూలి పోయిందన్నారు. వీటిపై జలవనరులశాఖ అధికారుల ద్వారా విచారణ చేయిసామన్నారు. అలాగే భూగర్భ డ్రైనేజీ పనులకు డీపీఆర్ సిద్ధం చేసేందుకు టెండర్ పిలిచామని, టెక్నికల్ బిడ్ కూడా ఓకే అయిందన్న మంత్రి నారాయణ ఆర్థిక బిడ్ అప్రూవల్ చేశాక ఆ పనులను చేపడతామన్నారు.

7

కలెక్షన్ కింగ్!

- మండలస్థాయి అధికారి బరితెగింపు
- డబ్బుల కోసం కిందిస్థాయి ఉద్యోగులపై జులుం
- 15వ ఆర్థిక సంఘం నిధులు స్వాహా
- ఉద్యానశాఖ అధికారి నుంచి నగదు డిమాండ్
- అధికారపార్టీ నాయకుడూ బాధితుడే



పుల్లలచెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆయన మండల స్థాయిలో కీలక అధికారి. అభివృద్ధి పనులు చేసి మండలాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనది. చుట్టపుచూపుగా కార్యాలయానికి వచ్చే అయ్యగారు మామూళ్ల వసూళ్లలో మాత్రం మేటి అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, అధికారపార్టీ నాయకుల నుంచి కూడా అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ అధికారిగా ఆయన పనిచేశారు. ప్రస్తుతం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తనకున్న పలుకుబడితో తిరిగి ఇక్కడికే పోస్టింగ్ తెచ్చుకున్నారు. పాలన అనుభవం సుదీర్ఘంగా ఉండటంతో నగదు అక్రమంగా డ్రా చేసుకోవడంలో ఆరితేరారు. మండలానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ఇలాగే స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి.

చేతిపంపుల మరమ్మతుల్లో మాయ

మండలంలోని మెజారిటీ గ్రామాల్లో చేతిపంపులు వినియోగంలో లేవు. దానినే అవకాశంగా మలుచుకొని సదరు అధికారి ఓ వ్యక్తి పేరుతో మరమ్మతులు చేసినట్లు చూపి రూ.2.48 లక్షల బిల్లులు చేసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోటారు బిగింపునకు రూ.1.20 లక్షల నిధులను చెల్లించారు. అయితే మోటారు బయట కొత్తది కొనుగోలు చేసినా రూ.40 వేలలోపు



మిగతా 6వ పేజీలో

వేటు మొదలైంది!

(5వ పేజీ తరువాయి)

సమయంలో జడ్పీ నుంచి డ్వామాకు డిప్యుటేషన్‌పై వచ్చి తొలుత విజిలెన్స్ సూపరింటెండెంట్‌గా అనంతరం ఒంగోలు క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా పనిచేస్తున్న పి.వెంకటస్వామి డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి జడ్పీకి పంపించారు.

డ్వామా జిల్లా కార్యాలయంలో పనిచేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధనాల సురేష్, దాసరి సురేష్, ఏపీవో నాగేశ్వరరావు, ఈసీ ప్రవీణ్‌కుమార్‌ల డిప్యుటేషన్లను రద్దుచేశారు.

విధులకు హాజరు కాకుండానే జీతాలు డ్రా చేసినట్లు తేలడంతో డ్వామా కార్యాలయంలోని టెక్నికల్ అసిస్టెంట్ తోట నవీన్‌ను సర్వీసు నుంచి తొలగించారు.

కనిగిరి ఏపీడీ ఆఫీసులోని కంప్యూటర్ ఆపరేటర్‌ను మరో క్లస్టర్‌కు, డ్వామా కార్యాలయంలోని ఆఫీసు సబార్డినేటర్ వై.చేజర్లను మరో సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

టంగుటూరు మండల ఈసీ దివికుమార్, వైపాలెం మండలంలోని టీఏలు వి.లక్ష్మయ్య, జి.శివరామరెడ్డి, పెద్దారవీడు మండలం టీఏ ప్రవీణ్‌కుమార్‌ల నుంచి నగదు రికవరీకి ఆదేశించారు.

త్రిపురాంతకం మండలంలో 2019లో జరిగిన 11వ విడత సోషల్ ఆడిట్‌లో సుమారు రూ.3కోట్ల మేర అవినీతి జరిగినట్లు గుర్తించారు. 10మంది సిబ్బందిని సస్పెండ్ చేసి కొద్దిరోజులకు తిరిగి అక్కడే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ విషయాన్ని లోకేశ్వరరావు కమిటీ ప్రశ్నించింది. దీంతో సదరు వ్యవహారంపై మరోసారి శాఖాపరమైన విచారణ చేపట్టాలని భావించారు. జిల్లా విజిలెన్స్ అధికారి, నాణ్యత నియంత్రణ విభాగాధికారి, మార్కాపురం ఏపీడీలతో కూడిన త్రిసభ్య కమిటీని నియమించారు.

ఒంగోలు సీఎల్ఆర్‌సీ పరిధిలో రూ.10లక్షలను ఆఫీసు అటెండర్ చల్లా శేషారావు చెక్కులపై ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసిన వ్యవహారంలో సరైన చర్యలను నాటి పీడీ శీనారెడ్డి తీసుకోకుండా అతనిని సస్పెండ్ చేసి ఆ వెంటనే డబ్బు రికవరీ చేశారంటూ పోస్టింగ్ ఇచ్చారు. ఆ విచారణ తీరును కమిటీ ప్రశ్నించింది. దీంతో ఈ ఘటనపై ప్రస్తుత డ్వామా ఏపీడీ వండర్‌మెన్‌ను విచారణ చేయాలని ప్రస్తుత పీడీ సూచించారు.

మళ్లీ తెరపైకి ఆదరణ

(5వ పేజీ తరువాయి)

పరికరాలను ఆదరణ-3 పథకం కింద అందజేయనున్నారు. ఇందులోభాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో బీసీ కార్పొరేషన్ అధికారులు వివిధ కుల వృత్తిసంఘాల నాయకులు, బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. వారికి అవసరమైన వృత్తి పరికరాల గురించి ఈడీ వెంకటేశ్వరరావు తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో కులవృత్తిదారులతో బీసీ కార్పొరేషన్ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో వృత్తి పరికరాలను అందజేయనున్నారు. ఈ ప్రక్రియ అంతా నెల రోజుల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

సెల్‌ఫోన్‌పై తలోమాట

(5వ పేజీ తరువాయి)

తేవచ్చన్నారు. అయితే డీఈవో కిరణ్‌కుమార్ మాత్రం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎవరు కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకురావద్దని చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఎవరి ఆదేశాలు పాటించాలో అర్థం కాక చీఫ్‌లు తలలు పట్టుకుంటున్నారు.

సెలవు రోజుల్లో బడికి వెళ్లడంపై అసంతృప్తి

పదో తరగతి పరీక్షలు రోజు మార్చి రోజు నిర్వహిస్తున్నారు. పరీక్ష లేని రోజు చీఫ్‌లు, డీవోలు కూడా స్కూల్‌కు వెళ్లాల్సిందేనని అధికారులు ఆదేశించడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో పరీక్ష ఉన్న రోజు మధ్యాహ్నం, సెలవు రోజు ఉదయం పూట 6 నుంచి 9 తరగతులకు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు. అప్పుడు సీటింగ్ ఏర్పాట్లు, బోర్డు మీద, బల్లల మీద రాసిన హాల్‌టిక్కెట్ నెంబర్లు కూడా చెరిగిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సెలవు రోజు మధ్యాహ్నం చీఫ్‌లు, డీవోలు మళ్లీ సీటింగ్ ఏర్పాటు చేసుకొని నంబర్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అయితే వీరు స్కూలుకు పోయి వచ్చి ఏర్పాట్లు ఎప్పుడు చేసుకోవాలని వాపోతున్నారు.

కలెక్షన్ కింగ్!

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇక ఇక్కడ కొత్త మోటారు బిగించిన దాఖలాలు కూడా లేవు. అక్కడ పాతదే ఉన్నప్పటికీ, నిధులు మాత్రం డ్రా అయ్యాయి. పుల్లలచెరువు ఎస్సీ కాలనీలో సైతం రోడ్డు పనులు చేసినట్లు చూపి నిధులు కైంకర్యం చేశారు. పనులు చేయకుండా పెద్దఎత్తున 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. తనకున్న అనుభవంతో సదరు అధికారి అధికారపార్టీ నేతలు, కార్యకర్తలకు కూడా చుక్కలు చూపిస్తున్నాడు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

- 15వ ఆర్థిక సంఘం నిధులను పనులు చేయకుండానే ఓ ప్రజాప్రతినిధి రూ.3 లక్షల బిల్లులు పెట్టుకున్నారు. అందులో రూ.2లక్షలు ఇచ్చిన సదరు అధికారి తన వారి పేరుతో రూ.లక్ష బిల్లు చేసుకున్నారు. దీంతో ఆ ప్రజాప్రతినిధి పార్టీ పెద్దల వద్ద పంచాయితీ పెట్టాడు. దీంతో చేసేది లేక అధికారి డబ్బును తిరిగి ఇచ్చినట్లు తెలిసింది.
- పుల్లలచెరువు మండల కేంద్రంలో పనిచేసే వ్యవసాయశాఖ సంబంధించిన కిందిస్థాయి ఉద్యోగిని కూడా డబ్బుల కోసం బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా ఆ అధికారి వ్యవహారం చూసి ఉపాధి పనులు చేసేందుకు జంకుతున్నారు. మండలంలోని కవలకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తకు పంట కుంటలు మంజూరు చేస్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా మామూళ్లు పొందాడు. అనంతరం సదరు వ్యక్తితో ఈ అధికారి పలకడం మానేశాడు.

ఇక మండలంలోని పంచాయతీల్లో అధికశాతం వైసీపీ సర్పంచులే ఉన్నారు. సర్పంచులు పనులు చేయకుండానే వారికి బిల్లులు చేసి వారి నుంచి భారీగా దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎత్తిపోతలను వినియోగంలోకి తెస్తాం

- మరమ్మతులకు గురైన పథకాలను పరిశీలించిన ఐడీసీ అధికారులు

బల్లికురవ. మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు గురై నిరుపయెగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడుతున్నామని నీటి పారుదల శాఖ (ఐడీసీ) ఈఈ సిరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ మండలం గుంటుపల్లి, అంబడిపూడి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కోటవారిపాలెం, ఉప్పుమాగులూరు, సంతమాగులూరు మండలం సజ్జాపురం, తంగేడుమల్లి, కామేపల్లి, పెట్లూరివారిపాలెం గ్రామాలలో ఉన్న ఎత్తిపోతల పథకాలను ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఉన్న పథకాలను వినియెగంలోకి తెచ్చేలా అవసరమైన నిధులపై ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాలు పని చేసేలా ప్రణాళిక మేరకు నిధులు మంజూరు చేయిస్తామని వారు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కొంతకాలంగా పథకాలు పనిచేయడం లేదని ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి అన్ని పథకాలను పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశాలు ఇచ్చిందని వారు తెలిపారు. ఆనంతరం వారు గ్రామాలలో రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఏఈలు కృష్ణారావు, వంశీకృష్ణ, విజయభాస్కర్, నీటి సంఘాల అధ్యక్షులు కోయ పేరయ్య, కక్కెర సుబ్బారావు, దద్దాల విజయ్, దర్శి రామస్వామి పాల్గొన్నారు.

చేనేతలకు చంద్రన్న చేయూత

- నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- హామీ నెరవేర్చిన సీఎంకు నేతన్నల అభినందనలు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. గతంలో ఉన్న ఉచిత 100యూనిట్ల విద్యుత్‌ను 200కు పెంచుతామని స్పష్టం చేశారు. అలాగే పవర్‌లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇచ్చే విధంగా రెండు హామీలు చేశారు. ఈక్రమంలో సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రెండు హామీలను అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో చీరాల నియోజకవర్గ పరిధిలోని చేనేత కుటుంబాలు అభినందనల జల్లు కురిపించాయి. గత ప్రభుత్వం అరకొర హామీలు చేసిన అమలు ప్రక్రియలో తీవ్రమైన కోతలు విధించినట్లు చెప్తున్నారు. తాజాగా టీడీపీ కూటమి తీసుకున్న నిర్ణయంతో థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేస్తున్నారు.



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికురాలు సువర్ణ

పూట గడవడం కష్టంగా ఉండేది



అనుకోని రీతిలో నా భర్త సుమారు ఐదేళ్ల కిందట గుండెపోటుతో మరణించారు. దీంతో ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబం ఆర్థికపరమైన సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితులతో చేనేత రంగానికి సంబంధించి ధరలు పెరిగి, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దీంతో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. చాలా ఆనందంగా ఉంది.

- లేళ్ల సునీత, చేనేత కార్మికురాలు

మాట మార్చలేదు, మడమ తిప్పలేదు



ఎన్నికల హామీలు అందించే క్రమంలో టీడీపీ కూటమి మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. ఇచ్చిన హామీలో భాగంగా నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్ లూమ్‌కు 500 యూనిట్లు అందిస్తున్నట్లు ప్రకటించడం ఆనందదాయకం. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- మాన్యం రాము, చేనేత కార్మికుడు

పాఠశాలల పునరుద్ధరణతో పూర్వవైభవం

- కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల విలీనంతో విద్యార్థులు లేక రెండేళ్లుగా మూత
- కూటమి ప్రభుత్వం రాగానే విలీన నిర్ణయం రద్దు
- తిరిగి ఐదు తరగతులు ఒకేచోట నిర్వహణకు ఉత్తర్వులు
- మోడల్ స్కూల్‌గా మారనున్న వైనం
- తల్లిదండ్రుల హర్షం

బల్లికురవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న నూతన మార్పులతో గతంలో మూతపడి ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల (హెచ్‌ఈ)కి తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. గతంలో వైసీపీ హయాంలో విద్యార్థులతో నిండుకుండలా ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల నుంచి విలీనం పేరిట 2023లో మూడు, నాలుగు, అయిదు తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలకు తరలించింది. అప్పట్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విలీనం వద్దని నిరసన కూడా చేపట్టారు. అయినా వైసీపీ పాలకులు పట్టించుకోకుండా విలీనం చేశారు. దాంతో అప్పటి వరకు 80 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల 25 మందికి చేరింది. గదులు ఉన్నా విద్యార్థులు లేకపోవడంతో మూడు తరగతులకు సంబధించిన గదులు రెండేళ్లగా మూతపడి ఉన్నాయి. ఒకటి రెండు తరగతులు గ్రామంలో ఉన్న ఆదనపు తరగతి గదిలో పనిచేస్తున్నాయి. విద్యార్థులున్న పాఠశాలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని వారు అవేదన వ్యక్తం కూడా చేశారు. అయిన వారిమాటలను పట్టించుకోక పోవడంతో విద్యార్థులు లేక తరగతి గదులు నిరుపయెగంగా మారాయి. తాజాగా టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూల మార్పులు చేస్తూ గతంలో వైసీపీ చేసిన తప్పులను సరి దిద్దుతు కొప్పెరపాడు పాఠశాల విద్యార్థులు విలీనం నుంచి తిరిగి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్పు చేస్తున్నారు. దీంతో మూతపడి ఉన్న పాఠశాలకు తిరిగి పూర్వ వైభవం రానుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల గతంలో మాదిరిగా ఉంటే విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. రానున్న నూతన విద్యా సంవత్సరంలో నూత న మార్పులతో పాఠశాలలు బలోపేతం అవుతాయని తల్లిదండ్రులు అశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కొప్పెరపాడులో విద్యార్థులు లేక మూతపడిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులు



గ్రామంలో ఉన్న ఆదనపు గదులలో నడుస్తున్న ఒకటి, రెండు తరగతులు



అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

ఆస్తి విషయమై మారు తల్లిపై కొడుకు దాడి

- వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

పంగులూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం మారు తల్లిపై కొడుకు కర్రతో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి రేణంగివరం గ్రామంలో జరిగింది. గాయపడిన కోటేశ్వరమ్మ పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి సమాచారం మేరకు.. మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన శీలం లక్ష్మారెడ్డికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య పేరు కొండమ్మ, రెండవ భార్య పేరు కోటేశ్వరమ్మ. కొండమ్మకు ఒక కుమారుడు కాగా, కోటేశ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు. కొంత కాలం కిందట లక్ష్మారెడ్డి అనారోగ్యంతో చనిపోగా కొడుకు, కూతుళ్లు కలసి కర్మ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మారెడ్డికి రేణంగివరంలో రెండు ఇళ్లు, కొంత పొలం ఉంది. లక్ష్మారెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు ప్రసాదరెడ్డి కోటేశ్వరమ్మ, ఆమె కుమార్తెలకు ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. లక్ష్మారెడ్డి రెండవ భార్య కోటేశ్వరమ్మ నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి పని నిమిత్తం చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెం వెళ్లింది. కోటేశ్వరమ్మ లేని సమయం చూసి మొదటి భార్య కొండమ్మ కుమారుడు ప్రసాదరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి తన అణుయాయులకు ఇంటిని అద్దెకు ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న కోటేశ్వరమ్మ సోమవారం గ్రామానికి చేరుకుని తన ఇంటిలో ఉన్న వారిని ఖాళీ చేయాలని కోరగా, వారు ప్రసాదరెడ్డికి సమాచారమిచ్చారు. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ అక్కడకు చేరుకుని ఇంటిలో నివాసం ఉంటున్న వ్యక్తులతో కలసి విచక్షణా రహితంగా కోటేశ్వరమ్మపై కర్రతో దాడి చేసి గాయపరిచారు. రాత్రి సమయంలో తన తల్లి కోటేశ్వరమ్మకు కుమార్తె శ్రీలక్ష్మి ఫోన్ చేయగా బదులివ్వక పోవడంతో శ్రీలక్ష్మి తల్లి ఇంటివద్దకు చేరుకుంది. అక్కడ తన తల్లి లేకపోవడం, చెప్పులు మాత్రమే ఉండడంతో రాత్రి 12 గంటల సమయంలో తన తల్లి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. రాత్రి సమయంలో తల్లి కోసం పోలీసులతో కలసి వెతికామని, దాడి ఘటనలో గాయపడిన తన తల్లి కోటేశ్వరమ్మను ఆటోలో అద్దంకి వైద్యశాల వద్ద వదిలి వెళ్లారని, తన తల్లి వైద్యశాలలో చికిత్స పొందుతూ కనిపించిందని శ్రీలక్ష్మి తెలిపింది. ఆస్తి కోసం తన అన్న ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ తన తల్లిని చంపే ప్రమాదం ఉందని, తమకు రక్షణ కల్పించాలని శ్రీలక్ష్మి వేడుకుంటుంది. సోమవారం అర్ధరాత్రి తన తల్లి కోటేశ్వరమ్మ కనిపించడం లేదని ఆమె కుమార్తె శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసిందని, తమ సిబ్బంది ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు వెతికే ప్రయత్నం చేశామని రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. కోటేశ్వరమ్మ గాయాలతో అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు గుర్తించామని, పూర్తి సమాచారంతో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశ్రాంత న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు విశ్రాంతి న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. బాపనమ్మ కల్యాణ మండపంలో మంగళవారం డీఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో విద్యుత్ లోక్ అదాలత్, విద్యుత్ సమ స్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి అందిన 19 సమస్యలను స్వీకరిం చి 16ను అక్కడిక్కడే పరిష్కరించారు. మి గిలిన మూడు సమస్యలు నిర్దేసించిన కాల పరిమితిలో పరిష్కరించినున్నట్లు చె ప్పారు. సివిల్, కోర్టు పరిశీలనలో ఉన్న వాటిని మినహాయించి అధికలోడు, మీటర్ సమస్యలు, బిల్లుల పెండింగ్, నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలు సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం పొందాలని వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, బాపట్ల సూపరింటెండెంట్ జీ ఆంజనేయులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఫోరం అధ్యక్షుడు విశ్రాంతి న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్

బంగారు బాల్యానికి స్కోచ్ అవార్డు

- కలెక్టర్‌ను అభినందించిన మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాలను నివారించి బంగారు బాల్యానికి బాటలు వేసేలా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. బాల్య వివాహాలలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉండటంతో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తమీమ్ అన్సారియా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను ఇందులో భాగస్వామ్యులను చేస్తూ బంగారు బాల్యం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. జిల్లా యంత్రాంగం చేస్తున్న ఈ ప్రయత్నానికి స్కోచ్ అవార్డు దక్కింది. ప్రజంటేషన్, పబ్లిక్ ఓపీనియన్, నిపుణుల ఓటింగ్ ఇలా మొత్తం మూడు రౌండ్లలో జరిగిన ఎంపిక ప్రక్రియలో నెగ్గి అవార్డును సాధించింది. త్వరలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ అవార్డును అందుకోనున్నారు. జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు సాధించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి అభినందనలు తెలిపారు. బంగారు బాల్యం కార్యక్రమంతో జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు కలెక్టర్ చేసిన కృషి అభినందనీయమన్నారు.

డ్వామాలో బదిలీలు పారదర్శకంగా జరిగేనా?

- మ్యూచువల్‌గా దశాబ్దాల తరబడి అద్దంకి ప్రాంతంలోనే తిష్ట
- అదే అధికారులు కావడంతో వైసీపీ పాలనలో భారీగా అవినీతి
- తప్పులు బయటపడకుండా జాగ్రత్తలు
- అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్‌లు... ఎనిమిది మంది టెక్నికల్ అసిస్టెంట్‌లకు స్థానచలనం?

అద్దంకి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది బదిలీకి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో మూడు సంవత్సరాలుగా ఒకే చోట పనిచేసిన అధికారులు, సిబ్బంది బదిలీకి అవకాశం ఏర్పడింది. అయితే ఈ బదిలీలు చిత్తశుద్ధితో జరుగుతాయా లేక మొక్కుబడిగా జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు అధికారులు, సిబ్బంది దశాబ్దాలుగా అద్దంకి నియోజవకర్గాన్ని వీడకుండా ఇక్కడే తిష్ట వేసి ఉండడం, బదిలీల సమయంలో మ్యూచువల్ బదిలీలు చేయించుకుంటూ చేసిన తప్పులు బయట పడకుండా జాగ్రత్త పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ హయాంలో అద్దంకి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. వివిధ ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పెట్రోల్‌బంక్‌లు ఇతర పనులు చేసుకుంటున్న వ్యక్తులతో పాటు రాజకీయనాయకులకు కూడా మస్టర్‌లు వేస్తూ.. వేయిస్తూ... వైసీపీ నా యకులకు పంచుతూ.... తాము దండిగా తిన్నారు. పెద్ద ఎత్తున అవినీతి జరిగినా... సోషల్ ఆడిట్‌లో బయట పడుతుంది మాత్రం స్వల్పమే అన్న విమర్శలు ఉన్నాయి. సోషల్ ఆడిట్ కూడా ఎలాంటి ప్రచారం నిర్వహించకుండానే మొక్కుబడిగా నిర్వహిస్తూ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో ఉపాధి హామీ పనుల ద్వారా ఇబ్బడి ముబ్బడిగా దోచుకోవడానికి అలవాటు పడి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు అధికారులు అదే పంథాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అప్పటి అధికారులు, సిబ్బంది ఇప్పటికీ విధులు నిర్వహిస్తుండటంతో నాటి అక్రమాలు వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం 3 సంవత్సరాలు నిండిన అధికారులు, సిబ్బందిని బదిలీ చేయనుండడంతో ఇదే ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే దశాబ్దాల తరబడి ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ అవినీతిని వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా మ్యూచువల్ బదిలీలు పొందడంతో అక్కడ అవినీతి బయట పెట్టవద్దు... ఇక అవినీతి బయట పెట్టను అనే సిద్ధాంతాన్ని అవలించినట్లు తెలుస్తుంది. ఇదే విధంగా ప్రస్తుత బదిలీలలోనూ పోస్టింగ్‌లు తెచ్చుకొని ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా మాకు తిరుగులేదు అనే విధంగా వ్యవహరించాలనే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుసగుసలు వినవస్తున్నాయి. వీరి ప్రయత్నాలు ఫలిస్తాయా లేక బదిలీలు పారదర్శకంగా జరిగి వేరే ప్రాంతానికి బదిలీ అవుతారో వేచి చూడాల్సి ఉంది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, 5 గురు కంప్యూటర్ ఆపరేటర్ లు, 8 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు తప్పని సరిగా బదిలీ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. ఇదే అధికారులు, సిబ్బంది కొనసాగితే నాటి అ క్రమాలు వెలుగులోకి రాకపోగా.. ప్రస్తుతం కూడా అక్రమాలకు తెరలేపే అవకాశం లేకపోలేదన్న విమర్శలు వినవస్తున్నాయి.



బల్లికురవలో జరిగిన ప్రజావేదికలో ఉపాధి పనుల తప్పులపై ప్రశ్నిస్తున్న అధికారులు (ఫైల్)



మీ భద్రత.. మీ చేతుల్లోనే

● మహిళలకు రక్షణ కవచంలా శక్తి యాప్ ● అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న పోలీసులు

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకెళ్లిన ఆడబిడ్డ తిరిగి క్షేమంగా ఇంటికి చేరే వరకూ తల్లిదండ్రులకు ఆందోళనే. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వీటికి నివారించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మహిళలు, చిన్నారుల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రారంభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఈ యాప్‌ను ఆవిష్కరించింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చీరాల పరిధిలోని పోలీస్ శాఖ శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే సోషల్ మాధ్యమాల్లో, స్కూల్స్, కళాశాలలు, రహదారుల్లో ప్రయాణించే మహిళలు, యువతుల మొబైల్స్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయిస్తున్నారు. యాప్‌ను ఎలా వినియోగించాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలేమిటో క్షుణ్ణంగా వివరిస్తున్నారు.

యాప్ విధి విధానాలు

శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేశాక ప్రమాదకరమైన సమయంలో యాప్ ఓపెన్ చేసి షేర్ చేయగానే పోలీసులకు అర్జెంట్ అలర్ట్ చేరుతుంది. ఏ ప్రాంతంలో ప్రయాణిస్తున్నా అక్కడకు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ వివరాలు ఆ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. ఎమర్జెన్సీ కాలింగ్ నెంబర్ 100, 112లతో తక్షణ కాల్ సదుపాయం ఉంటుంది. లైవ్ ట్రాకింగ్ పద్ధతి ద్వారా లొకేషన్ తేలికగా పోలీసులకు చేరుతుంది. ఆపదలో ఉన్న వారి సమాచారం పోలీసులకు అందుబాటులో ఉంటుంది. దీంతో ఆఘమేఘాల్లో బాధితుల వద్దకు పోలీస్ టీం చేరుకొని రక్షణ కల్పించేందుకు అవకాశం ఉంటుంది.



వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినులతో యాప్ ఇన్‌స్టాల్ చేయించిన టూటౌన్ సీఐ నాగభూషణం



శక్తి యాప్‌తో ప్రయోజనం

ఫోన్‌లో శక్తి యాప్ ఇప్పుడే ఇన్‌స్టాల్ చేసుకున్నాను. చాలా ఈజీగా ఉంది. ఏదైనా విపత్కర సమయాల్లో ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ యాప్‌ను ఉపయోగించుకుని ధైర్యంగా ఉండవచ్చు. థాంక్యూ శక్తి యాప్.

- హేమలత, డిగ్రీ విద్యార్థిని



ఇకపై మహిళలు ధైర్యంగా ముందుకు సాగొచ్చు

ఉద్యోగ బాధ్యతల్లో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాం. అయితే ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలతో కొంత భయాందోళనకు చెందాం. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందదాయకం. ఇకపై మహిళలు ధైర్యంగా ముందుకు సాగవచ్చు.

- లక్ష్మీప్రియ, ఉద్యోగి

మహిళ భద్రత పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలి



మహిళల పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలి. వారిని గౌరవించాలి. యువతులపై లైంగిక వేధింపుల వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే శక్తి యాప్ ద్వారా పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. టీడీపీ కూటమి ప్రభుత్వం శక్తి యాప్‌ను ఆవిష్కరించి, అవగాహన కల్పిస్తుండడం మహిళలకు భరోసానిస్తోంది.

- సుకీర్తన, మహిళా సంఘం నాయకురాలు



మహిళలకు రక్షణ కవచం

శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం. మహిళలు, యువతులు ఫోన్ యాప్ ఉపయోగించడం వల్ల కచ్చితమైన భద్రత ఉంటుంది. పోలీసు శాఖ పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇకపై మీ భద్రత మీ చేతుల్లోనే.

- శ్రీనివాసరావు, సీఐ వన్‌టౌన్



విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో మంగళవారం జీవో నెంబరు 117, డ్రాప్ అవుట్స్ తదితర అంశాలపై విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం జీవో నెంబరు 117 ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయం తీసుకవచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించి ఇప్పటికే మార్గదర్శకాలపై ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సంబంధిత విద్యా శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అధ్యయనం చేశారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై పిల్లల తల్లిదండ్రులను సంప్రదించివారికి వివరించిన తర్వాతనే అభిప్రాయాలు తీసుకోనేలా ఎంఈవోలు గ్రామ పంచాయతీస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాల కమిటీల సమావేశంలో స్కూళ్ల వివరాలను వారికి అర్థమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఉత్తర్వుల నిర్ణయాలు లిఖిత పూర్వకంగా అమోదం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పిల్లలు ఎందుకు డ్రాప్‌అవుట్స్ అవుతున్నారో గుర్తించి వారు బడిలో చేరేలా విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు.

ఆధార్ నవీకరణను పటిష్టంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆధార్‌కార్డుల నవీకరణ ప్రక్రియను పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం ఆధార్ కార్డుల నమోదు, నవీకరణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశానికి జేసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, జీఎస్‌డబ్ల్యూ, పోస్టల్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలన్నీ పనిచేయాలన్నారు. కొత్తగా జన్మించిన శిశువుల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి 'బర్త్ రిజిస్ట్రేషన్ బేస్డ్ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్' అనే విధానాన్ని అవలంబించాలన్నారు. నవీకరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీ ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రి లేదా ఏ ఆస్పత్రిలో శిశువు జన్మించినప్పటికీ తక్షణమే ఆ శిశువు ఆధార్ నమోదు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ ఐడీ నమోదు పెండింగ్‌లో ఉండకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లాపరిషత్ సీఈవో చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ జోసెఫ్‌కుమార్, ఇతర అధికారులు

'ఉపాధి'లో అక్రమాలు

● సోషల్ ఆడిట్‌లో బహిర్గతం ● రూ.6 లక్షల రికవరీకి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశం

జరుగుమల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. 20 గ్రామ పంచాయతీల్లో చేసిన 575 పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఈ విషయం బహిర్గతమైంది. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారులు వివరాలను వెల్లడించారు. ఆ ప్రకారం.. ఏడాది కాలంలో రూ.5.07 కోట్ల వేతనం, రూ.2.34 కోట్ల మేర మెటీరియల్ కాంపొనెంట్ కలిపి రూ.7.41 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. ఈ పనులపై ఈనెల 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేపట్టాయి.

కొన్ని పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు, సంతకాలు లేకుండా మస్టర్‌లు వేయడంతోపాటు ఒకే కుటుంబంలో రెండు జాబ్‌కార్డులు ఉండటం లాంటి అంశాలను గుర్తించినట్లు ప్రజావేదికలో నివేదించారు. దాని ఆధారంగా రూ.6,09,971 రికవరీకి పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. రూ.38,500 అపరాధ రుసుం, నాటిన మొక్కలు లేకపోవడంతో రెక్టిఫికేషన్ రుసుం రూ.63,603 విధించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో రమణమూర్తి, ఏపీవో నాగరాజు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరసరఫరాలశాఖ అధికారుల దాడులు

● 16 సిలిండర్లు స్వాధీనం

కొత్తపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ విజిలెన్సు అధికారులు మంగళవారం కొత్తపట్నంలో దాడులు నిర్వహించారు. విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి గృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను వ్యాపార నిమిత్తం వినియోగిస్తున్న వ్యాపారుల నుంచి 16 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు చిరువ్యాపారులపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయిస్ డీటీ ఫిరోజ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థినులపై టీచర్ అనుచిత ప్రవర్తన

● వారం తర్వాత వెలుగులోకి వచ్చిన విషయం
● ఉపాధ్యాయుడి ఇంటి వద్ద తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన
● పామూరు సీఐ భీమానాయక్ రంగప్రవేశం
● బాధితులకు న్యాయం చేస్తామని నచ్చజెప్పి పంపిన వైనం



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు

కనిగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారంరోజుల క్రితం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు రంగారెడ్డి తనను అసభ్యకరంగా తాకుతున్నాడని ఓ మహిళా ఉపాధ్యాయినికి ఫిర్యాదు చేసింది. ఆ విద్యార్థినిని హెచ్ఎం దగ్గరకు తీసుకువెళ్లి విషయం చెప్పారు. హెచ్ఎం విద్యార్థినితో మాట్లాడిన అనంతరం ఉపాధ్యాయుడిని పిలిపించి విచారించి నోటీసు జారీ చేసి డీఈవోకు పంపారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడి నుంచి, విద్యార్థినుల నుంచి రాతపూర్వకంగా వివరాలు తీసుకుని నివేదికను డీఈవోకు అందించారు. వారం రోజుల పాటు జరిగిన ఈ విచారణ ప్రక్రియ బయటికి వచ్చింది. మరో ఆరుగురు విద్యార్థినులు కూడా ఉపాధ్యాయుడి తీరుపై ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడి ఇంటి వద్ద బంధువుల మోహరింపు

ఉపాధ్యాయుడు ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న విద్యార్థినుల బంధువులు, పెద్దలు అతని ఇంటిని చుట్టుముట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఉపాధ్యాయుడి ఇంటి వద్దకు వచ్చి ఆయన్ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిరసనగా ప్రార్ధనలు చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయబోగా స్థానిక పామూరు బస్టాండు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన సీఐ

కనిగిరి సీఐ, ఎస్ఐలు శెలవులో ఉండటంతో పామూరు సీఐ భీమానాయక్ రంగప్రవేశం చేశారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని నిరసనకారులకు నచ్చజెప్పి పంపారు. విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమానాయక్ తెలిపారు. విచారణ చేసి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంటులో ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు వచ్చే నెల 12వ తేదీ నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంటులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 12వ తేదీ నుంచి మే 11వ తేదీ వరకు ఈ శిక్షణ జరుగుతుందని ఆయన తెలిపారు. స్థానిక వెలుగు టీటీడీసీ ప్రాంగణంలో ఉన్న రూడ్‌సెట్ భవనంలో ఈ శిక్షణ జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణపై ఆసక్తి ఉన్న 19 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మహిళలు తమ వివరాలను 95733 63141 నంబర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టంగుటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి చెంచుపున్నయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, ఈసీఈ గ్రూపుల్లో చేరాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. వివరాలకు ఆయా ఆదర్శ పాఠశాలలను సంప్రదించాలని ఆయన సూచించారు.

సమాఖ్యల పుస్తకాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

● వెలుగు పీడీ నారాయణ

ఒంగోలు నగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల సమాఖ్యలకు సంబంధించిన పుస్తకాల నిర్వహణను సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పీడీ టి.నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు టీటీడీసీ భవనంలో జరిగిన మండల సమాఖ్యల అకౌంటెంట్లు, ఎల్‌సీల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలుగులోని సంస్థాగత నిర్మాణంలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ నెలలోనే కమ్యూనిటీ ఇన్వెస్టుమెంటు ఫండ్‌ను అర్హులైన పొదుపు సంఘాల మహిళలకు రుణాలుగా అందజేయలని ఆయన ఆదేశించారు. గతంలో ఇచ్చిన సీఐఎఫ్ రుణాల రికవరీపై దృష్టి సారించాలని ఆయన కోరారు. జిల్లాలోని అన్ని పొదుపు సంఘాల గ్రూపులను ఏ-గ్రేడ్‌లోకి తేవాలని కోరారు. గ్రామ, మండల స్థాయిలో జరిగే పొదుపు సంఘాల మహిళల సమావేశాలకు సిబ్బంది హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ మహిళలకు అమలు చేస్తున్న పథకాలను అందజేయాలని కోరారు.

పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కొత్తపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంబంధమైన పథకాలు అందాలంటే ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొత్తపట్నం మండల వ్యవసాయ అధికారి మోహనరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్లూరు, కొత్తపట్నం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవటం ద్వారా 14 అంకెల యూనిక్ నంబర్ వస్తుందని, ఈ నంబర్ ద్వారా అన్ని రకాల పథకాలను పొందేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అన్ని గ్రామాల్లో ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తయ్యిందని అన్నారు. పూర్తి వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మండల ఉద్యాన అధికారి తేజ మాట్లాడుతూ మండలంలోపూల సాగు, కూరగాయల సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. పూల సాగుకు రూ.6400, కూరగాయాలు సాగు చేసుకునే ఎస్సీ రైతులకు రూ.8 వేలు, పవర్ స్ప్రేయర్లకు రూ.10 వేల వరకు రాయితీ ఉందని అన్నారు. పశువైద్యాధికారి శోభ మాట్లాడుతూ సబ్సిడీపై మేత దాణా, జొన్న విత్తనాలు పొందేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ ఆంజనేయులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్ ఇప్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల సంస్థలో హమాలీలుగా పనిచేసి చనిపోయి, రిటైర్డ్ అయిన వారితోపాటు మానుకున్న వారికి వెంటనే ప్రావిడెంట్ ఫండ్ డబ్బులను ఇప్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక పౌరసరఫరాలశాఖ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీల జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిందె ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ధర్నాలో సుబ్బారావు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు సంస్థలో హమాలీలుగా పనిచేసి డ్యూటీలో ఉండి అనారోగ్య కారణాలతో, ప్రమాదంలో చనిపోయిన తొమ్మిది మంది కార్మికులకు రావాల్సిన పీఎఫ్ చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణమని విమర్శించారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆ సంస్థ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సీఐటీయూ నాయకులు మహేష్, బంగా సుబ్బారావు, టి. రాము, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సురేష్‌లు మద్దతు తెలిపారు. ధర్నాలో గోపాలరావు, శ్రీనివాసరెడ్డి, శేషయ్య, సుబ్బారావు, నాగరాజు, బోశయ్య, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, రంగయ్య, గంగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేత కాలం సుబ్బారావు



రెవెన్యూ భవన్ వద్ద నినాదాలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

సెర్ప్, మెప్మా ఉద్యోగుల మాదిరి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే సుమన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులముడి మధుబాబులు కోరారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో మంగళవారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పరాజు చినరాయుడు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సుమన్, మధుబాబులు మాట్లాడుతూ రాష్ట్రంలో మెప్మా, సెర్ప్‌లలో పని చేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. ఆ విధంగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలక శాఖల్లో పనిచేస్తున్నందున వారందరికి హెచ్ఆర్ పాలసీని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్కాస్‌ను రద్దు చేయడాన్ని వారు ఖండించారు. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తే దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ఆప్కాస్‌ను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాఘవరావు, నాగమల్లేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అవీఇవీ

20న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై సురేష్, కే శ్రీధర్‌బాబులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. హెల్త్ సెక్రటరీలకు వైద్య ఆరోగ్యశాఖ పనులను మాత్రమే అప్పగించాలని, వారిని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకురావాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. హెల్త్ సెక్రటరీలందరూ పాల్గొనాలని వారు కోరారు.

క్విస్‌లో ముగిసిన వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు

ఒంగోలు కలెక్టరేట్,మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌పై రెండురోజుల పాటు నిర్వహించిన ఐఈఈఈ వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాపులో 110 మంది విద్యార్థులు పాల్గొని టెక్నాలికి సంబంధించిన కొత్త విషయాలు, కోడింగ్ తదితర అంశాలపై శిక్షణ పొందినట్లు క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్‌శ్రీ గాయత్రీదేవిలు తెలిపారు. ఐఈఈఈ బోర్డు మెంబర్ సాయిప్రశాంత్ బ్లాక్ చైన్ టెక్నాలజీలో డేటా హ్యాండ్లింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, సీఎస్ఈ హెచ్‌వోడీ బుజ్జిబాబు, జీవీఎల్‌వీ ప్రసాద్, ఐటీ హెచ్‌వోడీ సునీత ఉన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే

ఒంగోలు క్రైం, మార్చి18 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న కొండ్రు మహేష్‌కు రూ.4వేల జరిమానా, 5 రోజులు బెయిలు లేని జైలు శిక్షను మంగళవారం న్యాయమూర్తి వీఎస్.రామారావు విధించినట్లు తెలిపారు. అదే విధంగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న మరో 15 మందికి రూ.41,000 జరిమానా విధించినట్లు సీఐ వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దనిసీఐ హితవు పలికారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

కొండపి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ ఇ.నిర్మలాకుమారి సూచించారు. మండలంలోని వెన్నూరు, కట్టుబడివారిపాలెం గ్రామాల్లో మంగళవారం ఆమె రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ, పిల్లిపెసర వేసుకుని కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏవో విజయ్‌కుమార్, సాంకేతిక వ్యవసాయ అధికారి మాల్యాద్రి, వ్యవసాయ సహాయకుడు జె.కొండలరావు పాల్గొన్నారు.

గుండ్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీ

మద్దిపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : గుండ్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని గదిలో నగదు చోరీ ఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై శివరామయ్య కథనం ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి హైస్కూల్‌లోని హెచ్ఎం గదిలో ఉన్న బీరువా లాకర్‌ను పగులకొట్టి రికార్డులు చెల్లాచెదురుగా పడవేశారు. స్కూల్ మెయింటెనెన్స్ నగదు రూ.10 వేలు తస్కరించారు. ఉదయాన్నే ప్రధానోపాధ్యాయుడు మండవ ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు స్కూలుకి రావడంతో ప్రధానోపాధ్యాయుని గది తాళం పగలగొట్టి ఉండడం, రికార్డులన్నీ చల్లాచెదురుగా పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు హెచ్ఎం గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సై శివరామయ్య పాఠశాలను సందర్శించి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వెల్లంపల్లిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభం

మద్దిపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : వెల్లంపల్లి వేలం కేంద్రంలో బుధవారం నుంచి పొగాకు కొనుగోలు ప్రారంభించనున్నట్లు వేలం కేంద్రం కార్యనిర్వహణ అధికారి కోవి రామకృష్ణ చెప్పారు. చంద్రపాడు క్లస్టర్ నుంచి నాణ్యమైన పొగాకు బేళ్లు 18 అనుమతిచ్చినట్లు తెలిపారు. వేలం కేంద్రం ప్రారంభానికి పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, ఆర్.ఎం. లక్ష్మణరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. అదేవిధంగా రైతు సంఘం నాయకులు, వేలం కేంద్రం సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఉంటాయని రైతులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

మద్దిపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లాపల్లి పారిశ్రామిక వాడ పరిధిలోని పలు ప్రాంతాలలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. గుండ్లాపల్లి పారిశ్రామిక వాడలో లెవెన్ కె.వి.ఫీడర్ పరిధిలో నూతనంగా విద్యుత్ లైను నిర్మిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. పారిశ్రామిక వాడలోని 11 కేవీ ఫీడర్ 4 పరిధిలో వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఫార్మారంగంలో ఉజ్వల భవిష్యత్

ఒంగోలు విద్య, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కెమిస్ట్రీలో మంచి ప్రతిభా పాటవాలు ఉన్న విద్యార్థులకు ఫార్మా రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి. హరిబాబు చెప్పారు. యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన కెరీర్ అపరునిటీస్ ఫర్ ఆర్గానిక్ కెమిస్ట్స్ ఇన్ ఫార్మా అవగాహన సదస్సుకు హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్క్రిప్టని ఫార్మా వైస్ చైర్మన్ దావూరివరాల రవి మాట్లాడుతూ ఫార్మా రంగంలో విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఫార్మా రంగానికి కెమిస్ట్రీ అనుబంధ రంగంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజమోహన్‌రావు, ఉబ్బా ఈతముక్కల, జాస్మిన్ ఉన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.280

సంతనూతలపాడు, మార్చి 18 : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం అమ్మకాలకు చిలంకూరు క్లస్టర్ నుంచి 226 పొగాకు బేళ్లు రాగా 170 బేళ్లు అమ్ముడైనట్లు, 56 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరిండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.280, కనిష్ఠ ధర రూ.260 పలికిందని చెప్పారు. సరాసరి ధర రూ.271.93 వచ్చినట్లు ఆయన తెలిపారు. కొనుగోలులో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెల్లి ఉపకులాలుగా బేడజంగాలను చేర్చడం అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బేడజంగం ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెల్లి ఉపకులాలుగా బేడజంగాలను చేర్చుతూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బేడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉద్దండి మల్లికార్జునరావు చెప్పారు. స్థానిక ఎంసీపీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బేడజంగాన్ని ఉపకులాల్లో చేర్చేందుకు ఈనెల 20న నేషనల్ ఎస్సీ కమిషన్‌కు పంపుతామని చెప్పడం హర్షణీయమన్నారు. కొన్నేళ్లుగా బేడజంగంలో చదువుకున్న విద్యార్థులకు కుల సర్టిఫికెట్లు లేక ప్రభుత్వం ద్వారా వచ్చే అనేక పథకాలను విద్యార్థులు అందుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రంగరాజ మిశ్రా కమిషన్ ఎదుట కూడా తమ సమస్యలు విన్నవించుకోవాలన్నారు. వర్గీకరణలో ఎస్సీ ఏలో చేర్చడం బేడసంఘానికి ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగంటి నాగేశ్వరరావు, మరిపూడి భద్రయ్య, ఈయనగంటి ఆనందరావు, నాటకం శంకరరావు, తోట మల్లికార్జునరావు, కాకుమాను రవి, పగడల చిరంజీవి, బి. కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు కోరారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి సమస్యను విన్నవించారు. సచివాలయాల్లో రిక్రూట్‌మెంట్ అయ్యి నాలుగేళ్ళు గడుస్తున్నా ఇంత వరకు తగిన ఉద్యోగోన్నతి లేకుండా పోయిందన్నారు. తమతో పాటు రిక్రూట్ అయిన మిగిలిన శాఖల సచివాలయ ఉద్యోగులు అనేక మంది ఉద్యోగోన్నతులు పొంది వెళ్తున్నా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మాత్రం అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల్లో ఒకేసారి నాలుగు ఇంజనీరింగ్ శాఖల పనులు చేయాల్సి రావడంతో అనేక ఒత్తిడీలను ఎదుర్కొంటున్నామన్నారు. అందువల్ల పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్ వంటి వివిధ ఇంజనీరింగ్ శాఖల్లోకి తమను రేషన్‌లైజేషన్ చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ శివసూర్యతేజ, జిల్లా నాయకులు రామాంజనేయులు, వెంకటరమేష్, రాజేష్‌తో పాటు పలువురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నాణ్యమైన రొయ్యల సీడ్‌ను రైతులకు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రొయ్యల యజమానులకు నాణ్యమైన మడగాస్కర్ బ్లాక్ టైగర్ సీడ్‌ను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం హెచరీ యజమానులు, సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాలుగేళ్ల నుంచి వెనామీ రొయ్యల రకం సాగు తీవ్ర ఒడిదొడుకులుతో సాగుతోందని, దీంతో రెండేళ్ల నుంచి రొయ్యల రైతులు బ్లాక్ టైగర్ రొయ్యల సాగు వైపు క్రమక్రమంగా మొగ్గు చూపుతున్నారని చెప్పారు. జిల్లాలో మోనోడాన్ బ్లాక్ టైగర్, మడగాస్కర్ బ్లాక్ టైగర్ అనే రెండు రకాల రొయ్యలను సాగు చేస్తున్నారని తెలిపారు. గత ఏడాది మోనోడాన్ బ్లాక్‌టైగర్ రకం రొయ్యల సాగు చేసిన రైతులు నాసిరకం సీడ్ వల్ల నష్టపోయారన్నారు. అందువల్ల ఈ ఏడాది నరైతులు మడగాస్కర్ బ్లాక్ రకం రొయ్యల సాగుకు మొగ్గు చూపుతున్నారని, నాణ్యమైన సీడ్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథ్, హేచరీస్ తరఫున యానిబయా అక్వాటెక్ రామరాజు, మున్నంగి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక, విద్యా కోర్సుల అమలుపై మాగుంట ప్రశ్న


ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్థిక విద్యా కోర్సుల అమలుపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సంఖ్య, శిక్షణా కార్యక్రమాలు, నిధులు తదితర అంశాలపై మాగుంట మాట్లాడారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి జయంత్‌చౌదరి సమాధానమిస్తూ అభ్యాసకులకు బహుళ నైపుణ్యం కలిగించేందుకు ఆర్థిక విద్యా కోర్సుల ఆవశ్యకతను నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 గుర్తించిందన్నారు. అందులో భాగంగా పాఠశాలల్లో ఆర్థిక శాస్త్రం, వ్యాపార విద్యా కోర్సుల అంశాలు ఉత్తేజకరమైన రీతిలో వివిధ స్థాయిల్లో డబ్బు విలువ, బ్యాంకింగ్, భీమా, ఈ కామర్స్, ఈ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఆర్థికపరమైన వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా పాఠశాలల్లో 9నుంచి 12వ తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఆర్థిక విషయాలు, బ్యాంకింగ్ ఆర్థిక విషయాలు, భీమా సేవలను తెలియజేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న విద్యుత్తు మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయుసీ ఆధ్వార్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక విద్యుత్తు భవన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహిచారు. రానున్న కాలంలో స్మార్టు మీటర్లు ఏర్పాటు వలన విద్యుత్తు రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, వారి విద్యార్హతలను బట్టి విద్యుత్తు సంస్థలలో ఉద్యోగం కల్పిచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా విద్యుత్తు రీడర్ల వేతనాలు పెండింగ్ లేకుండా ఇవ్వాలని కోరారు.

ధర్నా అనంతరం విద్యుత్తు శాఖ డీఈ హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు సిద్ధయ్య, నాగార్జున రెడ్డి, శ్రీహరి, విజయదత్తు కొండలు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు విద్యుల్లతకు సన్మానం



విద్యుల్లతను సన్మానిస్తున్న తోటి అధ్యాపకులు

ఒంగోలు విద్య, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలిగా ఐదేళ్లుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న విద్యుల్లతను మంగళవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈనెల 31న ఆమె ఉద్యోగవిరమణ చేయనున్న నేపథ్యంలో సత్కరించారు. విద్యుల్లత ప్రస్తుతం యర్రగొండపాలెంమోడల్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు. విద్యుల్లత సేవలను కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి. అనంతలక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఇందిర, మంజులాభారతి, శ్రీనివాసులు, సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్షించిన ఎంపీడీవో



సమీక్షిస్తున్న ఎంపీడీవో సురేష్

సంతనూతలపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నిరక్ష్యరాశులైన మహిళలను అక్ష్యరాశులుగా తీర్చిదిద్దే కార్యక్రమం ఉల్లాస్‌పై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సురేష్‌కుమార్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాత్రివేళల్లో రెండునెలలుగా నిరక్ష్యరాశులైన మహిళలకు విద్యను నేర్పిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు వారు నేర్చుకున్న విద్యపై పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు డీఆర్‌డీఏ సీసీలు సూపర్‌వైజర్లుగా, అంగన్‌వాడీ టీచర్లు ఇన్విజిలేటర్లుగా, సమన్వయకర్తగా ఆడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ కే జ్యోతి వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాలు చోరీ

నాగులుప్పలపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి నిర్మాణానికి తీసుకొచ్చిన సిమెంట్ బస్తాలు చోరీకి గురయ్యాయి. సూపర్‌వైజర్ విజయభాస్కరరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మాచవరం-ఉప్పుగుండూరు గ్రామాల మధ్య రెండు ప్రాంతాలలో హైలెవల్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టరు తెప్పించిన సిమెంట్ బస్తాలు చోరీకి గురయ్యాయి. రెండు చోట్లా ఆ బస్తాలను నిల్వ చేశారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 50 బస్తాలను చోరీ చేశారు. ఉదయాన్నే విధులకు వచ్చిన సూపర్‌వైజర్ విజయభాస్కరరెడ్డి సిమెంట్ బస్తాలు చోరీకి గురైనట్లుగా గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ఒంగోలు క్రైం, మార్చి18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు 25 శాతానికి పెంచాలని, వర్గీకరణలో శాస్త్రీయత లేదని పలు మాల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మంగళవారం స్థానిక ప్రకాశం భవన్ వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్ హడావిడిగా నివేదిక ఇచ్చిందని పలువురు ఆరోపించారు.మాల ఉద్యోగులు సంఘం నాయకులు తులబిలి అశోక్, దాసరి చెన్నకేశవులు, బిళ్లా వసంతరావు, చిట్టిమాల సంపత్‌కుమార్, కె.వి.కృష్ణారావు పాల్గొన్నారు.

వర్గీకరణకు ఆమోదం హర్షణీయం

సింగరాయకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణకు మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ అన్నారు. స్థానిక సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల మాదిగల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికకు ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రేణుమాల మాధవ, వెంకటేష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను అందించిన టీడీపీ నేతలు



సీసీ కెమెరాలను అందజేస్తున్నదాతలు

సంతనూతలపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు గ్రామ టీడీపీ నాయకులు గోగినేని సుబ్బయ్య, కల్లూరి వెంకటశేషయ్యల ఆధ్వర్యంలో రూ.50వేల విలువచేసే సీసీ కెమెరాలను సంతనూతలపాడు పోలీసులకు అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ దాతల సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను త్వరలో లక్ష్మీపురంలో ఏర్పాటుచేస్తామని ఎస్సై అజయ్‌బాబు చెప్పారు.

క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆటల పోటీల్లో మంగళవారం ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. సహచర ఎమ్మెల్యేలతో క్రికెట్ ఆడారు.



మంత్రి మనోహర్‌తో బీఎన్

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా టంగుటూరు (మం), టంగుటూరు గ్రామం విష్ణలయం వీధి, డోర్ నెం. 6-76 నివాసులు అయిన **1. పోతుల రామారావు గారి భార్య పోతుల ప్రేమకుమారి మరియు వీరి కుమార్తె అయిన పోతుల హర్షిత గార్లు** మాకు సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియ జేయునది ఏమనగా.

నాక్లైంట్స్‌లలో ఒకటవ వారు అయిన పోతుల ప్రేమకుమారి గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిలో కొంత ఆస్తిని ఒంగోలు సబ్ రిజిస్టారుగారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజుల నెం. 2614/2012 మరియు 2616/2012 ద్వారా నున్న మరియు రెండవ వారైన పోతుల హర్షితగారు దిగువ షెడ్యూల్ దాఖాలా ఆస్తిలో కొంత ఆస్తిని ఒంగోలు సబ్ రిజిష్టారు వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెంబర్లు 2613/2012 మరియు 2615/2012 ద్వారా కొనుగోలు చేసి ఉన్నారని సదరు దస్తావేజులకు లింక్ దస్తావేజులు అయిన ఒంగోలు సబ్‌రిజిస్టార్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన నెం. 5228/1993, 5229/1993, 5415/1992, 1946/1993, 4699/1991, 4701/1991, 4717/1991, 4713/1991, 5349/1991, 5454/1991, 1087/1992, 2539/1992, 429/1992, 2534/1992, 2935/2004, 2936/2004, 2937/2004, 2938/2004, 2939/2004, 3044/2004, 3045/2004, 3046/2004, 3047/2004, 5083/1991, 5350/1991, 5351/1991, 5352/1991, 5408/1991, 1955/1992, 1956/1992, 1957/1992, 1960/1992, 2581/1992, 5234/1992, 5236/1992, 5346/1992, 451/1994, 791/1992, 792/1992, 833/1992, 1081/1992, 2538/1992, 3432/1998, 3433/1998 దస్తావేజులను మాక్లయింట్‌లలో ఒకటవ వారికి భర్త మరియు రెండవ వారికి తండ్రిగారైన పోతుల రామారావు గారికి పర్సనల్ అసిస్టెంట్ అయిన కందుకూరి వెంకయ్య గారి కుమారుడు రాము గారు టంగుటూరు నుండి ఒంగోలుకి తన బైక్‌పై వస్తు సదరు పైన పేర్కొనబడిన లింక్ దస్తావేజులు అన్నింటిని పొగొట్టుకు న్నారని సదరు విషయమై వారు టంగుటూరు పోలీసు వారికి ఫిర్యాదు చేసిఉన్నారని సదరు పోలీస్ వారు పోయిన దస్తావేజులు దొరకలేదని తేది. 13-03-2025న సర్టిఫికేట్ ఇచ్చియున్నారు. సదరు పోయిన దస్తావేజులు ఎంత వెతికినను ఈ రోజు వరకు దొరకలేదని తెలియజేసినారు. కావున ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైనను ఏవిధమైన హక్కులుగాని అభ్యంతరములు గాని ఉన్న యెడల లేద సదరు పోయిన దస్తావేజులు దొరికిన యెడల లిఖిత పూర్వకంగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించిన (15) దినములలోపు ఈ క్రింది సంతకం దారును సంప్రదించగలరు. లేనియెడల ఎవరికి ఎవిధమైన అభ్యంతరములు గాని హక్కులు గాని లేవని మరియు సదరు పోయిన దస్తావేజులు దొరకలేదని భావించి మా క్లైంట్ల్ ఈ క్రింది షెడ్యూలు దాఖాలా ఆస్తిపై లావా దేవిలు జరుపగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములు నా క్లైంట్లను గాని, తదుపరి జరుగు లావాదేవీలనుగాని బద్ధపరచ జాలవని యావన్మందికి తెలియ జేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం అనంతవరం గ్రామ పంచాయితీలో చేరిన అనంతవరం గ్రామం తాలుకు నాక్లైంట్లలో 1వ వారికి హక్కు కలిగిన సర్వే నెం. 152/1లో య.4-34 సెంట్లు, సర్వేనెం. 152/2లో య. 2-40 సెంట్లు, సర్వే నెం. 153లో య 4-92 సెంట్లు, సర్వేనెం. 162లో య. 2-55 సెంట్లు, సర్వేనెం. 163లో య. 5-15 సెంట్లు, సర్వేనెం. 164లో య. 2-64 సెంట్లు మరియు నా క్లైంట్లలో 2వ వారికి హక్కు కలిగిన సదరు గ్రామంలో సర్వేనెం. 154లో 0-75 సెంట్లు, సర్వేనెం. 159/1లో య. 1-8175 సెంట్లు, సర్వేనెం. 160లో య. 5-49 సెంట్లు, సర్వేనెం. 161లో య. 6-36 సెంట్లు, సర్వే నెం. 164లో య. 2.44 సెంట్లు, సర్వేనెం. 165లో య. 6-91 సెంట్లు, సర్వే నెం. 166లో య. 1-00 సెంట్లు, సర్వే నెం. 167లో య. 0-42 సెంట్లు మరియు సర్వేనెం. 168లో య. 0-53 సెంట్లు భూమిన్ను వెరసి ఏకప్రదేశంగా వున్న య. 47.7175 సెంట్లు భూమికి హద్దులు. **తూర్పు** : మూసీనది కొంతవరకు, ఉప్పలపాటి రామచంద్రరాజు భూమి కొంతవరకు. **దక్షిణం** : డొంక, **పడమర** : బండ్ల బాట, **ఉత్తరం** : మూసీనది కొంత వరకు డికె భూమి కొంత వరకు. ఈ హద్దులలోని య. 47.7175 సెంట్లు భూమి.

ఒంగోలు
తేది.
18-03-25

చల్లా వెంకటప్పారెడ్డి, అడ్వకేట్
డోర్ నెం. 46-139-63, 2వ లైను,
వేంకటేశ్వరస్వామి దేవాలయం దగ్గర,
సమతానగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా
సెల్ : 98480 44909

అవీ..ఇవీ

జంటహత్యల కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పెద్దదోర్నాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబొమ్మలాపురం జంట హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషనులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు బొమ్మలాపురం గ్రామంలోని సెంటున్నర గ్రామకంఠం స్థలంవివాదంలో ఆదే గ్రామానికి చెందిన దూదేకుల నాగూర్‌వలి, నూర్జహాన్‌బీ వారి ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా పెట్రోల్ పోసి నిప్పంటించి మృతికి కారణమైన నిందితుడు దూదేకుల ఖాశింవలిని చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

● మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్దదోర్నాల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి నారా.చంద్రబాబునాయుడు ఇటీవల మార్కాపురంలో శక్తియాప్‌ను లాంఛనంగా ప్రారంభించారని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఈ యాప్ ద్వారా మహిళలు అత్యవసర సమయాల్లో తమ లొకేషన్ షేర్ చేయడం వల్ల కంట్రోల్ రూమ్‌కు సమచారం అందుతుందన్నారు. అక్కడి నుంచి తక్షణమే సంబంధిత స్థానిక పోలీసులకు సమాచారం అందించి అవసరమైన సహాయాన్ని అందిస్తారన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ఆరు శక్తి యాప్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. అలాగే సబ్‌డివిజన్‌లో రాజమోహన్, హర్యామన్‌టీంలు ప్రత్యేక సేవలందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై వీ మహేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, ఐఆర్ ప్రకటించాలి

గిద్దలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉగాది కానుకగా పెండింగ్ డీఏలు ఐఆర్ ప్రకటించాలని, అన్నిరకాల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నూతన కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. వారి ఆశలు అడిఆశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్ఐ ప్రకటించి నెలాఖరులోపు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కీర్తి, జిల్లా అధ్యక్షులు వెంకట్రావు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పంచాయతీకి ఒక మోడల్‌స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు కబీర్, వెంకటేశ్వర్లు, పాండురంగస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విద్యుత్ లోడు వినియోగం క్రమబద్ధీకరణకు అవకాశం

పొదిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గృహవినియోగదారులు స్వచ్ఛందంగా విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు పెరిగిన వినియోగానికి అనుకూలంగా ప్రస్తుతం లోడ్లు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. దీనిపై అవగాహన లేక వినియోగదారులు జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈనేపథ్యంలో 50శాతం రాయితీతో ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తోందన్నారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీవరకు ఉందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలి

మార్కాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిర్వహించనున్న ప్రజాచైతన్యయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య కోరారు. మండలంలోని వేమలకోట గ్రామంలో మంగళవారం ప్రజాచైతన్యయాత్ర కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పశ్చిమ ప్రకాశం ప్రజల ప్రధాన సమస్యలు వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం, మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణం, నూతన జిల్లా ఏర్పాటు తదితర సమస్యలపై పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో గ్రామ నాయకులు జనమాల నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాటంరాజు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం


తిరునాళ్ల ఏర్పాట్లపై చర్చిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి). ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న కాటంరాజు తిరునాళ్ల ఏర్పాట్లపై స్థానిక బీసీ భవన్‌లో ఆ సంఘం నాయకులు పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లెబోయిన వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 29న పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామ సమీపంలో వెలసిన వేనూతల కాటంరాజు తిరునాళ్లను వైభవంగా నిర్వహించాలని కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకోసం తగు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాముల పోలురాజు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుమ్మా గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, గోపాల్, గాలెయ్య, వెంకటేష్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు..

నాణ్యమైన రొయ్యల సీడ్‌ను రైతులకు సరఫరా చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రొయ్యల యజమానులకు నాణ్యమైన మడగాస్కర్ బ్లాక్ టైగర్ సీడ్‌ను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం హెచరీ యజమానులు, సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాలుగేళ్ల నుంచి వెనామీ రొయ్యల రకం సాగు తీవ్ర ఒడిదొడుకులుతో సాగుతోందని, దీంతో రెండేళ్ల నుంచి రొయ్యల రైతులు బ్లాక్ టైగర్ రొయ్యల సాగు వైపు క్రమక్రమంగా మొగ్గు చూపుతున్నారని చెప్పారు. జిల్లాలో మోనోడాన్ బ్లాక్ టైగర్, మడగాస్కర్ బ్లాక్ టైగర్ అనే రెండు రకాల రొయ్యలను సాగు చేస్తున్నారని తెలిపారు. గత ఏడాది మోనోడాన్ బ్లాక్‌టైగర్ రకం రొయ్యల సాగు చేసిన రైతులు నాసిరకం సీడ్ వల్ల నష్టపోయారన్నారు. అందువల్ల ఈ ఏడాది నరైతులు మడగాస్కర్ బ్లాక్ రకం రొయ్యల సాగుకు మొగ్గు చూపుతున్నారని, నాణ్యమైన సీడ్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథ్, హేచరీస్ తరఫున యూనిబయా అక్వాటెక్ రామరాజు, మున్నంగి రాజశేఖర్ పాల్గొన్నారు.

పంట కాలువలపై అక్రమ కట్టడాలు

● దశాబ్దకాలంగా పరిష్కరించని అధికారులు
● రెవెన్యూ అధికారులు సహకరించడం లేదంటున్న ఇరిగేషన్ శాఖ


ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పంటకాలువ మీద ఉన్న ఆక్రమణలు

కంభం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కంభం చెరువు పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కాలువ గట్లపైనే కొందరు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు, వంతెనలు నిర్మించారు. దీంతో కాలువల్లో పూడిక తీసేందుకు అంతరాయం ఏర్పడడమే కాకుండా, పొలాలకు నీరు సక్రమంగా వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పటికే నక్కలగండి కాలువల, ప్రధాన పంటకాలువలను ఇరువైపులా ఆక్రమించి పక్కాగృహాలు నిర్మించుకున్నారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసిన ఇళ్లస్థలాల పేరుతో ఆర్టీసీ బస్టాండ్ ముందు వైపు, రావిపాడు వెళ్లే మార్గంలో కొందరు చప్టాలను, బహుళ అంతస్తులను నిర్మించారు. ఈ విధంగా నిర్మాణాలు కొనసాగడంతో ప్రధాన కాలువలన్నీ పిల్లకాలువలుగా, మురికి కాలువలుగా మారిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ప్రధాన కాలువల నుంచి తూములను ఎత్తేందుకు గతంలో జీపులు, లారీలు వెళ్లేవని, ప్రస్తుతం ఆక్రమణ కారణంగా నడిచేందుకు కూడా వీలులేకుండా పోయిందని వాపోతున్నారు. ఈ విషయంలో గతంలో ఎన్నోసార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు చెబుతు న్నారు. ఇటీవల ఇరిగేషన్, రెవె న్యూ అధికారులు అక్రమ కట్టడాలను పరిశీలించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చారు. అయినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. ఇరిగేషన్ కాలువల మరమ్మతులకు పూడికతీతకు రూ.36లక్షలు మంజూ రు కాగా 3 నెలలక్రితం కాలువలో పూడిక తీసి గట్లపైనే పడేశారు. ప్రస్తుతం ఆ చెత్త కాలువలోనికి చేరుతోంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురిం చింది. స్పందించిన ఏఈ శ్రీనివాస్ నాయక్ వారంలోపు కాలువగట్లపై ఉన్న పూడికను తీయిస్తానని చెప్పారు. ఆ సమయం దాటి నెలగడిచినా, సమస్య పరిష్కరించలేదని రైతులు పేర్కొంటున్నారు.


జాతీయ రహదారిపై పంటకాలువపై ఆక్రమణలు

ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్ వివరణ

పంట కాలువల ఆక్రమణలు, పూడికతీతపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్‌ను వివరణ కోరగా గతవారంలో రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేశామన్నారు. తరువాత రెవెన్యూ అధికారులు రాలేదని, వారితో కలిసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పూడికతీత పనులు కూడా చేస్తామన్నారు.

చెరువు అభివృద్ధి నిధులు పక్కదారి

కంభం చెరువు పంటకాలువల మరమ్మతలకు మంజూరైన లక్షల నిధులను ఇరిగేషన్ అధికారులు పక్కదారి పట్టిస్తున్నారు. తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నిధుల దుర్వినియోగంపై, ఇరిగేషన్ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

పార్శ ఆదినారాయణ, నీటి సంఘం అధ్యక్షులు

విద్యుత్ మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న మీటర్ రీడర్ల యూనియన్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్‌లకు ఉద్యోగభద్రత కల్పించాలని సీపీఐ రాష్ట్ర నాయకులు అందె నాసరయ్య అన్నారు. మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదురు ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బైఠాయింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థనే నమ్ముకుని 25 ఏళ్లగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడకుండా విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని పోరాటాలు చేసినట్లు తెలిపారు. దీంతో నాలుగు అంశాలపై మినిట్స్ రూపంలో మీటర్ రీడర్‌లకు హామీ ఇచ్చారన్నారు. స్మార్ట్ మీటర్‌లు వస్తే మీటర్ రీడర్‌లకు ప్రత్యామ్నాయ ఉపాధి ఎస్క్రో అకౌంట్ ద్వారా ప్రతి నెల వేతనాలు చెల్లింపు చేయాలని సీఎండీలు ఆదేశించినా కిందిస్థాయి అధికారులు అమలు పర్చడం లేదని అన్నారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పని దినాలు అమలు చేయాలన్నారు మీటర్ రీడర్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సబ్ స్టేషన్‌లలో ఐటీఐ అర్హత ఉన్నవారిని షిఫ్ట ఆపరేటర్లగా వాచ్ అండ్ వార్డుగా నియమించా లన్నారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన సర్కిల్ ఆఫీసుల్లో అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్‌లుగా, అంటెడర్‌లుగా, వాచ్‌మెన్ లుగా నియమించాలని అన్నారు. కార్య క్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.నారాయణ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ ఖాశీం, మీటర్ రీడర్‌ల సంఘం నాయ కులు ఎం.రాజేష్, టీవీ రామాంజనేయులు, షేక్ మౌలాలి, దేవి వరప్రసాద్, రమేష్ రెడ్డి, నాసర్ బాబు, షేక్ మహమ్మద్ ఉస్సేన్ అన్వర్, కృష్ణారెడ్డి, షేక్ ఉమర్, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావుకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు.

కూటమితోనే ఎస్సీలకు న్యాయం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు
● వర్గీకరణకు ఆమోదంపై హర్షం


ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న ఎస్సీ నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీ వర్గానికి పూర్తిన్యాయం జరుగుతుందని, వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం అమోదం తెలిపిన సందర్భంగా హర్షం వ్యక్తం చేసి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ముందుగా ఎస్సీ నాయకులతో కలసి కేక్‌కట్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ నాయకులు ఎరిక్షన్‌బాబుకు గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్ల అభ్యున్నతికి కృషి

నియోజవర్గం పరిధిలోని పాస్టర్ల అభ్యున్న తికి కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జీ ఎరిక్షన్ బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పాస్టర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కరించే దిశగ అడు గులు వేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో బరిగెల దేవయ్య, పల్లె విలియంబాబు, చేదూరి లక్ష్మయ్య, దర్శనం యోహన్, వీరదాసు సామియేలు, చేదూరి పాలంకయ్య, మండాది జయపాల్, చేదూరి చిన్న ఏసు, కొర్రపోలు మరియ బాబు, కిన్నెర దేవదానం తదితరులు పాల్గొన్నారు.

నేడు పౌష్టికాహార కిట్ల పంపిణీ

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ శ్రీశైలం వారి ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార కిట్లు, ఎలక్ట్రికల్ టూల్ కిట్లు పంపిణీ చేయనున్నారు. స్థానిక డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు హాజరుకానున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఏవో జవహర్‌లాల్‌నాయక్


గిద్దలూరులో మాట్లాడుతున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

పెద్దదోర్నాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని కటకానిపల్లె, రామచంద్రకోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా రాయితీతో అందజేస్తున్న యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ శ్వేత, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని కొత్తపల్లి, గిద్దలూరు రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలను నిర్వహించారు. ఏవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లా డుతూ భూసార పరీక్షల ఆవశ్యకత - దాని వలన కలిగే లాభాలు వివరించారు. మట్టి నమూనా సేకరణ, వివిధ దశల్లో ఎలా చేపట్టాలో వివరించారు. భూసార పరీక్ష పత్రాలలో వచ్చిన విశ్లేషణ ఆధారంగా సిఫారసు ప్రకారమే రసాయన ఎరువులు వినియోగించాలన్నారు. సూక్ష్మ పోషకాలు రాయితీపై పొందాలంటే తప్పని సరిగా భూసార పరీక్ష ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

రెల్లి ఉపకులాలుగా బేడజంగాలను చేర్చడం అభినందనీయం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బేడజంగం ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెల్లి ఉపకులాలుగా బేడజంగాలను చేర్చుతూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం అభినందనీమని బేడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉద్దండి మల్లికార్జునరావు చెప్పారు. స్థానిక ఎంసీఏ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బేడ జంగాన్ని ఉపకులాల్లో చేర్చేందుకు ఈనెల 20న నేషనల్ ఎస్సీ కమిషన్‌కు పంపుతామని చెప్పడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగంటి నాగేశ్వరరావు, మరిపూడి భద్రయ్య, ఆనందరావు, నాటకం శంకరరావు, మల్లికార్జునరావు, కాకుమాను రవి, పగడల చిరంజీవి, బి. కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


మార్కాపురం - మాచర్ల జాతీయ రహదారిపై ఉదయం వేళ లైట్లతో వెళతున్న వాహనచోదకులు, మంచుకమ్మిన రోడ్లు

మంచువేళలో పొంచి ఉన్న ప్రమాదాలు

జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వాతవారణ మార్పుతో మార్కాపురం - మాచర్ల జాతీయ రహదారిపై మూడు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో రహదారులు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పుల్లలచెరువు మండలం మల్లాపాలెం వద్ద జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం రోడ్డుప్రమదం జరిగి ఒక వ్యక్తితో పాటు గొర్రెలు మృతి చెందాయి. దీంతో ఈ మంచుతో రహదారి కనిపించకపోవడమే అని పలువురు చెబుతున్నారు. అదేవిధంగా మంగళవారం కూడ అదేరీతిలో మంచు జాతీయ రహదారిని కమ్మేసింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకోని మరి నెమ్మదిగా ప్రయాణం చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ అధికారులు వాహనదారులకు పలు సలహాలు ఇచ్చారు. మంచుకురుస్తున్న సమయంలో ప్రమాదాలు జరగకుండ జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు. ఏదిఏమైన తెల్లవారుజామున నుండి 8 గంటల వరకు మంచుకమ్మేస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

వనజకు డాక్టరేట్


వనజ

గిద్దలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం ఎస్.బయనపల్లి గ్రామానికి చెందిన వనజ గోష్ఠికి డాక్టరేట్ లభించింది. గణితశాస్త్రంలో 'ఏపెక్స్ ఆఫ్ బౌండరీ స్లిప్ అండ్ వేరియబుల్ ఫిజికల్ ప్రాపర్టీస్ ఆన్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టూ ఫ్లూయిడ్ ఫ్లోస్ ఇన్ ఎ వర్టికల్ ఛానల్ అనే అంశంలో వనజ చేసిన పరిశోధనకు గాను సత్యసాయి జిల్లాలో ఉన్న భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజి ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని గణితశాస్త్ర ఆచార్యులు డాక్టర్ జి.శ్రీనివాస్ పర్యవేక్షణలో వనజ ఈ అంశంపై పరిశోధన చేశారు. బయనపల్లె గ్రామానికి చెందిన చక్రపాణిరెడ్డి భార్య అయిన వనజ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమెను గ్రామస్థులు అభినందించారు.

చల్లా అశోక్‌రెడ్డికి సేవా పురస్కారం


అవార్డు అందుకుంటున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'మేమున్నాము' సేవా సమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డికి సేవా అవార్డు లభించింది. పొన్నూరుకు చెందిన ఉమాశంకర్ అనేవ్యక్తి బ్లడ్‌సొసైటీ సంస్థను ఏర్పాటు చేసి తొమ్మిదేళ్ల పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో దాతల ద్వారా వందలాది మందికి ఉచితంగా రక్తదానం చేయిస్తున్న 'మేమున్నాము సేవాసమితి' అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక సేవా అవార్డును అందచేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

గిద్దలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డంపల్లి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని బీజేపీ నాయకులు గుమ్మారాముడు, మట్టిమల్ల పుల్లయ్య అధికారులను కోరారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో చెన్నారావును కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. వేసవి మొదలైనందున నీటి సమస్య మరింత పెరుగుతుందని, వెంటనే స్పందించి కొత్తగా డీప్‌బోరు వేసి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఆవోపా ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న ఆవోపా అధ్యక్షుడు లక్ష్మణరావు

పెద్దారవీడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని కలనూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు చీదెళ్ల లక్ష్మణరావు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ గతంలో పాఠశాలలో ఫ్యాన్లు ఏర్పాటు, విద్యుదీకరణ పనులకు ఆవోపా సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రామకృష్ణ, సీహెచ్.మహేష్, బి.మల్లికార్జునరావు, . బి.శ్రీరాములు, కె.సులోచనరాణి, సిహెచ్‌కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ సుకుమార్

తర్లుపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈవోపీ ఆర్డీ సుకుమార్ అన్నారు. తర్లుపాడు బస్టాండ్ కూడ లిలో చిరువ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వ్యాధులు వస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరు వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని, తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్తబుట్టల్లో వేస్తే కార్మికులు తీసుకెళ్తారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ పదార్థాలు వేస్తే చట్టరీత్యా వారికి అపరాధం విధిస్తామన్నారు. చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయటం వలన దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలతాయన్నారు. అటువంటి వ్యర్థాలను డంపింగ్ యార్డులలోనే వేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. చిరువ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెపోగు వరాలు, ప్రజలు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత

కంభం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంబొట్ల కృష్ణాపురం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైల్వేగేటు నెంబరు 217 వద్ద ట్రాక్ మరమ్మతుల పనులు నిర్వహిస్తుండడంతో ఈ నెల 19న ఉదయం 7 గంటల నుండి 21వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం నుంచి తురిమెళ్ల, రాచర్ల, గిద్దలూరు వెళ్లే ప్రయాణికులు జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామం లోపలికి వెళ్లి రైల్వేగేటు నెంబరు 216 మీదుగా గిద్దలూరు వెళ్లాలని సూచించారు.



ప్రధాన రహదారిపై ఉదయం దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఉదయం పొగమంచు.. మధ్యాహ్నం భగ భగ

దొనకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో విచిత్ర వాతావరణ పరిస్థితులు ఇటీవల కాలంలో నెలకొంటున్నాయి. ఉదయం దట్టంగా పొగమంచు కురుస్తుండగా, మధ్యాహ్నం వేళకు భానుడు భగ భగమంటున్నాడు. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేస్తుంది. దీంతో ప్రధాన రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవటంతో రాకపోకలు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఇలాంటి వాతావరణం నెలకొంది. ఉదయం పది గంటల తర్వాత చల్లటి వాతావరణం పోయి భానుడు మెల్లమెల్లగా తన ప్రతాపం చూపుతూ మధ్యాహ్నానికి సెగలు పుట్టించాడు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.



మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న దొనకొండ లోని ప్రధాన రహదారి

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

దొనకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరవల్లిపాడులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర రూ.7550లకు రైతులు కందులు విక్రయించుకోవాలన్నారు. వెంటనే నగదు రైతు బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 2391 మంది రైతులు 5515 ఎకరాల్లో కంది పంటను సాగుచేశారని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల రీడింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

దర్శి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ల రీడింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బొటుకు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం దర్శిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఎంతోకాలంగా తమ సమస్యలు పరిష్కారంకాక రీడింగ్ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏప్రిల్ 4న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ హనుమంతరావు, యూనియన్ నాయకులు ఎస్ .శ్రీనివాసరావు, వి.మస్తాన్‌వలి, సురేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం ముండ్లమూరులో చోటుచేసుకుంది. పెదదోర్నాలకు చెందిన రంగస్వామి బంధువుల ఇంటికి మోటారుసైకిల్‌పై తర్లుపాడు వెళుతున్నాడు. ఈక్రమంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై బ్రహ్మంగారి దేవాలయం సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స చేసి బంధువులకు సమాచారం అందించారు.

ఈపంట నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈపంట నమోదు చేయించుకుంటే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని దర్శి డివిజన్ ఏడీఏ కె.బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని మారెళ్లలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముండ్లమూరు మండలంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మద్దతు ధర క్వింటా రూ.7,750 నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత, రాఘవరెడ్డి, వీఏఏ బాలవెంకటయ్య, వై.రాధామణి తదితరులు పాల్గొన్నారు.

ఈదర వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

ముండ్లమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల - జమ్మలమడుగు రహదారిలో ఈదర వాగుపై నేల చప్టాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఆప్రాంతంలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వర్షాల సమయంలో వాగులో ఉధృతంగా నీరు ప్రవహించినప్పుడు రాకపోకలు స్తంభిస్తుంటాయని చెప్పారు. ఈదర వాగు పై బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మీరావలి, వెంకటేశ్వర్లు, శ్రీను, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరులో ప్రత్యేక నిఘా

పామూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పామూరులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, మమ్మిడాడి సెంటర్లల్లో ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమించి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పామూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో కె.రాధ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఇనిమెర్ల, తూర్పుకట్టకిందపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణ, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో ఉన్న మిరప, వరి పైర్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు యామిని, సుబ్బారావు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రతిపాదిత స్థలం పరిశీలన

- పీసీపల్లిలో పర్యటించిన రిలయన్స్ బృందం
- త్వరలో భూమిపూజ చేయనున్నట్లు వెల్లడి



బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రిలయన్స్ బృందం

పీసీపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో రిలయన్స్ కంపెనీ బృందం మంగళవారం పర్యటించింది. రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్‌లను నిర్మించేందుకు రిలయన్స్ కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. అందులోభాగంగా తొలుత కనిగిరి నియోజకవర్గంలో ప్లాంట్‌ను నిర్మించేందుకు కంపెనీ ఏర్పాట్లను చేసుకుంటుంది. ఇందుకోసం ఇప్పటికే పీసీపల్లి మండలంలోని వెంగళాయపల్లి సమీపంలో సర్వేనెంబరు 652 లో 475.57ఎకరాల భూమిని ప్రభుత్వం రిలయన్స్ కంపెనీకి అప్పజెప్పింది. ప్లాంట్ ఏర్పాటుకోసం త్వరలో భూమిపూజ చేయనున్న నేపథ్యంలో రిలయన్స్ కంపెనీ ప్యాన్ ఇండియా హెడ్ హెచ్‌కే త్రిపాఠి, స్టేట్ హెడ్ రవినాథ్ రెడ్డి తమ బృందంతో కలిసి ప్రభుత్వం కేటాయించిన భూమిని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు మ్యాప్ ద్వారా భూమి వివరాలు, హద్దులతో పాటు భూమి స్వభావాన్ని రిలయన్స్ బృందానికి వివరించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలం ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని కంపెనీ బృందం సభ్యులు నిర్ధారించుకున్నారు. ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూమిపూజకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి బృందం సూచించింది. ఉగాది నాటికి భూమిపూజ చేయవచ్చునని రిలయన్స్ కంపెనీ బృందంలోని సభ్యుడైన శివరాం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

జాతీయస్థాయి డ్రైవింగ్ స్కూల్ నిర్మాణంలో కదలిక!

- నిధుల మంజూరుకు సీఎం హామీ
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో సీఎంను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వివరించి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన డ్రైవింగ్ శిక్షణ కేంద్రం గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పునాదుల్లోనే నిలిపోయిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు నిధులు మంజూరు చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని, త్వరలో పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. మధ్యలో నిలచిన అన్నా క్యాంటీన్ నిర్మాణం పూర్తిచేసి పథకం ప్రారంభానికి నిధులు విడుదల చేయాలని, వెంకటచలంపల్లి-దొనకొండ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 కోట్లు నిధులు మంజూరుచేయాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు ఆమె వివరించారు.

దొనకొండలో సోలార్ ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాజెక్టుల అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు ఆమె వివరించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు



బల ప్రదర్శనలో ఎడ్ల జత

దొనకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈపోటీల్లో వివిధ జిల్లాల నుంచి ఐదు ఎడ్ల జతలు పాల్గొన్నాయి. బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎడ్ల జత 3759 అడుగులు దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గోసుపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన జి .నాగిరెడ్డి ఎడ్లజత 3751 అడుగులు దూరం లాగి రెండవ స్థానంలో, ఎర్రగొండపాలెం మండలం, వీరాయపాలెం గ్రామానికి చెందిన షేక్ నజీర్‌బాషా ఎడ్లజత 3500 అడుగులు దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి.

నంద్యాల జిల్లా, గడివేముల మండలం, పెసరాయి గ్రామానికి చెందిన సయ్యద్ కలాంబాష ఎడ్లజత 3250 అడుగులు దూరం లాగి నాల్గో స్థానంలో నిలిచింది. విజేతలైన ఎడ్లజతల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాల్గో బహుమతి రూ.10వేలు నగదును నిర్వాహకులు అందజేశారు. ఈసందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలి

- తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



దర్శిలో ఇంటింటి రెవెన్యూ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీ

దర్శి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ సూచించారు. దర్శి నగర పంచాయతీలోని రెండో వార్డులో ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. స్థలాలు, భూవివాదాలు, రికార్డుల సమస్యలు తమ దృష్టికి తెచ్చినట్లయితే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఆర్ఐ పరిటాల శ్రీనివాస్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమెప్పుడో..!

- సెలవుపై వెళ్లిన పీసీపల్లి తహసీల్దార్
- 15రోజులైనా ఇన్‌చార్జ్‌ని నియమించని ఉన్నతాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

పీసీపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు సంబంధిత అధికారి లేకపోవడంతో ఎవరికి తమ సమస్యలు చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సీహెచ్ ఉష వ్యక్తిగత పనిమీద గత నెల 27న సెలవుపై వెళ్లారు. ఈనెల 13న విధుల్లో చేరాల్సిన ఆమె మరో నెలరోజుల పాటు సెలవును పొడిగించుకున్నట్లు తెలిసింది. తహసీల్దార్ సెలవుపై వెళ్లి ఇప్పటికీ 19రోజులు అయినప్పటికీ ఇన్‌చార్జ్‌గా మంగళవారం వరకు ఎవరినీ నియమించలేదు. దీంతో ఈపీసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు అవసరమైన క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్స్‌తో పాటు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునే రైతులు పొలం ఆన్‌లైన్ కాక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి వెళ్లి వీఆర్వోలను ప్రశ్నిస్తే తహసీల్దార్ లేక ఆలస్యం అవుతుందని చెప్తున్నారు. ఇప్పటికే రీసర్వేలో తలెత్తిన సమస్యలపై అర్జీలు ఇచ్చిన రైతులు వారి సమస్యలు పరిష్కారం కాక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఒకవైపు రీసర్వే సమస్యలు, మరోవైపు విద్యార్థుల సర్టిఫికెట్ సమస్యలు పరిష్కారం కావాలంటే తహసీల్దార్ అవసరం ఉంది. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహించిన సదస్సుల్లో అర్జీలు దాఖలు చేసిన రైతుల సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కాకపోవడానికి కారణం తహసీల్దార్ లేకపోవడమేనని కార్యాలయానికి వెళ్లిన రైతులకు సిబ్బంది చెప్తున్నారు. ప్రస్తుతం పీసీపల్లిలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌కైనా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్తే కొంతవరకైనా సమస్యలు పరిష్కారమవుతాయని మండల ప్రజలతో పాటు కార్యాలయ సిబ్బంది అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పీసీపల్లికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ హాస్టల్‌ను తరలించొద్దు!

కనిగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్‌ను తరలించే ప్రక్రియను విరమించాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 40ఏళ్ళకు పైగా ఎస్సీ హాస్టల్ కనిగిరిలోనే ఉందన్నారు. గతంలో రెండు హాస్టళ్ళు ఎస్సీల కొరకే ఉండేవన్నారు. వాటిలో ఒక దానిని కంచర్లవారిపల్లికి తరలించినట్లు చెప్పారు. నేడు రెండో హాస్టల్‌ను కూడా తరలించేందుకు చర్యలు చేపట్టడం సబబు కాదన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో హాస్టల్ మార్చటం తగదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకునే తరలింపు ప్రక్రియను నిలిపి వేయాలని కోరారు.

కార్యక్రమంలో దళితసంఘ నాయకులు పి.మోహన్, చీకటి వెంకటసుబ్బయ్య, వెంకటయ్య, కటికల అగస్టిన్, బాలబాదుర్ల, సుధాకర్, చియాద్రి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరా బహూకరణ



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న గొట్టిపాటి వెంకటేశ్వర్లు

కురిచేడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కురిచేడు పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరాను మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు మంగళవారం అందజేశారు. ప్రస్తుత తరుణంలో చోరీలు పెచ్చుమీరడంతోపాటు టెక్నాలజీని వాడుతూ దొంగలు చిక్కకుండా తప్పించుకుతిరుగుతున్నారు. ఈక్రమంలో పోలీసులు సైతం అత్యాధునిక టెక్నాలజీని సొంతం చేసుకుంటున్నారు. ఎస్పీ దామోదర్ పిలుపుతో గొట్టిపాటి వెంకటేశ్వర్లు పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరాను అందజేయడానికి నిర్ణయించుకున్నారు. డీజేఐ ఎయిర్‌3ఎస్ సాంకేతిక డ్రోన్‌ను ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. ప్రజలు సామాజిక బాధ్యతో మెలిగి పోలీసులకు సహకరిస్తే నేరాల కట్టడి సులభమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈడ్రోన్‌ను త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అసన్‌కు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏడుకొండలు, వి.వెంకటేశ్వర్లు, బస్సు రామయ్య, కొలిసెట్టి కాశీవిశ్వనాథరావు పాల్గొన్నారు.

దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం



దర్శి గడియార స్తంభం సెంటర్‌లో డివైడర్‌లపై మొక్కలు నాటుతున్న నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

దర్శి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించటంతో పాటు సుందరంగా తీర్చిదిద్దుతామని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. దర్శి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో మంగళవారం డివైడర్లపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి పట్టణంలోని అన్నిప్రాంతాల్లో ఇప్పటికే సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కాలుష్యాన్ని నివారించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, ఏఈ శ్రీనివాస్, టీడీపీ నాయకులు దినకర్, త్రినాథ్, రంగా తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

పామూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రూ.రెండు వేల కోట్లు కేటాయించి పూర్తిచేయాలని సీపీఎం నాయకుడు కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య ప్రచార యాత్రలో భాగంగా మండలంలోని ఇనిమెర్ల, మోపాడు, లక్కీనరసాపురం, అయ్యన్న కోట గ్రామాల్లో మంగళవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, కంది, వరి, శనగ, మిరప, పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈనెల 20న నిర్వహించనున్న చలో కనిగిరి ఆర్డీవో కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్య దర్శి షేక్ ఖాదర్‌బాషా, వై.వీరనారాయణ, కె.శంకర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, పి.రామయ్య, అల్లాభక్ష్ సీహెచ్ అంకయ్య, కొండయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

పామూరులో అస్తవ్యస్తంగా ట్రాఫిక్



పామూరులో నిలిచిన ట్రాఫిక్

పామూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతున్నది. దాంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి మార్గాల్లో బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించేవారు అష్టకష్టాలు పడుతున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకనుగుణంగా రోడ్ల విస్తరణ కు నోచుకోక పోవడంతో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురికావడంతో మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎదురెదురుగా బస్సులు వస్తే వెళ్ళే మార్గంలేదు. వాహనం నిలిచిన వెంటనే పదుల సంఖ్యలో ఇతరత్రా వాహనాలు నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటున్నది.

పట్టణంలో ప్రధానంగా మమ్మిడాడీ సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డు సెంటర్‌లలో కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడు బండ్లు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనికితోడు ద్విచక్ర వాహనదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటుంది. ఆటోవాలాలు సైతం రోడ్డు పైనే వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తుంది.


నిరుపయోగంగా అతిథి గృహాలు



పిచ్చిమొక్కల మధ్య నిరుపయోగంగాఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహం

పామూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన అతిథి గృహాలు నిరుప యోగంగా ఉన్నాయి. పామూరు, సీఎస్‌పురం మండ లాల్లో పంచాయతీరాజ్ అతిథి గృహాలను నిర్మించి వదిలివేశారు. సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో నిర్మించిన పంచాయతిరాజ్ అతిథి గృహాన్ని 2001లో ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలతో దుమ్ముధూళితో నిండి ఉన్నది. వేలాది రూపాయలతో సమకూర్చిన విలువైన ఫర్నిచర్ నిరుపయోగంగా పడిఉంది.

ఇదిలాఉంటే, పామూరులోని కనిగిరి రోడ్డులో ఉన్న పంచాయతీరాజ్ అతిథిగృహం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. నిర్మించిన పాతికేళ్లకే ఈ భవనం మరమ్మతులకు గురైంది. నాటి జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు అతిథిగృహాన్ని పరిశీలించి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. గత వైసీపీ ప్రభుత్వం అతిథి గృహాల మరమ్మతులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. ఇప్పటికైనా నేటి కూటమి పాలకులు, అధికారులు స్పందించి అతిథి గృహాల మరమ్మతు పనులకు నిధులు కేటాయించి వినియోగంలోని తీసుకురావాలని రెండు మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



70 శాతం పూర్తి చేసినా పాడుబెట్టారు..

2017 చివర్లో రూ.160 కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి దాదాపు 70శాతానికి పైగా పనులను పూర్తి చేశారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధానిలోని భవనాల నిర్మాణ పనులను నిలిపివేసింది. తుది మెరుగులతో ఉపయోగించుకునే అవకాశం ఉన్నా సీఆర్‌డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ పాలకులు పాడుబెట్టారు.

అలుమ్నికి.. ఆటంకాలు

- బాపట్ల ఏజీ కళాశాలలో అనేక సమస్యలు
- నిధులు సమకూర్చడానికి పూర్వ విద్యార్థుల ఆసక్తి
- ఎన్జీ రంగా యూనివర్సిటీ పెద్దల నుంచి కనబడని చొరవ
- నేడు అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు ప్రారంభోత్సవం



అలుమ్ని హౌస్ ఇదే

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

'ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు మూలాలు మరిచిపోకూడదు. ఎంతోకొంత వితరణ రూపంలో ఇవ్వడం సామాజిక బాధ్యతగా భావించాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు వేదికలపై చెప్తుంటారు. చంద్రబాబు స్ఫూర్తితో ఎం దరో పుట్టిపెరిగిన గ్రామాలకు.. విద్య నేర్పి తమను ఉన్నత స్థాయికి చేర్చిన పాఠశాల, కళాశాలకు తమవంతు బాధ్యతగా కొన్ని పనులు చేపట్టి వాటి అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఈ క్రమంలో దాతలను గ్రామ పెద్దలు, విద్యా సంస్థల నిర్వాహకులు ప్రత్యేకంగా ఆదరిస్తూ అభిమానిస్తూ.. వారి పట్ల కృతజ్ఞతగా ఉంటున్నారు. అయితే ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పెద్దల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. వర్సిటీ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్య అభ్యసించి వ్యవసాయ రంగంలోనే కాకుండా శాస్త్ర, రాజకీయ, పాలన, ఆర్థికరంగంలో తమదైన ముద్రవేసిన వారు సాగుబడిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిధులను సమకూరుస్తున్నారు. వారిచ్చిన రూ.2 కోట్ల విరాళాలతో నిర్మాణం పూర్తి చేసుకున్న అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు బుధవారం ప్రా రంభం కానుంది. అయితే ఆయా నిధులు సమ కూర్చిన పూర్వ విద్యార్థులకు వర్సిటీ నుంచి కనీస ప్రాధాన్యం దక్కడంలేదన్న విమర్శలున్నాయి. పూర్వ విద్యార్థులను ఓ చోటకు చేర్చి కళాశాల అభివృద్ధికి సహకారం కోరడంపై కూడా వర్సిటీ పెద్దల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలకు స్వచ్ఛందంగా నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారి విషయంలో కనీస గుర్తింపు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటంపై కూడా విమర్శలు వస్తు న్నాయి. పోతన హాస్టల్ భవనం ఆధునికీకరణకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, శ్రీహరిరెడ్డి ముందుకు రాగా వారి కోరికకు సానుకూల స్పందన లేకపోవడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకు న్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన గోవింద రాజులు నాబార్డ్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కళాశా లకు అగ్రిహబ్‌ను మంజూరు చేశారు. అయితే అప్ప ట్లో ఉన్న వీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో ఈ అగ్రిహబ్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు తరలిపోయింది. పూర్వ విద్యార్థి ఒకరు కళాశాలలోని పెవిలియన్ ఆధునికీకరణను దాదాపు రూ.15 లక్షలు వెచ్చించారు. 1980 బ్యాచ్‌కు చెందిన హరిప్రసాద్ రైతు సమాచార కేంద్రం నిర్మాణానికి భారీ విరాళం ఇచ్చారు. ఇలా భారీ విరాళం ఇచ్చిన వారి పేర్లను సదరు విభాగాలకు పెట్టడం వల్ల మరింత మంది పూర్వ విద్యార్థులు ముందుకు రావడానికి ప్రేరణ ఇచ్చినట్లవుతోంది. కానీ ఈ విషయంలో కూడా నిబంధనల పేరుతో వారికి సముచిత గౌరవం ఇవ్వడంపై కూడా యూనివర్సిటీ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో విమర్శలను (మిగతా 6వ పేజీలో)



● నిర్మాణంలో ఉన్న ఏపీ సీఆర్‌డీఏ పరిపాలనా భవనం

సిద్ధమవుతున్న సీఆర్‌డీఏ భవనం

- ఇందులోనే ఏడీసీఎల్ కార్యాలయం
- జీ ప్లస్ 7గా నిర్మాణం.. నెల రోజుల్లో పూర్తి
- రాజధాని అమరావతిలో మొదటి ప్రభుత్వ భవనం ఇదే

అత్యద్భుతంగా.. ఆకర్షణీయంగా.. అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. అమరావతి రాజధానిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనంగా సీఆర్‌డీఏ కార్యాలయం సిద్ధమవుతోంది. సీడ్ యాక్సిస్ రోడ్డుకు దక్షిణంగా ఎన్-8, ఎన్-9ల మధ్య చేపట్టిన ఈ భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ భవనం మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో...అత్యంత వైవిధ్యంగా... మరెంతో ఆకర్షణీయంగా.. ప్రత్యేకంగా కనిపించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యాలయ భవనాన్ని అమరావతిలో ఓ రోల్‌మోడల్‌గా నిలిచేలా సీఆర్‌డీఏ అధికారులు నిర్మిస్తున్నారు. గత టీడీపీ హయాంలోనే 70 శాతం నిర్మాణం పనులు పూర్తి కాగా తిరిగి చంద్రబాబు గత ఏడాది ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ భవనానికి పునః శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఏప్రిల్ మూడో వారంలో రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో ప్రారంభించే సమయానికల్లా సీఆర్‌డీఏ కార్యకలాపాలను రాజధాని నుంచే ఆరంభించాలన్న లక్ష్యంతో ఈ భవన నిర్మాణాన్ని వేగంగా చేపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

ఆంధ్రుల కలల రాజధాని అమరావతిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైపోతుంది. రాజధాని అమరావతి నిర్మాణపనుల పర్యవేక్షణ బాధ్యతలను తలకెత్తుకున్న ఏపీ సీఆర్‌డీఏ తన ప్రధాన కార్యాలయ భవనాన్ని అన్నింటికన్నా ముందే ఏర్పాటు చేసుకునేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతిలో గవర్నమెంటు కోర్‌లో ఒక వైపుగా సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి రాయపూడికి దగ్గర్లో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం జీ+సెవన్ భవనంగా.. అన్ని హంగులతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటుంది. సీఆర్‌డీఏకు కేటాయించిన మూడు ఫ్లోర్లకు సంబంధించి ఇంటర్నల్ వర్కులు దాదాపు 90శాతం వరకు పూర్తయ్యాయి. సీఆర్‌డీఏ కార్యాలయం ప్రస్తుతం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో, ఏడీసీ కార్యాలయం కేదారేశ్వర రావుపేటలో ఉన్నాయి. ఈ రెండు ముఖ్య కార్యాలయాలను అమరావతిలో నిర్మిస్తున్న ఈ భవన ప్రాంగణంలోకి శాశ్వత ప్రాతిపదికన తరలించనున్నారు. రెండు ప్రధాన కార్యాలయాలు ఒకేచోట ఉండటం వల్ల పరస్పర అవగాహనతో పాటు మంచి పాలనా సౌలభ్యం కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది.

నిర్మాణం ఇలా..

3.41 ఎకరాలు కేటాయించగా 1.10 ఎకరాల్లో భవనాన్ని జీ+7 రూపంలో ప్రీ కాస్ట్ విధానంలో నిర్మిస్తున్నారు. భవనం పోను మిగిలిన స్థలాన్ని ఉద్యానవనాలు, పార్కింగ్ కోసం వినియోగించేలా ప్లాన్ చేశారు. ఒక్కొక్క ఫ్లోర్‌ను 30,500 చదరపు గజాల విస్తీర్ణం (మిగతా 6వ పేజీలో)

జనం మెచ్చిన డిజైన్‌తోనే..

సీఆర్‌డీఏ కార్యాలయ భవనానికి ఔట్‌పుట్ డిజైన్‌కోసం పది రకాల డిజైన్లను రూపొందించారు. వీటిలో ఏదీ బెస్ట్ అంటూ పబ్లిక్ డొమైన్‌లో ఉంచగా ఎక్కువమంది పదో రకం వైపు మొగ్గు చూపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు ఆ డిజైన్‌ను ఖరారు చేసి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఒకటి, రెండు ఫ్లోర్లకు సంబంధించి గ్లాస్‌వర్క్ చేస్తున్నారు. భవనానికి నాలుగువైపులా ఈ గ్లాస్ వర్క్ పూర్తయిన తర్వాత భవనానికి ప్రధాన ఔట్‌లుక్‌గా ఉన్న తూర్పువైపున పదో రకం మోడల్ డిజైన్‌ను దాని మధ్యలో అమరావతికి చిహ్నంగా ఇంగ్లీషు అక్షరం ఏ ప్రతిబింబించేలా ఎలివేట్ చేస్తారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

పోలింగ్ కేంద్రాలను విభజించాలి

- 1200 మందికి మించి ఓటర్లు ఉండరాదు
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పోలింగ్ కేంద్రాల విభజనపై రాజకీయపార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 1200 మందికి మించి ఓటర్లు ఉండరాదనే నిబంధనలను ఉల్లంఘించరాదని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200కు పైగా ఓటర్లు ఉంటే మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల విభజనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 12,91,415 మంది ఓటర్లకు 1510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1100 ఓటర్లలోపు ఉన్న పోలింగ్ కేంద్రాలు 1270, 1101 ఓటర్లకు మించిన పోలింగ్ కేంద్రాలు 250 ఉన్నట్లు గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్లు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున వెయ్యికి మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే ఓటర్లకు పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్లకు మించి దూరం ఉండరాదన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి..

ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఓటు హక్కు కొరకు జనవరి నుంచి ఇప్పటి వరకు 2,399 దరఖాస్తులు రాగా 382 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో 319 మంది విదేశాలలో ఉంటున్నారని, వీఐపీ ఓటర్లు 2,187 మంది, 14,551 మంది దివ్యాంగ ఓటర్లు, 4,532 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఆధార్ అనుసంధానంలో 1.92 లక్షల ఓట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్.షఫి తదితరులు పాల్గొన్నారు.

మత్తులో యువత



జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న యువత

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ నుంచి సర్వీస్ రోడ్డుపైకొచ్చే మెట్లపై కొందరు మత్తులో ఊగుతూ కనిపిస్తున్నారు. మంగళవారం రాత్రి కొంతమంది యువకులు మెట్లపై కూర్చొని ఇంజక్షన్లు చేసుకుంటున్న వ్యవహారం వెలుగుచూసింది. యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో పట్టణంలో కలకలం రేగింది. ఇటీవల వెదుళ్లపల్లి వృక్షనగర్‌లో మత్తు బిళ్లలు విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ శాఖ అరెస్టు చేసిన రెండురోజులకే ఆర్‌వోబీ మెట్లపై యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటూ దర్శనమిచ్చారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు.

నాడు బారాబందీ నేడు వారబందీ



నెమలిపురి ప్రాంతంలో కంకి దశలో ఉన్న వరి పొలం

నీటి అవసరంపై నివేదిక

కొన్ని ప్రాంతాల్లో వరి కంకి దశలో ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉండగా మరి కొన్ని ప్రాంతాల్లో ఆ దశలో కూడా లేదు. కొన్ని ప్రాంతాలకు 10 వరకు.. మరి కొన్ని ప్రాంతాల్లో 15 వరకు నీరు అవసరం ఉందని ప్రాంతాల వారీగా నీటి అవసరంపై జలవనరుల శాఖకు నివేదిక అందించాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల వివరాలను కూడా తెలియజేశాం.

- ఐ మురళీ, వ్యవసాయ శాఖ జేడీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- నెల క్రితం విచ్చలవిడిగా నీటి విడుదల
- వాగుల్లోనూ వృథాగా పోయిన వైనం
- రైతులకు అవసర సమయంలో నిలిపివేత
- కుడి కాల్వకు 31 వరకే నీటి సరఫరా అంటూ ప్రకటన
- వచ్చే నెల 15 వరకు ఇస్తేనే పంట చేతికి అంటోన్న రైతులు
- ఇప్పటికే 7 వేల క్యూసెక్కులకు తగ్గిన నీటి విడుదల

పంటల అవసరానికి మించి కుడి కాల్వ ద్వారా ఇంతకాలం సాగు నీటిని విడుదల చేశారు. పంటలకు ఊపిరిపోయాల్సిన నీరంతా వృథాగా కాల్వల్లో పారింది. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయంలో నీటి విడుదలకు జలవనరుల శాఖ కట్టడి చర్యలు చేపట్టింది. నాడు నీరు వృథాగా పోతున్నా పట్టించుకోని అధికారులు ఇప్పుడు పంటలకు అవసరమైన సమయంలో వారబందీ అమలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాల్వకు విడుదల చేసే నీటిని మంగళవారం 7 వేల క్యూసెక్కులకు తగ్గించారు. బుధవారం నుంచి ఇంకా తగ్గించనున్నారు. ఈ నెల 31న పూర్తిగా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. సాగునీరు ఈ నెలాఖరు వరకే అనడంతో ఆయకట్టులో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. వివిధ దశల్లో ఉన్న వరికి సాగు నీరు అందకపోతే పంట చేతికి వచ్చేనా అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. కనీసం వచ్చే నెల 10 నుంచి 15వ తేదీ వరకైనా సాగు నీరు ఇస్తేనే పంట చేతికి వస్తుందని లేకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల 15 వరకు సాగునీరు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల వివరాలను జలవనరుల శాఖకు పంపింది. అయితే నెలాఖరు వరకే సాగు నీటి సరఫరా ఉంటుందని జలవనరులశాఖ అధికారులు ప్రకటించారు. ఇదే జరిగితే వేలాది మంది రైతులు పంట కోల్పోయి దారుణంగా నష్టపోయే అవకాశం ఉంది. అయితే ఒక్క ఎకరంలో కూడా పంట ఎండిపోవడానికి వీలు లేదని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ ప్రకటన అమలు కావాలంటే వచ్చే నెల 15 వరకు సాగునీటి సరఫరా చేయాల్సిందే. నీటి విడుదల కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీరివ్వకుంటే నష్టం

నీరు ఫలానా తేదీ వరకే అని ముందే చెబితే సాగుపై ఆలోచించే వాళ్లం.. తీరా వరి సాగు చేపట్టిన తర్వాత నీటి విడుదల చేయమని చెప్తే ఎలా అని రైతులు చెప్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ముందస్తుగా మార్చి 31 వరకే సాగు నీరు అని ప్రకటించి ఉంటే రైతులు సాగు విషయంలో ఆలోచన చేసి ఉండేవారు. ఖరీఫ్‌లో ముందస్తుగా కోతలు పూర్తయిన చేలల్లోనే వరి సాగు చేసుకుని ఉండేవారు. అలా కాకుండా నీటి సరఫరాపై నాడు ప్రకటన చేయకుండా నేడు 31 వరకే అని జలవనరుల శాఖ నిర్ణయించడాన్ని రైతులు తప్పు పడుతున్నారు. ఆయకట్టు పరిధిలో 52,818 ఎకరాల్లో రెండో పంటగా వరి సాగు చేశారు. నకరికల్లు.. రాజుపాలెం మండలాల్లో కంకి.. పొట్ట దశలో ఉంది. మిగతా ప్రాంతాల్లో పంట పొట్ట దశకు కూడా చేరుకోలేదు. కంకి వేస్తున్న సమయంలో నీటి సరఫరా నిలిచిపోతుండటంతో గింజ తాలుగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మిరప పంటకు ఒక తడికి నీరు అవసరం ఉందని రైతులు తెలిపారు.

ముందుగానే తెలియజేశాం

కేఆర్ఎంబీ కుడి కాల్వకు ఇటీవల చేసిన నీటి కేటాయింపుల మేరకు 31 వరకే సాగు నీటి సరఫరా ఉంటుంది. మార్చి 31 వరకే నీటి సరఫరా ఉంటుందని ముందుగానే రైతులకు తెలియజేశాం. నీటి సరఫరా కొనసాగించే అవకాశం లేదు. రైతులు పొదుపుగా నీటిని వినియోగించుకుని సహకరించాలి.

- కృష్ణమోహన్, జలవనరుల శాఖ ఎస్ఈ



టైరు పగిలి అదుపు తప్పిన కారు

- యువకుడు మృతి.. ముగ్గురికి గాయాలు

మార్టూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 216వ జాతీయ రహదారిలో బొల్లాపల్లి టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం గుంటూరు వైపు వెళ్తున్న ఓ కారు ముందు టైరు పగిలిం ది. దీంతో అదుపుతప్పిన ఆ కారు కల్వ ర్టు గోడను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులోని చితరి జయభారతి, కసినికోట భావన, అఖిల్, బీమన నీవన్ గాయపడ్డారు. హైవే అంబులెన్స్‌లో ఒంగోలు సమీపంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ వైజాగ్‌కు చెందిన బీమన నవీన్(26) మృతిచెందాడు. కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో మిగిలిన వారు ప్రాణాలతో బయటపడినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే నవీన్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దంపతులైన రవితేజ, జయభారతితో కలిసి కారులో గుంటూరు వచ్చాడు. గుంటూరు శ్రీనివాసరావుపేట 3వ లైనులో ఉంటున్న స్నేహితులు మణికంఠ, భావన దంపతులతోపాటు, వారి 4 ఏళ్ల పాప, అఖిల్ అనే యువకుడితో కలిసి కారులో కాళహస్తి, రామేశ్వరం, తిరుపతి, పళని పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. వీరంతా గుం టూరుకు కారులో వస్తుండగా ఈ ప్ర మాదం జరిగింది. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాజుల్లంక ఇసుక రీచ్‌లో మైనింగ్ అధికారుల తనిఖీలు



తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కొల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గాజుల్లంక ఇసుక రీచ్‌ను మైనింగ్ అ ధికారులు పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆగని ఇసుక దందా' శీర్షికపై స్పందించిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించా రు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు ఫణికుమార్ తన సిబ్బందితో కొల్లూరు మండలంలోని గాజుల్లంక ఇసుక రీచ్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలించారు. పరిశీలన నిమిత్తం అధికారులు గోతులు తవ్వించారు. ఒక యంత్రాన్ని సీజ్ చేసి సంబంధిత వివరాలను అందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఇచ్చారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీకి నివేదిక అందించి వారి ఆదేశాను సారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వాలీబాల్‌ను ఆడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

పెండింగ్ లేకుండా పనులు నిర్వహించాలి



సామాజక తనిఖీలో మాట్లాడుతన్న పీడీ విజయలక్ష్మి

చినగంజాం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఉపాధి హామీ పనులు పెండింగ్ లేకుండా నిర్వహించాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-2024వ సంవత్సరంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో పీడీ మాట్లాడుతూ మండలంలో జరిగిన పనులకు, కూలీల వేతనాలు త్వరలో బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రికార్డులలో సంతకాలు మస్టర్లలో తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. మండల పరిధిలో ఉద్యానవపంటలు ఎక్కువగా వేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ పథకం పలు శాఖల సమన్వయంతో ముడిపడి ఉంటుందని అన్నారు. పలు గ్రామాల్లో సామాజిక తనిఖీలో గుర్తించిన పలు లోపాలైన కూలీల సంతకాలు లేకుండా బిల్లు ఇవ్వడం, వేసిన కరకట్ట కరిగిపోవడం, ప్లాంటేషన్‌లో లోపాలు తదితర విషయాలను డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. చినగంజాం మండలంలో 1046 పనులకు రూ.11.25 కోట్లు ఖర్చు చేసినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, డీపీవో శోభన్‌బాబు, ఎస్ఆర్‌పీ చిరంజీవి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్, ఏ.పీ.డి కోట నాయక్, ఏపీవో జె.లక్ష్మీదేవి, డీఆర్‌పీలు చిట్టిబాబు, రంజిత్‌కుమార్, గ్రామ కార్యదర్శులు ఉపాధిహామీ పథరం టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

స్టోర్ మేనేజర్‌పై నిర్వాహకుల ఫిర్యాదు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ స్టోర్ మేనేజర్ రూ.10లక్షల అవకతకలకు పాల్పడినట్లు నిర్వాహకులకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ కుటుంబ సభ్యులను పిలిపించి ఆరా తీస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

మళ్లీ తెరపైకి ఆదరణ

- కులవృత్తిదారులకు పరికరాలు
- 90శాతం సబ్సిడీతో యూనిట్లు
- అందజేయనున్న ప్రభుత్వం

ఒంగోలు నగరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. రాష్ట్రంలో కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి అవసమైన వస్తువులను 90శాతం సబ్సిడీపై అందజేయనున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 1997-99 సంవత్సరంలో ఆదరణ-1, 2018-19లో ఆదరణ-2 పథకం కింద వృత్తిదారులకు వారికి అవసరమైన పరికరాలు అందజేసింది. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా అ టకెక్కించేసింది. ఈ పథకం కింద 335 రకాల వృత్తి పరికరాలను ప్రభుత్వం గతంలో అందజేసింది. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సంబంధించిన అన్ని పథకాలను నిలిపేసింది. ఆదరణ పథకాన్ని కూడా పక్కనపెట్టింది. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ బీసీలకు మంచిరోజులు వచ్చాయనుకుంటున్నారు. ఆదరణ-3 పేరుతో రాష్ట్రప్రభుత్వం కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలోని కులవృత్తులతో జీవిస్తున్న వేలాది మంది బీసీలకు వారికి అవసరమైన వస్తువులను అందజేసేందుకు సిద్ధమైంది.

కులవృత్తిదారులకు భారీగా లబ్ధి

జిల్లాలో 15 వేల నుంచి 20వేల మంది దాకా ఆదరణ పథకం కింద లబ్ధి చేకూరనుంది. వృత్తిదారుల అ వసరాలను తెలుసుకుని వారికి ఉపయోగపడే పరికరాలను ఆదరణ-3 పథకం కింద అందజేయనున్నారు. ఇందులోభాగంగా సోమవారం కలెక్టర్ సమావేశంలో హాలులో బీసీ కార్పొరేషన్ అధికారులు వివిధ కుల వృత్తిసంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈడీ వెంకటేశ్వరరావు, బ్యాంకు అధికారులు సంఘాల నాయకులతో సమావేశమై వారికి అవసరమైన వృత్తిపరికరాల వివరాలను తెలుసుకున్నారు. వీటినే వారికి 90శాతం సబ్సిడీతో అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో కులవృత్తిదారులతో బీసీ కార్పొరేషన్ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం వృత్తి పరికరాలను అందజయనున్నారు. ఈ ప్రక్రియ అంతా నెల రోజుల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

సెల్‌ఫోన్‌పై తలోమాట

- ఎవరి మాట వినాలో తెలియని అయోమయం
- తలలు పట్టుకుంటున్న చీఫ్‌లు

ఒంగోలు విద్య, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ వినియోగంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తలా ఒక మాట చెప్తున్నారు. దీంతో ఎవరి మాట విని ముందుకు పోవాలో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఏమి చేయాలో పాలుపోక పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తలలు పట్టుకుంటున్నారు. పరీక్షల నిర్వహణలో గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గత ఏడాది నుంచి కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించింది. రెండేళ్ల క్రితం వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాలు బయటకు లీకు కావడంతో ముందుజాగ్రత్తగా పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లను నిషేధించారు. ఈ ఏడాది కూడా ముందుగానే పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించి సెల్‌ఫోన్లను అనుమతించేది లేదని స్పష్టంచేశారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లపై వెబెక్స్ ద్వారా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ఆర్జేడీలు ఇతర జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టంచేశారు. దీంతో కేంద్రాల్లోకి చీఫ్‌లు, డీవోలు, ఇన్విజిలేటర్లు, ఏఎన్ఎంలు, పోలీసులు ఫోన్లు తీసుకరావద్దని ఆదేశించారు. అయితే పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు నిర్వహించిన వెబెక్స్‌లో చీఫ్‌లు మాత్రమే ఆండ్రాయిడ్‌లు కాకుండా ఇతర మామూలు ఫోన్లను వాడవచ్చన్నారు. ఏదైనా అత్యవసరమైతే వినియోగించాలని ఆదేశించారు. పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి కూడా మామూలు ఫోన్‌ను చీఫ్‌లు పరీక్షా కేంద్రాలకు తేవచ్చన్నారు.

డ్వామాలో బదిలీలు పారదర్శకంగా జరిగేనా?

- మ్యూచువల్‌గా దశాబ్దాల తరబడి అద్దంకి ప్రాంతంలోనే తిష్ట
- అదే అధికారులు కావడంతో వైసీపీ పాలనలో భారీగా అవినీతి
- తప్పులు బయటపడకుండా జాగ్రత్తలు
- అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్‌లు, ఎనిమిది మంది టెక్నికల్ అసిస్టెంట్‌లకు స్థానచలనం?



బల్లికురవలో జరిగిన ప్రజావేదికలో ఉపాధి పనుల తప్పులపై ప్రశ్నిస్తున్న అధికారులు (ఫైల్)

అద్దంకి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది బదిలీకి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో మూడు సంవత్సరాలుగా ఒకే చోట పనిచేసిన అధికారులు, సిబ్బంది బదిలీకి అవకాశం ఏర్పడింది. అయితే ఈ బదిలీలు చిత్తశుద్ధితో జరుగుతాయా లేక మొక్కుబడిగా జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు అధికారులు, సిబ్బంది దశాబ్దాలుగా అద్దంకి నియోజవకర్గాన్ని వీడకుండా ఇక్కడే తిష్ట వేసి ఉండడం, బదిలీల సమయంలో మ్యూచువల్ బదిలీలు చేయించుకుంటూ చేసిన తప్పులు బయట పడకుండా జాగ్రత్త పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ హయాంలో అద్దంకి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. వివిధ ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పెట్రోల్‌బంక్‌లు ఇతర పనులు చేసుకుంటున్న వ్యక్తులతో పాటు రాజకీయనాయకులకు కూడా మస్టర్‌లు వేస్తూ.. వేయిస్తూ... వైసీపీ నా యకులకు పంచుతూ.... తాము దండిగా తిన్నారు. పెద్ద ఎత్తున అవినీతి జరిగినా... సోషల్ ఆడిట్‌లో బయట పడుతుంది మాత్రం స్వల్పమే అన్న విమర్శలు ఉన్నాయి. సోషల్ ఆడిట్ కూడా ఎలాంటి ప్రచారం నిర్వహించకుండానే మొక్కుబడిగా నిర్వహిస్తూ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో ఉపాధి హామీ పనుల ద్వారా ఇబ్బడి ముబ్బడిగా దోచుకోవడానికి అలవాటు పడి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు అధికారులు అదే పంథాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అప్పటి అధికారులు, సిబ్బంది ఇప్పటికీ విధులు నిర్వహిస్తుండటంతో నాటి అక్రమాలు వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం 3 సంవత్సరాలు నిండిన అధికారులు, సిబ్బందిని బదిలీ చేయనుండడంతో ఇదే ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే దశాబ్దాల తరబడి ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ అవినీతిని వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా మ్యూచువల్ బదిలీలు పొందడంతో అక్కడ అవినీతి బయట పెట్టవద్దు... ఇక అవినీతి బయట పెట్టను అనే సిద్ధాంతాన్ని అవలించినట్లు తెలుస్తుంది. ఇదే విధంగా ప్రస్తుత బదిలీలలోనూ పోస్టింగ్‌లు తెచ్చుకొని ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా మాకు తిరుగులేదు అనే విధంగా వ్యవహరించాలనే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుసగుసలు వినవస్తున్నాయి. వీరి ప్రయత్నాలు ఫలిస్తాయా లేక బదిలీలు పారదర్శకంగా జరిగి వేరే ప్రాంతానికి బదిలీ అవుతారో వేచి చూడాల్సి ఉంది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, 5 గురు కంప్యూటర్ ఆపరేటర్ లు, 8 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు తప్పని సరిగా బదిలీ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. ఇదే అధికారులు, సిబ్బంది కొనసాగితే నాటి అ క్రమాలు వెలుగులోకి రాకపోగా.. ప్రస్తుతం కూడా అక్రమాలకు తెరలేపే అవకాశం లేకపోలేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

సిద్ధమౌతున్న సీఆర్‌డీఏ భవనం

(5వ పేజీ తరువాయి)

వచ్చేలా భవనాన్ని 2 లక్షల 43వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందిస్తున్నారు. ఈ భవనం గ్రౌండు ఫ్లోర్‌లో ఎంట్రన్స్ లాబీతోపాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, కిచెన్, సర్వర్ రూమ్స్, బ్యాంకు, ఏటీఎం తదితరాలను ఏర్పాటు చేస్తున్నారు. వెనుక భాగంలో ఫైర్ సేఫ్టీ భవనం, పవర్‌హౌస్‌ను నిర్మించనున్నారు. మూడు ఫ్లోర్లను సీఆర్‌డీఏ కేటాయించనుండగా తొలి అంతస్తులో ఐదు సెమినార్ హాల్స్, రిసెప్షన్ ఏరియా, రిజిస్ట్రేషన్ చాంబర్, లంచ్ హాలు ఉంటాయి. 240 సీటింగ్ సామర్థ్యంతో ఏవీ సెమినార్ హాలు సౌండు ప్రూఫ్, ఉడెన్ కార్పెట్ ఫ్లోరింగ్‌తో నిర్మిస్తున్నారు. సెకండ్ ఫ్లోర్‌లో కార్యాలయ సిబ్బంది క్యాబిన్లు, ఓపెన్ వర్క్ స్టేషన్లు, అడిషనల్ కమిషనరు చాంబర్లు, ఐటీ హబ్, ప్రింటర్ చాంబర్లు ఉంటాయి. మూడో అంతస్తులో కమిషనరు చాంబర్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిబ్బంది ఓపెన్ వర్క్ స్టేషన్లు ఉంటాయి. తర్వాతి రెండు ఫ్లోర్లను ఏడీసీ(అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్యాలయానికి కేటాయించారు. కార్యాలయాల కోసం వినియోగిస్తారు. ఆరు, ఏడు ఫ్లోర్లను ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇవ్వనున్నారు. ఇక ఈ భవనానికి తూర్పు వైపున మూడు, ఉత్తరం వైపున రెండు, పడమర వైపున రెండు లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు.



2024 అక్టోబరు 16న పూజచేసి భవన పునఃనిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

పనులతో మళ్లీ కళకళ

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా అమరావతిపై కక్ష కట్టి ఎక్కడికక్కడ పనులు నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావడంతో అమరావతిలో మళ్లీ రాజధాని కళ కనిపించడం మొదలైంది. ఈ క్రమంలోనే దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో పనులను పునఃప్రారంభించేందుకు అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చీ రావడంతోనే జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గతేడాది అక్టోబరు 19న సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవన పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు సివిల్ పనులు పూర్తి చేశారు. తొలి నాలుగు అంతస్తులలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. ఇంటీరియర్ వర్కులను కూడా సమాంతరంగా చేపట్టారు. ఇంటీరియర్‌లో ఆర్కిటెక్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.



కళాశాలలోని ఓ హాస్టల్ భవనం దుస్థితి ఇది

అలుమ్నికి.. ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

మూటగట్టుకుంటోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను ఐదు సంకలనాలుగా పుస్తకాల రూపంలో తీసుకొస్తే వాటిని భావితరాలకు అందించడంలోనూ వర్సిటీ నిర్లక్ష్యంపై అలుమ్ని తప్పుబడుతోంది.

పరిగణనలోకి తీసుకోని వర్సిటీ

ఏజీ కళాశాలలో వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. పోతన వసతి గృహం మూతపడగా, వేమన, సిద్ధార్థ హాస్టల్ భవనాలు పెచ్చులూడుతూ విద్యార్థులను భయపెడుతున్నాయి. ఆ ఫొటోలను ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ఖాతాకు ట్యాగ్ చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనాల నిర్మాణానికి వర్సిటీ నుంచి నిధుల మంజూరు అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పూర్వ విద్యార్థుల్లో కొందరు నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వారిని యూనివర్సిటీ పెద్దలు అసలు పరిగణనలోకి తీసుకోవడంలేదని సమాచారం. సేద్యంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్లు బోధనా పద్ధతులలో కూడా మార్పు రావాల్సి ఉంది. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు మొదలుకుని ల్యాబ్స్ వరకు అన్ని వర్సిటీనే భరించాలంటే నిధుల కొరత ప్రతిబంధకంగా ఉంది. ఈ పరిస్థితుల్లో నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చే పూర్వ విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా యూనివర్సిటీ ఆలోచన చేయాల్సి ఉంది. వర్సిటీ పెద్దలు చొరవ తీసుకుని అలుమ్నితో సమావేశమై వారి వైపు నుంచి అందాల్సిన సహకారంపై స్పష్టత ఇవ్వగలిగితే భూరి విరాళాలు వచ్చే అవకాశం ఉంది.

నేటి నుంచి రెండో దశ పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో రెండవ దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాంతంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. అందులో ఈనెల 10న తొలి విడతగా ఒంగోలు-1, పొదిలి, కొండపి, కందుకూరు-1 కేంద్రాల్లో కొనుగోళ్లను బోర్డు అధికారులు చేపట్టారు. గరిష్ఠ ధర కిలో రూ.280తో వేలం కొనసాగుతోంది. అయితే గ్రేడింగ్ సరిగా లేదంటూ కొన్ని బేళ్లను కంపెనీల ప్రతినిధులు తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండవ దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు-2, కలిగిరి డీసీపల్లి కేంద్రాల్లో బుధవారం ఉదయం వేలం ప్రక్రియ ప్రారంభమవుతుంది. పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాలలో వేలం ప్రక్రియను ప్రారంభించనున్నట్లు బోర్డు వర్గాల సమాచారం. కాగా మూడవ విడతగా ఈనెల 24 నుంచి ఉత్తరాది వేలం కేంద్రాలుగా పిలిచే రాజమండ్రి రీజియన్‌లోని మిగిలిన ఐదు కేంద్రాల్లో వేలం ప్రారంభించనున్నారు.

ఎత్తిపోతలతో ఆరుతడులకు నీరు



రైతులతో చర్చిస్తున్న ఐడీఎస్ విశ్రాంత డీఈ సత్యనారాయణ

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చి రైతులకు ఆరుతడులకు నీటిని అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగా విశ్రాంత ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీఎస్) డీఈ సత్యన్నారాయణ నేతృత్వంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు కావలసిన నివేదికను తయారు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా మంగళవారం మండలంలోని అన్నంబొట్ల వారిపాలెంలోని ఓగేరు వాగుపై నిర్మించిన అన్నంబొట్లవారిపాలెం ఎత్తిపోతలను రైతులతో కలసి అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి తదితర అంశాలను చర్చించారు. ఈ పథకం ద్వారా ఏమేరకు రైతుల పంట పొలాలకు ఆరుతడులు అందించడానికి దోహద పడుతుంది అన్న విషయంపై నేరుగా పంట భూములను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగని నివేదికను తయారు చేసి ఎమ్మెల్యేకి అందజేస్తామని విశ్రాంతి డీఈ తెలిపారు. కార్యక్రమంలో అప్పలనేని నరేంద్ర, వెంకటేశ్వర్లు, నారాయణరావు, గోరంట్ల భాస్కరరావు, చిలుకూరి లక్షణస్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.

వేటు మొదలు

- డ్వామాలో లోకేశ్వరరావు కమిటీ నివేదికే ఆధారం
- మొత్తం 14మందిపై చర్యలు
- ఒక టెక్నికల్ అసిస్టెంట్ తొలగింపు
- ఇన్‌చార్జి ఏపీడీ జడ్పీకి సరెండర్
- నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్ రద్దు
- మరికొందరి నుంచి నగదు రికవరీ
- పూర్తిస్థాయిలో చర్యలపై సమగ్ర విచారణకు ఆదేశం

ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో వైసీపీ ప్రభుత్వంలో పీడీగా కే.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా పలువురు డ్వామా సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 14 మందిపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో పీడీ జోసఫ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అందులో జడ్పీ నుంచి డిప్యుటేషన్‌పై డ్వామాలో పనిచేస్తున్న ఒకరిని తిరిగి ఆ శాఖకు సరెండర్ చేయగా నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్లను రద్దు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సర్వీసు నుంచి తొలగింపు, నలుగురికి నగదు రికవరీలు పెట్టారు. అలాగే త్రిపురాంతకం మండలంలో 11వ విడత సోషల్ ఆడిట్ అవకతవకలకు సంబంధించి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శాఖాపరంగా మరోసారి సమగ్ర విచారణకు నిర్ణయించారు. అందులో 10మంది సిబ్బంది ఉన్నారు. అలా మొత్తంగా 24మందిపై చర్యలకు నిర్ణయించారు.



విచారణ కోసం సిబ్బంది నుంచి సమాచారం తీసుకుంటున్న త్రిసభ్య కమిటీ (ఫైల్)

శీనారెడ్డిపై చర్యలకు సిఫార్సు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో దాదాపు నాలుగున్నర ఏళ్లు డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేశారు. అధికారిగా కన్నా వైసీపీ నాయకుడిగా వ్యవహరించడమే కాక పెద్ద ఎత్తున ఆయన పనిచేసిన కాలంలో డ్వామాలో అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులతో విచారణకు ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించింది. ఆ కమిటీ డిసెంబరు, జనవరి నెలల్లో విచారణ నిర్వహించింది. ఆ నివేదిక జనవరి ఆఖరులో కలెక్టర్‌కు అందగా దానిని పరిశీలించిన అన్సారియా అవినీతి, అక్రమాలు జరిగాయని శీనారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అదే సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలువురు డ్వామా జిల్లా కార్యాలయ, అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది పేర్లను కమిటీ ప్రస్తావించింది. వారిపై కూడా శాఖాపరంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను ఆదేశించారు. దాదాపు నెలరోజులకు పైగా పీడీ, కార్యాలయ సంబంధిత సిబ్బంది ఆయా అంశాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదించగా కఠిన చర్యలకు ఆదేశించారు.

- డిప్యుటేషన్‌పై శీనారెడ్డి పాలన సమయంలో జడ్పీ నుంచి డ్వామాకు వచ్చి తొలుత విజిలెన్స్ సూపరింటెండెంట్‌గా అనంతరం ఒంగోలు క్లస్టర్ ఇన్‌చార్జీ ఏపీడీగా పనిచేస్తున్న వి.వెంకటస్వామి డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి జడ్పీకి పంపించి వేశారు.
- డ్వామా జిల్లా కార్యాలయంలో పనిచేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధనాల సురేష్, దాసరి సురేష్, ఏపీవో నాగేశ్వరరావు, ఈసీ ప్రవీణ్‌కుమార్‌ల డిప్యుటేషన్లను రద్దుచేశారు.
- విధులకు హాజరు కాకుండానే జీతాలు డ్రా చేసినట్లు తేలడంతో డ్వామా కార్యాలయంలోని టెక్నికల్ అసిస్టెంట్ తోట నవీన్‌ను సర్వీసు నుంచి తొలగించారు.
- కనిగిరి ఏపీడీ ఆఫీసులోని కంప్యూటర్ ఆపరేటర్‌ను మరో క్లస్టర్‌కు, అలాగే డ్వామా కార్యాలయంలోని ఆఫీసు సబార్డినేటర్ వై.చేజర్లను మరొక సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.
- టంగుటూరు మండల ఈసీ దివికుమార్, వైపాలెం మండలంలోని టీఏలు వి. లక్ష్మయ్య, జి.శివరామరెడ్డి, పెద్దారవీడు మండలం టీఏ ప్రవీణ్‌కుమార్‌ల నుంచి నగదు రికవరీకి ఆదేశించారు.
- త్రిపురాంతకం మండలంలో 2019లో జరిగిన 11వ విడత సోషల్ ఆడిట్‌లో సుమారు రూ.3కోట్లు అవినీతి జరిగినట్లు గుర్తించారు. 10మంది సిబ్బందిని సస్పెండ్ చేసి తిరిగి అక్కడే కొద్దిరోజులకే పోస్టింగ్‌లు ఇవ్వగా ఆ విషయాన్ని లోకేశ్వరరావు కమిటీ ప్రశ్నించింది. దీంతో సదరు వ్యవహారంపై మరోసారి శాఖాపరమైన విచారణ చేపట్టాలని భావించారు. జిల్లా విజిలెన్స్ అధికారి, నాణ్యత నియంత్రణ విభాగాధికారి, మార్కాపురం ఏపీడీలతో త్రిసభ్య కమిటీని నియమించారు.
- ఒంగోలు సీఎల్ఆర్‌సీ పరిధిలో రూ.10లక్షలను ఆఫీసు అటెండర్ చల్లా శేషారావు చెక్కులపై ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసిన వ్యవహారంలో సరైన చర్యలను నాటి పీడీ శీనారెడ్డి తీసుకోకుండా అతనిని సస్పెండ్ చేసి ఆ వెంటనే డబ్బు రికవరీ చేశాడంటూ పోస్టింగ్ ఇచ్చారు. ఆ విచారణ తీరును కమిటీ ప్రశ్నించింది.

చేనేతలకు చంద్రన్న చేయూత

» నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
» హామీ నెరవేర్చిన సీఎంకు నేతన్నల అభినందనలు


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికురాలు సువర్ణ

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. గతంలో ఉన్న ఉచిత 100యూనిట్ల విద్యుత్‌ను 200కు పెంచుతామని స్పష్టం చేశారు. అలాగే పవర్‌లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇచ్చే విధంగా రెండు హామీలు చేశారు. ఈక్రమంలో సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రెండు హామీలను అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో చీరాల నియోజకవర్గ పరిధిలోని చేనేత కుటుంబాలు అభినందనల జల్లు కురిపించాయి. గత ప్రభుత్వం అరకొర హామీలు చేసిన అమలు ప్రక్రియలో తీవ్ర మైన కోతలు విధించినట్లు చెప్తున్నారు. తాజాగా టీడీపీ కూటమి తీసుకున్న నిర్ణయంతో థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేస్తున్నారు.

పూట గడవడం కష్టంగా ఉండేది



అనుకోని రీతిలో నా భర్త సుమారు ఐదేళ్ల కిందట గుండెపోటుతో మరణించారు. దీంతో ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబం ఆర్థికపరమైన సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితులతో చేనేత రంగానికి సంబంధించి ధరలు పెరిగి, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దీంతో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. చాలా ఆనందంగా ఉంది.

- లేళ్ల సునీత, చేనేత కార్మికురాలు

మాట మార్చ లేదు, మడమ తిప్పలేదు



ఎన్నికల హామీలు అందించే క్రమంలో టీడీపీ కూటమి మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. ఇచ్చిన హామీలో భాగంగా నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్ లూమ్‌కు 500 యూనిట్లు అందిస్తున్నట్లు ప్రకటించడం ఆనందదాయకం. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- మాన్యం రాము, చేనేత కార్మికుడు

తొలగిన అడ్డంకులు

అద్దంకి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వెళ్లే వాహనాలకు అడ్డంకులు తొలగాయి. శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా వాహనాలను కట్టడి చేసేందుకు 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నామ్ రోడ్డులో సిమెంట్ దిమ్మెలు, బోర్డులను అడ్డుగా పెట్టారు. దీంతో అద్దంకి వైపు నుంచి శింగరకొండకు బస్సులు వెళ్లే వీలు లేకుండా పోయింది. దీంతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పోలీస్ అధికారులు స్పందించారు. అడ్డుగా వేసిన దిమ్మెలను నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో తొలగింప చేశారు. బోర్డులను పోలీస్ సిబ్బంది మంగళవారం తొలగించి రాకపోకలకు వీలుగా సిగ్నల్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో కొండకు అన్ని వాహనాలు వెళ్తున్నాయి.

రేపు జాబ్‌మేళా

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు జాబ్ మేళా చక్కని అవకాశమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, జవహర్ నాలెడ్జ్ కేంద్రం సంయుక్తంగా గురువారం వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. నిరుద్యోగులు హాజరై ఉపాధి అవకాశాలను పొందాలని వారు కోరారు.


ఉప్పుమాగులూరులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఎత్తిపోతలను వినియోగంలోకి తెస్తాం

మరమ్మతులపాలైన పథకాలను పరిశీలించిన ఐడీసీ అధికారులు

బల్లికురవ. మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు గురై నిరుపయెగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడుతున్నామని నీటి పారుదల శాఖ (ఐడీసీ) ఈఈ సిరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ మండలం గుంటుపల్లి, అంబడిపూడి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కోటవారిపాలెం, ఉప్పుమాగులూరు, సంతమాగులూరు మండలం సజ్జాపురం, తంగేడుమల్లి, కామేపల్లి, పెట్లూరివారిపాలెం గ్రామాలలో ఉన్న ఎత్తిపోతల పథకాలను ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఉన్న పథకాలను వినియెగంలోకి తెచ్చేలా అవసరమైన నిధులపై ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాలు పని చేసేలా ప్రణాళిక మేరకు నిధులు మంజూరు చేయిస్తామని వారు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కొంతకాలంగా పథకాలు పనిచేయడం లేదని ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి అన్ని పథకాలను పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశాలు ఇచ్చిందని వారు తెలిపారు. అనంతరం వారు గ్రామాలలో రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఏఈలు కృష్ణారావు, వంశీకృష్ణ, విజయభాస్కర్, నీటి సంఘాల అధ్యక్షులు కోయ పేరయ్య, కక్కెర సుబ్బారావు, దద్దాల విజయ్, దర్శి రామస్వామి పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కు శ్రీహర్షిణి వెల్‌కం


సునీత విలియమ్స్‌కు స్వాగతం పలుకుతూ మార్టూరు సెంటర్లో శ్రీహర్షిణి విద్యాసంస్థల విద్యార్థులు మానవహారం

మార్టూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంతరిక్షం నుంచి భూమ్మీదికి వస్తున్న సునీత విలియమ్స్‌కు శ్రీహర్షిణి విద్యా సంస్థల విద్యార్థులు మంగళవారం వెల్‌కం చెప్పారు. ఈసందర్భంగా విద్యాసంస్థ నుంచి విద్యార్థినీవిద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీగా మార్టూరు సెంటరు వరకు వచ్చారు. అనంతరం సునీత విలియమ్స్‌కు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. తరువాత పెద్ద అండరుపాస్ వద్ద విద్యార్థులు ఆమెకు సంఘీభావంగా మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఏవో అజయ్, ఉపాధ్యాయులు సాంబశివరావు, సంపూర్ణ, అంజలి, సౌమ్య, స్వామి శివప్రసాద్, పార్వతి, నిర్మల పాల్గొన్నారు.



కళాశాల ప్రతినిధులకు ఏగ్రేడ్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

కేఆర్‌కే కాలేజీకి ఏగ్రేడ్ ప్రదానం

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం కమిషనరేట్ కాలేజీ ఎడ్యుకేషన్ నుంచి అకడమిక్ ఆడిట్ సభ్యులు సందర్శించారు. కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాశాలకు 2023-24 అండ్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏగ్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. సర్టిఫికెట్‌లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావుకు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆడిట్ సభ్యులను శాలువతో సత్కరించారు.

వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు..


కళాశాల ప్రతినిధులకు ఏగ్రేడ్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

చీరాల : వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అకడమిక్ ఆడిట్‌లో ఏ గ్రేడ్ లభించింది. మంగళవారం ఆడిట్ నిర్వహించిన అధికారులు సంబంధిత పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే అకడమిక్ ఆడిట్ 2023-24,25 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు కళాశాల విద్యా కమిషన్ డైరక్టర్ రేపల్లె ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ అధ్యాపకులు డా. ఎం.నరసయ్యను, కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా. కె.సుజాతను నియమించారు. ఈక్రమంలో మంగళవారం వారు కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, వర్చువల్ తరగతి గదులు, సెమినార్ హాల్, క్యాంటీన్‌లతో పాటు పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. ఈక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎన్.మురళికి ఏ గ్రేడ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డా.ఎస్.రాజశేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు అమరరాజా, ఐఆర్ఎస్‌టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ(ఎన్ఐఐటీ) కంపెనీలు హాజరవుతున్నాయని, 100కిపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, బీటెక్, ఎంబీఏ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు రెజ్యూం, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9542970871, టోల్ ఫ్రీ నెంబరు 9988853335 సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశ్రాంత న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్


లోక్ అదాలత్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఫోరం అధ్యక్షుడు విశ్రాంతి న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు విశ్రాంత న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. బాపనమ్మ కల్యాణ మండపంలో మంగళవారం డీఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో విద్యుత్ లోక్ అదాలత్, విద్యుత్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్జీదారుల నుంచి అందిన 19 సమస్యలను స్వీకరించి 16ను అక్కడిక్కడే పరిష్కరించారు. మిగిలిన మూడు సమస్యలు నిర్దేశించిన కాల పరిమితిలో పరిష్కరించినున్నట్లు చెప్పారు. సివిల్, కోర్టు పరిశీలనలో ఉన్న వాటిని మినహాయించి అధికలోడు, మీటర్ సమస్యలు, బిల్లుల పెండింగ్, నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలు సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం పొందాలని వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, బాపట్ల సూపరింటెండెంట్ జీ ఆంజనేయులు, డీఈఈ హరిప్రసాద్‌రావు ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

ఆస్తి విషయమై మారు తల్లిపై కొడుకు దాడి

వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ


అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

పంగులూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం మారు తల్లిపై కొడుకు కర్రతో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి రేణంగివరం గ్రామంలో జరిగింది. గాయపడిన కోటేశ్వరమ్మ పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి సమాచారం మేరకు.. మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన శీలం లక్ష్మారెడ్డికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య పేరు కొండమ్మ, రెండవ భార్య పేరు కోటేశ్వరమ్మ. కొండమ్మకు ఒక కుమారుడు కాగా, కోటేవ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు. కొంత కాలం కిందట లక్ష్మారెడ్డి అనారోగ్యంతో చనిపోగా కొడుకు, కూతుళ్లు కలసి కర్మ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మారెడ్డికి రేణంగివరంలో రెండు ఇళ్లు, కొంత పొలం ఉంది. లక్ష్మారెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు ప్రసాదరెడ్డి కోటేశ్వరమ్మ, ఆమె కుమార్తెలకు ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. లక్ష్మారెడ్డి రెండవ భార్య కోటేశ్వరమ్మ నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి పని నిమిత్తం చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెం వెళ్లింది. కోటేశ్వరమ్మ లేని సమయం చూసి మొదటి భార్య కొండమ్మ కుమారుడు ప్రసాదరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి తన అణుయాయులకు ఇంటిని అద్దెకు ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న కోటేశ్వరమ్మ సోమవారం గ్రామానికి చేరుకుని తన ఇంటిలో ఉన్నవారిని ఖాళీ చేయాలని కోరగా, వారు ప్రసాదరెడ్డికి సమాచారమిచ్చారు. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ అక్కడకు చేరుకుని ఇంటిలో నివాసం ఉంటున్న వ్యక్తులతో కలసి విచక్షణా రహితంగా కోటేశ్వరమ్మపై కర్రతో దాడి చేసి గాయపరిచారు. రాత్రి సమయంలో తన తల్లి కోటేశ్వరమ్మకు కుమార్తె శ్రీలక్ష్మి ఫోన్ చేయగా బదులివ్వక పోవడంతో శ్రీలక్ష్మి తల్లి ఇంటి వద్దకు చేరుకుంది. అక్కడ తన తల్లి లేక పోవడం, చెప్పులు మాత్రమే ఉండడంతో రాత్రి 12 గంటల సమయంలో తన తల్లి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. రాత్రి సమయంలో తల్లి కోసం పోలీసులతో కలసి వెతికామని, దాడి ఘటనలో గాయపడిన తన తల్లి కోటేశ్వరమ్మను ఆటోలో అద్దంకి వైద్యశాల వద్ద వదిలి వెళ్లారని, తన తల్లి వైద్యశాలలో చికిత్స పొందుతూ కనిపించిందని శ్రీలక్ష్మి తెలిపింది. ఆస్తి కోసం తన అన్న ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ తన తల్లిని చంపే ప్రమాదం ఉందని, తమకు రక్షణ కల్పించాలని శ్రీలక్ష్మి వేడుకుంటుంది. సోమవారం అర్ధరాత్రి తన తల్లి కోటేశ్వరమ్మ కనిపించడం లేదని ఆమె కుమార్తె శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసిందని, తమ సిబ్బంది ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు వెతికే ప్రయత్నం చేశామని రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. కోటేశ్వరమ్మ గాయాలతో అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు గుర్తించామని, పూర్తి సమాచారంతో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

రేణుకమ్మ పూజల్లో వెంకటేష్


పూజల్లో పాల్గొన్న వెంకటేష్‌తో దేవస్థాన కమిటీ ప్రతినిధులు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డులోని శ్రీ రేణుకాదేవి అమ్మవారి 34వ వార్షిక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా మంగళవారం నిర్వహిస్తున్న తిరునాళ్లకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. దీంతో దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వెంకటేష్‌తో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై కేసు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ మహిళ న్యాయవాదిని మానసికంగా వేధించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల కోర్టులో పనిచేస్తున్న సీనియర్ న్యాయవాది వద్ద కొంతకాలంగా మహిళా జూనియర్ న్యాయవాది పనిచేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సీనియర్ న్యాయవాది మానసికంగా వేధిస్తున్నట్లు విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు బాధితురాలు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కూరగాయల సాగుకు రాయితీలు

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందించే రాయితీలను సద్వినియోగపర్చుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించి అధికారులు రైతులతో ఆమె మాట్లాడారు. కూరగాయలు సాగు చేసే రైతులకు సబ్జీ కూలర్లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. 25 కేజీల కెపాసిటీ కలిగిన యూనిట్‌కి పూర్తి ఖరీదు 21 వేలు కాగా 50శాతం రాయితీపై రూ.10500 ఇస్తున్నట్లు తెలిపారు. 50 కేజీల కెపాసిటీ, 100 కేజీల కెపాసిటీల యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 22న ఈ పంట నమోదు తుది జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ రాణి, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హానిలేని పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు పంటల సాగులో పర్యావరణానికి హానిలేని వ్యవసాయ పద్ధతులను పాటించాలని మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాలలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కజొన్న పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించాలని శ్రీనివాసరావు రైతులకు సూచించారు. భూసారాన్ని పెంచేందుకు ప్రతి రైతు విధిగా పచ్చిరొట్ట పైరును సాగు చేసి భూమిలో కలియ దున్నాలన్నారు. దీని వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి, సిబ్బంది అలగ్జాండర్, పలువురు రైతులు పాల్గొన్నారు.



కాలువ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వ్యర్థాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. టీ గ్లాసు నుంచి వాటర్, డ్రింకి బాటళ్లను తాగి రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో యథేచ్ఛగా పడేస్తున్నారు. దీంతో కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో మురుగు నీరు ముందుకు పోయే పరిస్థితి లేక తీవ్రమైన కంపు, దోమల బెడద పెరిగింది. మరోపక్క వ్యాపారులు సైతం ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. దీంతో మురుగు కాలువల పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. తరచూ డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నా తిరిగి వ్యర్థాలతో నిండిపోతుంది. ఒకపక్క ప్రభుత్వ యంత్రాంగం స్వచ్ఛాంధ్ర నినాదంతో కార్యక్రమాలు చేస్తున్నా ఇక్కడ పరిస్థితిలో మార్పు కన్పించడం లేదు

- పర్చూరు (ఆంధ్రజ్యోతి)

పాఠశాలల పునరుద్ధరణతో పూర్వవైభవం

» కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల విలీనంతో విద్యార్థులు లేక రెండేళ్లుగా మూత
» కూటమి ప్రభుత్వం రాగానే విలీన నిర్ణయం రద్దు
» తిరిగి ఐదు తరగతులు ఒకేచోట నిర్వహణకు ఉత్తర్వులు
» మోడల్ స్కూల్‌గా మారనున్న వైనం
» తల్లిదండ్రుల హర్షం


కొప్పెరపాడులో విద్యార్థులు లేక మూతపడిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులు

బల్లికురవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న నూతన మార్పులతో గతంలో మూతపడి ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల (హెచ్‌ఈ)కి తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. గతంలో వైసీపీ హయాంలో విద్యార్థులతో నిండుకుండలా ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల నుంచి విలీనం పేరిట 2023లో మూడు, నాలుగు, అయిదు తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలకు తరలించింది. అప్పట్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విలీనం వద్దని నిరసన కూడా చేపట్టారు. అయినా వైసీపీ పాలకులు పట్టించుకోకుండా విలీనం చేశారు. దాంతో అప్పటి వరకు 80 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల 25 మందికి చేరింది. గదులు ఉన్నా విద్యార్థులు లేకపోవడంతో మూడు తరగతులకు సంబంధించిన గదులు రెండేళ్లగా మూతపడి ఉన్నాయి. ఒకటి రెండు తరగతులు గ్రామంలో ఉన్న ఆదనపు తరగతి గదిలో పనిచేస్తున్నాయి. విద్యార్థులున్న పాఠశాలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని వారు అవేదన వ్యక్తం కూడా చేశారు. అయిన వారిమాటలను పట్టించుకోక పోవడంతో విద్యార్థులు లేక తరగతి గదులు నిరుపయెగంగా మారాయి. తాజాగా టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూల మార్పులు చేస్తూ గతంలో వైసీపీ చేసిన తప్పులను సరి దిద్దుతు కొప్పెరపాడు పాఠశాల విద్యార్థులు విలీనం నుంచి తిరిగి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్పు చేస్తున్నారు. దీంతో మూతపడి ఉన్న పాఠశాలకు తిరిగి పూర్వ వైభవం రానుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల గతంలో మాదిరిగా ఉంటే విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. రానున్న నూతన విద్యా సంవత్సరంలో నూతన మార్పులతో పాఠశాలలు బలోపేతం అవుతాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలో ఉన్న ఆదనపు తరగతి గదులలో నడుస్తున్న ఒకటి రెండు తరగతులు


‘మాగుంట’ పేరుతో దరఖాస్తు చేసిందెవరు?
హాజరైన ఇరిగేషన్, మైనింగ్ అధికారులు 8లో

సర్వేపల్లి గ్రావెల్ కేసుపై ముమ్మరంగా సిట్ విచారణ

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం) సహరి : 4.58 (గురువారం ఉదయం)



ఆత్మకూరులోని నారంపేట ఫేస్-2లో ఎంఎస్ఎంఈ పార్కు కోసం చదునుచేసిన స్థలం



రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పార్క్‌ల ఏర్పాటుకు ఏపీఐఐసీ కసరత్తు ప్రారంభించింది. అయితే, ఇప్పటికే నారంపేట ఫేస్1 , బొడ్డువారిపాళెం, కేకేగుంట ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లు ఉన్నాయి. వీటిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పరిశ్రమల స్థాపన అటుంచితే ఉన్నవీ మూతపడ్డాయి.

నియోజకవర్గాల్లో
పారిశ్రామిక అడుగు

- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు
- ఇప్పటికే ఆరుచోట్ల భూముల గుర్తింపు
- వంద ఎకరాల విస్తీర్ణం తగ్గకుండా ఏర్పాటు
- ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భూసేకరణకు కసరత్తు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం.. చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపు చూస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యంతోపాటు అనేక విధాలుగా ఔత్సాహికులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా నూతన పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయలని నిర్ణయించింది. పాత ఎంఎస్ఎంఈ పార్కుల్లో సైతం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతోపాటు రోడ్లు, నీటి వసతులు కల్పించాలని ఇప్పటికే ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు భూమిని గుర్తించాము. ఇప్పటికి ఆరు నియోజకవర్గాల్లో పూర్తయ్యింది. ఇక రెండు నియోజకవర్గాల్లో భూమి కోసం సర్వే చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గంలో 50 ఎకరాలు తగ్గకుండా 100 ఎకరాలు మించకుండా ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయబోతున్నాము. ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో గుర్తించిన భూముల వివరాలను ప్రభుత్వానికి పంపాము. త్వరలోనే భూములను ఏపీఐఐసీ సేకరిస్తుంది.

- ఎల్.శివకుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం

వలేటివారిపాళెం మండలం అయ్యవారిపాళెంలో సేకరించిన భూమిలో ఏపీఐఐసీ అధికారులు



- నియోజకవర్గాల్లో భూమి గుర్తింపు

నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 6 చోట్ల పార్క్‌ల ఏర్పాటుకు భూమిని గుర్తించారు. ప్రభుత్వ భూమి కావడంతో ఎలాంటి ఆలస్యం లేకుండా భూసేకరణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కావలి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో భూమిని గుర్తించారు. అయితే కోవూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో భూమి కోసం సర్వే చేస్తున్నారు. వీలైనంత త్వరలో ఎంఎస్ఎంఈ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నారు.



ఆమంచర్ల ప్రాంతంలోని ఎంఎస్ఎంఈ పార్క్ కోసం ఎంపిక చేసిన భూమి

ఆరు నియోజకవర్గాల్లో గుర్తించిన భూముల వివరాలు

నియోజకవర్గం	మండలం	గ్రామం	భూమి (ఎకరాల్లో)
ఆత్మకూరు	ఆత్మకూరు	నారంపేట(ఫేస్ 2)	70.29
నెల్లూరురూరల్	నెల్లూరు(ఆర్)	ఆమంచర్ల	59.61
కావలి	దగదర్తి	ఉలవపాడు	88.22
సర్వేపల్లి	మనుబోలు	చెరుకుముడి	59.00
కందుకూరు	వీవీపాళెం	అయ్యవారిపాళెం	100.00
ఉదయగిరి	దుత్తలూరు	దుత్తలూరు	50.00

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

కలిగిరి/మర్రిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి మూడేళ్లుగా పొగాకు రైతులకు మార్కెట్ అనుకూలించడంతో రికార్డుస్థాయి ధరలు దక్కాయి. పొగాకు బోర్డు కూడా గతేడాది అధిక ఉత్పత్తికి అనుమతులు ఇవ్వడంతో ఎక్కువమంది పొగాకు సాగుకు మొగ్గుచూపారు. జిల్లాలోని డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాల్లో బుధవారం పొగాకు వేలం ప్రారంభం కానుంది. 2024-25 పంట కాలానికి నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో 103 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా 163 మిలియన్ కిలోలు దిగుబడులు రావచ్చని అధికారు లు అంచనా వేస్తున్నారు. ఎస్ఎల్ఎస్ (దక్షిణాది తేలిక నేలలు) పరిధిలోని కలిగిరి, డీసీపల్లి, కందుకూరు-1,2, పొదిలి, కనిగిరి వేలం కేంద్రాల్లో ఈ ఏడాది 56 మిలియ న్ కిలోలకు అనుమతి లభించింది. బుధవారం నుంచి జరిగే కొనుగోళ్లలో కిలో ధర రూ.280కి తగ్గకుండా ఉంటే బాగుంటుందని రైతులు భావిస్తున్నారు.

ధాన్యం మద్దతు ధరపై మంత్రుల సమీక్ష

నెల్లూరు (హరనాధపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడం, రైతులకు కలుగుతున్న ఇబ్బందులపై మంగళవారం అమరావతిలో మంత్రులు, ఎమ్మెల్యేలు సమీక్షించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, ఎన్ఎండీ ఫరూక్, నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. బీపీటీ రకం పంట పండించిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రులకు వివరించారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని కోరారు. బుధవారం కలెక్టర్‌తోపాటు జిల్లా ప్రత్యేక అధికారితో సమీక్షించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

జిల్లాలో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌కు గడువు ముగియడంతో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఈ నెల 11 నుంచి తవ్వకాలు ఆగిపోయాయి. దీనిమూలంగా రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉత్పత్తి ఆగిపోయింది. ఈ లెక్కన చూస్తే గడిచిన వారం రోజుల వ్యవధిలో తీయాల్సిన సుమారు 35 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ ప్రభావంతో యార్డుల్లో ఉన్న నిల్వలు కరుగుతున్నాయి. ఇది భవిష్యత్ అవసరాలపై ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గడువు ముగుస్తుం దని తెలిసినా.. డీసిల్టేషన్‌పై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈపాటికి ఏదో ఒక నిర్ణయం తీసుకొని ఉంటే ఇసుక ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా ఉండేది. కాగా ప్రస్తుతం జిల్లాలో ఒక్క పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

ఇసుక తవ్వకాలకు
బ్రేక్!

- 4 డీసిల్టేషన్ పాయింట్లకు ముగిసిన గడువు
- వారం రోజులుగా ఆగిపోయిన తవ్వకాలు
- యార్డుల్లో కరుగుతున్న నిల్వలు
- టెండర్‌లా.. పొడిగింపా!? నిర్ణయం తీసుకోని అధికారులు
- మరో రెండు నెలల్లో రానున్న మాన్‌సూన్స్
- ఆ తర్వాత తవ్వకాలకు అవకాశం లేనట్టే!

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గతేడాది కొత్త ప్రభుత్వం కొలువు దీరాక ఇసుకను ఉచితం చేసింది. దీంతో అప్పటి వరకూ ఇసుకకు ఉన్న డిమాండ్ ఒక్కసారిగా తగ్గిపోయింది. ప్రభుత్వం ఏర్పడినది మాన్‌సూన్ సీజన్లో కావడంతో అప్పుడు పెన్నా నదిలో ఇసుక తవ్వకాలు జరిపే వీల్లేకుండా పోయింది. నాడు యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు అందించారు. ఆ తర్వాత డీసిల్టేషన్‌కు అనుమతులిచ్చి డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మొదలయ్యాక ఇసుక మరింతగా అందుబాటులోకి వచ్చింది. అదే సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లే విధానం ప్రవేశపెట్టడంతో ఇసుక కష్టాలు పూర్తిగా తీరాయి. కాగా ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజుకుంటోంది. అదే సమయంలో పరిశ్రమల ఏర్పాటులో కూడా కదలిక మొదలైంది. రామాయపట్నం పోర్టుతో పాటు ఆ చుట్టు పక్కల పెద్ద పెద్ద పరిశ్రమల పనులు జరుగుతున్నాయి. త్వరలోనే కృష్ణపట్నం నోడ్‌లో కూడా పరిశ్రమల నిర్మాణం మొదలుకాబోతోంది. ఈ నేపథ్యంలో ఇసుకకు డిమాండ్ పెరుగుతుంది. అయితే జూన్ నుంచి మాన్‌సూన్ సీజన్ ప్రారంభం కానుంది. అప్పుడు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం నదిలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలుండదు. కాబట్టి ఈ లోపే వీలైనంత ఎక్కువగా ఇసుకను తవ్వి నిల్వ చేసుకోవాలి. మళ్లీ అక్టోబరు నుంచి తవ్వకాలు జరుపుకునేందుకు అవకాశం ఉన్నా ఆ సమయంలో జిల్లాలో వర్షాకాలం ప్రారంభమవుతుంది. అప్పుడు ట్రాక్టర్లు నదిలోకి వెళ్లడం సాధ్యపడదు. కాబట్టి ఈ ఏడాది చివరి నాటికి అవసరమయ్యే ఇసుకను వీలైనంతగా రానున్న రెండు, మూడు నెలల్లోనే స్టాక్ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- త్వరగా నిర్ణయం తీసుకోవాలి

ప్రస్తుతం జిల్లాలోని యార్డుల్లో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. అత్యధికంగా సంగం యార్డులో 72 వేల టన్నులు ఉండగా, సూరాయపాలెంలో 38 వేలు టన్నులు, విరువూరులో 5 వేలు టన్నులు, పడమటికంభంపాడు యార్డులో మరో 5 వేల టన్నుల ఇసుక ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఈ యార్డుల నుంచి ప్రస్తుతం రోజుకు రెండు వేల టన్నుల వరకూ విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ పరిమాణం రానున్న రోజుల్లో మరింత పెరుగుతుంది. కాబట్టి డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌పై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అక్కడ రోజుకు చేస్తున్న 5 వేల టన్నుల ఉత్పత్తిని మరింత పెంచుకోగలిగితే భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేకుండా నిల్వలు పెట్టుకునేందుకు వీలు పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్ణయం తీసుకుంటాం

డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌కు గడువు ముగిసింది. ఇక్కడ డ్రెడ్జింగ్ చేయడంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. కొత్తగా టెండర్లు పిలవడమా లేదా ఉన్న అగ్రిమెంట్‌నే కొంతకాలం పొడగించడమా.. అన్నది కమిటీలో చర్చిస్తాం. భవిష్యత్ అవసరాలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటాం.

- ఓ ఆనంద్, కలెక్టర్

ఆ 4 మండలాలకు
తహసీల్దార్లు ఏరీ!?

- నెలల తరబడి ఇన్‌చార్జ్‌లతో పాలన
- ప్రజలకు తప్పని అవస్థలు

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. నాటి వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని జిల్లాలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. గ్రామసభలు పెట్టినా, రెవెన్యూ సదస్సులు నిర్వహించినా, ఆఖరుకు ప్రతి వారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి కూడా కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చి పడుతున్నాయి. వీటని వేగంగా పరిష్కరించాలని పభుత్వం పదే పదే ఆదేశిస్తోంది. ఇంతటి కీలక సమయంలో రెగ్యులర్ తహసీల్దార్లు లేకపోవడంతో ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. నాలుగు కీలక మండలాలకు నెలల తరబడి రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. పొదలకూరు, ముత్తుకూరు, టీపీ గూడూరు, మర్రిపాడు మండలాలు ఈ జాబితాలో ఉన్నాయి.

- టీపీ గూడూరు మండలానికి ఎనిమిది నెలల క్రితం బదిలీల్లో భాగంగా ఓ తహసీల్దార్‌ను ఇక్కడకు వేశారు. అయితే ఆమె కొన్ని రోజులకే సెలవుపెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి కొత్తవారిని నియమించలేదు. ఇందుకూరుపేట తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు.
- ముత్తుకూరు మండలంలో పని చేస్తున్న తహసీల్దార్ నాలుగు నెలల క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ తర్వాత ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. వెంకటాచలం తహసీల్దార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు.
- మర్రిపాడు తహసీల్దార్ మూడు నెలల క్రితం ప్రసూతి సెలవుపై వెళ్లారు. ఇక్కడా మరొ కరిని నియమించకుండా డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకున్నారు.
- పొదలకూరు తహసీల్దారు నెలరోజుల క్రితం సెలవుల్లో వెళ్లారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దారు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఒక్కో మండలంలో ఇన్నేసి నెలలపాటు రెగ్యులర్ తహసీల్దార్ లేకపోతే అక్కడి సమస్యలను ఎలా పరిష్కరించాలన్న ఆలోచన ఉన్నతాధికారులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. డిసెంబరు, జనవరి నెలల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో జిల్లాలోనే అత్యధికంగా మర్రిపాడు మండలంలో 689 భూసమస్యలు నమోదయ్యాయి. ముత్తుకూరులో 161, టీపీ గూడూరులో 93, పొదలకూరులో 46 అర్జీలు వచ్చాయి. అలానే అంతకముందు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మర్రిపాడు మండలంలో 35 అర్జీలు రాగా, టీపీ గూడూరులో 345 అర్జీలు, పొదలకూరులో 538, ముత్తుకూరులో 48 అర్జీలు నమోదయ్యాయి. ఈ సంఖ్యను బట్టి చూస్తేనే ఆ మూడు మండలాల్లో రెవెన్యూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. అయితే రెగ్యులర్ తహసీల్దార్లు లేని మూలంగా ఈ సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌లుగా ఉన్న తహసీల్దార్లు ఎక్కువగా వారి రెగ్యులర్ మండలాలపైనే దృష్టి పెడుతున్నారు. దీంతో సాధారణ పనులపై తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా అసౌకర్యంగా ఉంటోంది. అదే సమయంలో ప్రస్తుతం కీలకమైన రీసర్వే జరుగుతోంది. గత ప్రభుత్వంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మరి ఇప్పుడు నాలుగు కీలక మండలాలకు నెలల తరబడి రెగ్యులర్ తహసీల్దార్లను నియమించకపోవడం కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది.



‘గూడు’ పురాణిపై
విచారణ

- ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి అధికారులు
- సిమెంట్, ఇసుక, స్టీలు చేతివాటంపై ఆరా
- జిల్లాలోని గోదాములన్నీ పరిశీలన
- నెలాఖరుకు కలెక్టరుకు నివేదికలు
- ఇప్పటికే కొంతమంది అక్రమార్కులపై వేటు

నెల్లూరు(జడ్పీ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) గత వైసీపీ హయాంలో పక్కా ఇళ్ల నిర్మాణాల పేరుతో జరిగిన అవినీతి, అక్రమాలపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు విచారణ వేగవంతం చేశారు. జగనన్న లేఅవుట్లు, పాత ఇళ్ల నిర్మాణాల్లో వినియోగించాల్సిన సిమెంటు, ఇసుక, స్టీలును కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కొంతమంది అధికారులు చేతివాటాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వం మారగానే స్థానికంగా భారీగా ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇప్పటికే కొండ్లపూడి, మనుబోలు గోదాముల్లో పెద్దఎత్తున ఇసుక, స్టీలు సరఫరాలో అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఇందుకు బాధ్యులైన ఇద్దరు ఏఈలు, ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గోదాముల్లో స్టీలు, సిమెంటు, ఇసుక నిల్వలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో హౌసింగ్‌కు సంబంధించి 44 గోదాములు ఉన్నాయి. వీటి ద్వారా గృహనిర్మాణాలకు మెటీరియల్ సరఫరా జరుగుతూ వచ్చింది.

- విచారణ వేగవంతం

జిల్లాలోని 36 మండలాలతోపాటు నెల్లూరు నగరం, ఇతర మున్సిపాలిటీల పరిధిలోని గోదాముల్లో స్టాకుని, జరిగిన మెటీరియల్ సరఫరాపై అధికారులు విచారణ చేపట్టారు. ప్రతి గోదాములో ఇసుక, సిమెంటు, స్టీలు ఎంత నిల్వ ఉంచారు. ఇళ్ల నిర్మాణాలకు సరఫరా జరిగింది ఎంత?.. నిల్వ ఎంత? ఏమేరకు అవినీతి జరిగిందన్న కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే కొండ్లపూడిలో 560 మెట్రిక్ టన్నులు, మనుబోలులో 14 మెట్రిక్ టన్నులు, ఆత్మకూరులో 550 మెట్రిక్ టన్నుల ఇసుక అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు. దీంతో అక్కడి అధికారులపై సస్పెన్షన్‌తోపాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న విచార ణలో పొదలకూరు, కావలి మరికొన్ని గోదాముల్లో ఉన్న స్టాకుల్లో భారీగా తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఈ నెలా ఖరులోగా విచారణ పూర్తి చేసి, నివేదికలు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు.



దుత్తలూరు గోదాములోని సిమెంట్ నిల్వలను పరిశీలిస్తున్న విచారణ అధికారులు

అవినీతి అధికారుల్లో గుబులు

ఈ విచారణతో అవినీతి అధికారుల్లో గుబులు రేగింది. జిల్లాలోని హౌసింగ్ శాఖలో దాదాపు 15, 20 ఏళ్లగా పాతుకుపోయిన కొంతమంది అధికారులు ఏ ప్రభుత్వం వచ్చినా అవినీతికి పాల్పడుతూ ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్నారు. అదే ధైర్యంతో గత వైసీపీ ప్రభుత్వంలోనూ విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించకపోవటంతో చర్యలు ప్రారంభమయ్యాయి. నెలాఖరులో వచ్చే నివేదికలతో ఎన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చి, ఎంతమందిపై వేటు పడనున్నదో వేచి చూడాలి.



మనుబోలు : జగనన్న లేఅవుట్‌లో విచారిస్తున్న హౌసింగ్ అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
కోడిగుడ్ల ధర (100):	



మన్నేటికోట వద్ద మన్నేరుపై నిర్మాణ దశలో అర్థంతరంగా ఆగిపోయిన చెక్‌డ్యాం ఆనకట్ట

- దశాబ్ద కాలంగా ఆగిన పనులు
- సముద్రం పాలవుతున్న వరద నీరు
- నెరవేరని రైతుల కల
- తాగు, సాగునీటికి ఇబ్బందులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

పుష్కర కాలంగా ముందుకు సాగని..

మన్నేరు చెక్‌డ్యాం!

ఉలవపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం క్రితం అర్థాంతరంగా ఆగిన మన్నేరు చెక్ డ్యాం నిర్మాణం పనులు తిరిగి ప్రారంభం అయ్యేనా అని ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గుడ్లూరు మండలంలోని మూడు గ్రామాల మీదగా ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలోకి మన్నేరు వాగు ప్రవేశిస్తోంది. ఇక్కడ నుంచి సుమారు 20 కిలో మీటర్ల మేరకు ఎలాంటి చెక్ డ్యాంలు లేకపోవడంతో వరద నీరంతా సముద్రంపాలవుతోంది. అదే చెక్ డ్యాం నిర్మిస్తే నీటి నిల్వతో వేసవి కాలంలో కూడా భూగర్భ జలాల మట్టం స్థిరంగా ఉంటుంది. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి అవసరాల తోపాటు ఉద్యాన పంటలైన మామిడి, సపోట, జామ, పండ్ల తోటల సాగుకు సంవృద్ధిగా నీరు అందుబాటులో ఉంటుంది. దీన్ని దృష్టిలో పెటుకొని మన్నేరు వరద నీరు పరివాహక గ్రామాలకు ఉపయోగపడేలా ఒక చెక్ డ్యాం నిర్మాణం చేపట్టాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుతంలో బద్దిపూడి, మాచవరం వద్ద మన్నేరుపై చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి మున్సిపల్ శాఖా మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలవడం పనులు చేపట్టారు. మన్నేరుకు అడ్డంగా సుమారు అర కిలోమీటరు బెడ్ వేసి మూడవ వంతు ఆనకట్ట నిర్మాణం పనులు చేపట్టారు. ఈలోపు రాష్ట్ర విభజన జరిగింది. విభజన రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక చెక్ డ్యాం పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టరు మెటీరియల్ వ్యయం పెరగడంతో నష్టాలొచ్చాయంటూ పనులు అర్థాంతరంగా నిలిపేశాడు. పనులు చేపట్టిన బిల్లుల కోసం ఒక దశలో కాంట్రాక్టర్ కోర్టును కూడా ఆశ్రయించాడు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా మన్నేరుపై ఆగిపోయిన చెక్ డ్యాం పనుల జోలికి మాత్రం ఎవరూ వెళ్లలేదు. వాస్తవానికి లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టును మన్నేరుపై నిర్మించారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువ భాగంలో కురిసే వర్షాలకు వచ్చే వరద నీరుతో రాళ్లపాడు సామర్థ్యం ఎక్కువైతే దిగువ మన్నేరుకు వదులుతారు. మన్నేటికోట గ్రామం దాటితే మన్నేరు వరద నీరు నేరుగా సముద్రంలోకి చేరుతోంది. దీంతో ఈ నీటిని ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా చేయాలన్న సంకల్పంతో చేపట్టిన చెక్ డ్యాం నిర్మాణం దశాబ్ద కాలంగా అసంపూర్తిగా మిగిలిపోవడంతో మన్నేరుకు వరద వచ్చినప్పుడల్లా నీటి ప్రవాహం తాకిడికి చెక్ డ్యాం కాంక్రీట్ ఆనకట్ట, సపోర్టు బెడ్ పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అర్థాంతరంగా ఆగిపోయిన చెక్‌డ్యాం పనులను ఉనం ప్రారంభించి పూర్తి చేయాలని మన్నేరు పరివాహక గ్రామాలైన మన్నేటికోట, ఆత్మకూరు, భీమవరం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మిస్తే రైతులకు ప్రయోజనం



మన్నేరు పరిసర గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటకుండా, ఉద్యాన పంటలకు, తాగునీటికి మేలు జరిగేలా చెక్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టారు. పదేళ్ల క్రితం అర్థాంతరంగా ఆగిపోయిన పనులను గత ప్రభుత్వంలో అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళతాం.

- పులివర్తి బసవయ్యనాయుడు, మన్నేటికోట సర్పంచు

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా



కందుకూరులో ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ల రీడర్లు

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డి మాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ మీటర్ల రీడర్స్ మంగళవారం కందుకూరులో ధర్నా చేశారు. ఎన్నో ఏళ్లగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించకుండా తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ మీటర్ల రీడర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో సంఘం కార్యదర్శి కుంచాల సిద్ధయ్య మాట్లాడుతూ 15 ఏళ్లగా తాము విద్యుత్‌శాఖ లో పనిచేస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల నెలనెలా రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండబోదని, ఇప్పటికే కేటగిరి 2 వినియోగదారులందరికీ స్మార్ట్‌మీటర్లు బిగించారని ఈ కార్యక్రమం పూర్తయితే మమ్మల్ని పొమ్మనలేక పొగబెట్టినట్లేనని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖలో తమను పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకుని ప్రత్యామ్నాయంగా తమ సేవలను వినియోగించుకోవాలని, ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న అన్ని ఎస్ఈ కార్యాలయాల వద్ద, 24న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి 27న విద్యుత్‌శాఖ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించ కపోతే ఏప్రిల్ 1 నుంచి సమ్మెబాట పడతామని, 4న చలో విజయవాడ కార్యక్రమంతో నిరవధిక ఆందోళనకు సిద్ధపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత వై.ఆనంద్‌మోహన్, విద్యుత్ మీటర్ల రీడర్స్ ఈ.మాల్యాద్రి, డి.శ్రీను, జే.రాము, డి.శివ, మల్లికార్జున, వంశీ కృష్ణ, మధుకుమార్, నరేష్, సురేష్, చరణ్ పాల్గొన్నారు.

ప్రజలపై పన్నులు, విద్యుత్ బిల్లుల భారం



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

కావలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని, ఒకేసారి వేలల్లో విద్యుత్ బిల్లులు, ఇంటి, నీటి పన్నులు ఎలా కడతారని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నేతలు మంగళవారం 26వ సచివాలయ పరిధిలో పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 26వ సచివాలయ అడ్మిన్‌ను కలిసి ఆ ప్రాంత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.మధుసూదన్‌రావు, కృష్ణయ్య, కృష్ణమోహన్, బంగారయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ యూనిట్ల ప్రారంభం



స్కౌట్స్, గైడ్స్ బాలబాలికల యూనిట్

ఉలవపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ యోజన) పథకంలో భాగంగా కరేడు జడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లును ప్రాంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్నూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా పాఠశాల విద్యావ్యస్థలో క్రమశిక్షణ, దేశభక్తి, స్వీయ రక్షణ, సేవాగుణం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పథకం ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 16 మంది బాలురుతో స్కౌట్ యూనిట్, 16 మంది బాలికలతో గైడ్స్ యూనిట్‌లను ప్రారంభించామన్నారు. స్కౌట్ యూనిట్ కెప్టెన్‌గా పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు రవిచంద్ర, గైడ్స్ కెప్టెన్‌గా సైన్స్ ఉపాధ్యాయిని ప్రసన్నలక్ష్మీ వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్ సర్టిఫికేట్ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లో 2 శాతం, విద్యా అవకాశాల్లో 0.5 శాతం రిజర్వేషన్లు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


ముస్లింలకు ఇఫ్తార్ విందు



నార్తుమోపూరు మసీదులో ఇఫ్తార్ విందులో ముస్లింలు

అల్లూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తుమోపూరులో మస్జిద్-ఎ-బిలాల్ మసీదులో రంజాన్ ఉపవాసాలు ఉంటున్న ముస్లింలకు మంగళవారం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి అనుచరుడు పఠాన్ అబ్దుల్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వాటర్ ట్యాంకుల శుభ్రత పట్టదా ?



అంకభూపాలపురంలో క్లోరినేషన్‌కు నోచుకోని వాటర్‌ట్యాంక్

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దాహం తీర్చడానికి నిర్మించిన వాటర్ ట్యాంకుల శుభ్రతను అధికారులు గాలికొదిలేశారు. ట్యాంకుల నిర్వాహణ, క్లోరినేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. పల్లెల్లో ప్రజలు రక్షిత నీరు అందక రోగాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని కిందిస్థాయి పంచాయతీ సిబ్బందిని ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రక్షిత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. మండలంలో 36 గ్రామాల్లో 39 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేసి క్లోరినేషన్ చేసిన తేదీని వాటర్ ట్యాంక్‌పై నమోదు చేయాలి. వాటర్‌ట్యాకులు క్లోరినేషన్‌కు పంచాయతీలోని 15వ ఆర్థికసంఘం నిధులు వినియోగించుకోవచ్చు. అయితే ఎక్కడా వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు లేవు. కొన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేస్తునట్లు చూపి నిధులు డ్రా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు పాచిపట్టి కనిపిస్తోన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకులు శుభ్రత చేసి సురక్షిత నీరందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 22వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో సాదించిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత అన్ని ధ్రువీకరణ పత్రాలు పాఠశాలలో అందజేయాలని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయాలి

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట, బోగోలు పంచాయతీలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ కోరారు. మంళవారం కమిటీ సభ్యులతో కలసి ఆయన మాట్లాడుతూ బోగోలు-ఇబ్రహీంపేట మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బోగోలు-ఆర్సీఎం చర్చి మధ్య ఉన్న రోడ్డు కూడా అధ్వానంగా ఉందని, బోగోలు బజారులో దుకాణాల వద్ద ఎత్తుగా మట్టిపోరియడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల రవిచంద్ర, దాసరి సునీల్, ఆరోగ్యరాజ్, అహ్మద్, శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ విజయవంతంపై హర్షం

కొండాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం కావడం పట్ల ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్ర హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ సభకు మండలం నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు తిప్పినేని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో వెలసి ఉన్న పోలేరమ్మకు మంగళవారం గ్రామ పొంగళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. కోవూరుపల్లి, కడనూతల గ్రామ ప్రజలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. సామూహిక పూజలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి : సీపీఎం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా, రైతు సమస్యలపై ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీపీఎం చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ.మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వరి ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, అర్హులైన పేదలకు నివాస స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. బిట్రగుంటలో రైల్వే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, అసంపూర్ణంగా ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు

లింగసముద్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగైదు రోజుల నుంచి విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వేకువజామున పొగమంచు, పగలు మండే ఎండలు, రాత్రివేళ కొద్దిగా చలి ఉంటుంది. ముఖ్యంగా మంగళవారం వేకువజామున 4 గంటల నుంచే పొగమంచు దట్టంగా అలుముకుంది. ఇది ఉదయం 8 గంటల వరకు ఉండడంతో వాహనదారులు లైట్లు వైసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు మంచుదుప్పటిలో జాగ్రత్తగా వెళ్లాల్సి వచ్చింది. అయితే వాకింగ్ చేసే పాదాచారులు మంచులో నడిచేందుకు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దినేష్

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మోటారుబైకుపై వేగంగా వెళ్తూ కారును ఓవర్ టేక్ చేసి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని పోకూరు-బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శింగమనేనిపల్లె గ్రామానికి చెందిన బాశం దినేష్ (24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తమ గ్రామం శింగమనేని పల్లె నుంచి పోకూరు మీదుగా కందుకూరుకు మోటారుబైకుపై వెళ్తుండగా మార్గమధ్యంలో పోకూరు-బడేవారిపాలెం గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. దినేష్ మృతితో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు.

రేణుమాల చెరువు, ఉప్పుటేరులో కలప వేలం



కలప నరికి విక్రయించేందుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రేణుమాల చెరువులో ఉన్న కలపను కొట్టి విక్రయించుకునేందుకు పంచాయతీ కార్యాలయం వద్ద ఇరిగేషన్ శాఖ ఏఈ రమేష్ కుమార్ మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.2.50 లక్షలకు చీమల రాధయ్య అనుమతులు దక్కించుకున్నారు. అలాగే ఉప్పుటేరులో కొండాపురం వద్ద నుంచి భీమవరప్పాడు గ్రామం వరకు ఉన్న కలపకు వేలం నిర్వహించగా రూ.6.50 లక్షలకు మురారిశెట్టి సుబ్బారావు దక్కించుకున్నారు. వేలంలో దక్కించుకున్న వ్యక్తులు ఏడాది పాటు కలపను నరికి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, తాటికొండ ప్రవీణ్, మామిళ్లపల్లి వెంకటరమణయ్య, కొమ్మి ప్రభాకర్, చాగంటి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే రోగాలు రావా?



ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీలో చేతిపంపు, కుళాయిల వద్ద నిల్వ చేరిన మురుగు

కొవలి మండలం ఆముదాలదిన్నెలో తాగునీటి కుళాయిలు, రహదారి పక్కన మురుగు నిల్వ చేరి అపరిశుభ్రతతోపాటు దుర్వాసన కొడుతోంది. ఇలా ఉంటే రోగాలు రావా అని స్థానికులు వాపోతున్నారు. ఈ గ్రామానికి తుమ్మలపెంట రక్షిత మంచి నీటి పథకం నుంచి తాగునీరు సరఫరా జరుగుతుండగా ఆ కుళాయిలతో పాటు గ్రామంలోని చేతి పంపుల వద్ద, రోడ్లపై మురుగు నిల్వ చేరుతుండడంతో నీరు కలుషితమవుతోందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గ్రామంతో పాటు ఎస్టీ కాలనీలో తాగునీటి కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ చేరకుండా, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలిరూరల్ (ఆంధ్రజ్యోతి)



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పట్టలు... రైతుల నేస్తం!



ధాన్యం ఆరబోసిన పట్టలనే రక్షణగా ధాన్యంపై కప్పిన రైతులు

ఉండడానికి నీడనిస్తూ- వరి కుప్పల నూర్పిడికి, ధాన్యం ఆరబోసుకోవడానికి, ధాన్యం తడవకుండా రక్షణకు ఎంతో ఉపయోగ పడుతున్న పట్టలు రైతులకు నేస్తంగా మారాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కోతల సమయంలో ఎంతో అత్యవసరమైనవి పట్టలు. గతంలో కుప్పలు నూర్పిడి చేసేటప్పుడు కల్లాల్లోని కొయ్‌కాలు (వరికోత కోయగా మిగిలిన దుబ్బు) కోసి మండ తోలి కల్లాన్ని పరిశుభ్రంగా మార్చి తద్వారా కుప్పలు నూర్పిడి చేసి ఆ ధాన్యాన్ని ఎంతో కష్టంగా చిమ్ముకొని గుట్టలు చేసుకునే పరిస్థితి. దాని తరువాత పట్టల ఆధారంగా ఇవన్నీ చేయకుండానే కుప్పలను నూర్పిడి చేసేవారు. రానురాను వరికోత యంత్రాల ద్వారా కోతలు ప్రారంభమైనప్పటి నుంచి కేవలం ధాన్యాన్ని రాశులుగా పోసుకునేందుకు, ఆరబోసుకునేందుకు మాత్రమే ఇవి దోహదపడుతున్నాయి. అయితే దాదాపు 25 ఏళ్లగా ఇవి రైతు నేస్తాలుగా మారిపోయాయి. వరికోతలు ప్రారంభమయ్యే నాటికి ఉత్తరాది జిల్లాల నుంచి ఈ ప్రాంతాలకు ఎన్నో కుటుంబాలు వచ్చి ఈ పట్టలను అద్దెకు ఇచ్చి ఒక్కొక్క పట్టకు రోజుకు రూ.10 నుంచి రూ.15 అద్దె తీసుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇటు రైతులకు అటు పేద కుటుంబాలకు ఆదరువుగా ఉంటున్నాయి.

- అల్లూరు(ఆంధ్రజ్యోతి)

వైభవంగా శ్రీవారి గరుడసేవ



శ్రీవారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా పెంచలకోనలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం చందనంతో అలంకరించారు. తదుపరి 9 గంటలకు శ్రీవార్లకు మూలమంత్ర నృసింహయాగం, 11 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామని ఆలయ డిప్యూటీ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

ఇంటర్‌లో తెలుగును ఆప్షనల్ చేయొద్దు

- మూల్యాంకన కేంద్రం ఎదుట అధ్యాపకుల నిరసన

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్య సంస్కరణలో భాగంగా తెలుగు భాషను ఆప్షనల్ చేయడం తగదని, ద్వితీయ భాషగా తెలుగును తప్పనిసరి చేయాలని తెలుగు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మూల్యాంకనం కేంద్రం ఎదుట మంగళ వారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఇంటర్ కోర్సు ప్రారంభం నుంచి ద్వితీయ భాషగా ఉన్న తెలుగును ఆప్షనల్ చేయడం తెలుగుభాషను అవమానించడమేనన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అనంతరం ఆర్ఐవో, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రమేష్, వెంకట్రావు, పులి చెంచయ్య, ఎం శ్రీనివాసులు, ఆశీర్వాదం, కృష్ణ, సోమశేఖర్, వనజ, సరళ పాల్గొన్నారు



స్పాట్ కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న తెలుగు అధ్యాపకులు

'ఉపాధి'లో అంతులేని అవినీతి

- రూ.37.80 లక్షల రికవరీకి ఆదేశం
- పలువురు అధికారులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
- రికార్డులు అప్పగించని వారిపై పోలీసు కేసు

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి చోటుచేసుకున్నట్లు అధికారులు నిగ్గు తేల్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవానీ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి రూ.14 కోట్ల పనుల్లో రూ.37.80 లక్షలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మండలంలోని కొన్ని పంచాయతీల్లో ఉపాధి పనుల కొలతల్లో భారీ వ్యత్యాసం ఉండడం, డబుల్ జాబ్‌కార్డులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉద్యోగులు, చనిపోయిన వారికి మస్టర్లు వేశారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నేమ్ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా, నిధులు డ్రా చేసి బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రికార్డుల నిర్వ హణ సక్రమంగా లేకపోవడం, సిబ్బంది బెదిరింపులకు పాల్పడడం తదితర విషయాలను ప్రజావేదికలో గుర్తించామని వివరించారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

- **పంచాయతీల వారీగా ఇలా...**

ఉదయగిరి పంచాయతీ రూ.2,98,788 లక్షలు, కొండాయపాళెం రూ.2,61,763, పుల్లాయ పల్లి రూ.9,28,380, అర్లపడియ రూ.4,14,074, బండగానిపల్లి రూ.1,53,811, దాసరిపల్లి రూ.17,200, శకునాలపల్లి రూ.41,147, నేలటూరు రూ.29,400, తిరుమ లాపురం రూ.2,71,774, వెంగళ రావునగర్ రూ.2,31,071, జీ.అయ్యవారి పల్లి రూ.2,42,066, జీ.చెరువుపల్లి రూ.78,011, గండిపాళెం రూ.61,427, జీ.చెర్లోపల్లి రూ.2,252, అప్పసముద్రం రూ.5,39, 668, కృష్ణంపల్లి రూ.2,07,264, గన్నేపల్లి రూ.2,500లు చొప్పున మొత్తం రూ.37,80,596 లక్షల మేర అవకతవ కలు జరిగినట్లు గుర్తించారు.

కార్యక్రమంలో జిల్లా విజి లెన్స్ అధికారిణి విజయలక్ష్మి, అంబుడ్స్ మన్ వెంకటరెడ్డి, ఏపీడీ శంకర నారా యణ, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాస రాజు, ఎస్ఆర్పీ బుజ్జి, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది సస్పెన్షన్, పోలీసు కేసు

సామాజిక తనిఖీ బృందం పనుల పరిశీలనలో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో అధికారుల ఎదుట చదివి వినిపించారు. దీంతో అవకతవకలకు పాల్పడిన ఏపీవో, ఇద్దరు ఇంజనీరింగ్ కన్సల్టెం ట్లు, ముగ్గురు సాంకేతిక సహాయకులు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, తొమ్మిదిమండి క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే రూ.93 లక్షల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందానికి రికార్డుల అప్పగించలేదన్నారు. రికార్డులు అప్పగించకపోవడం పెద్దనేరమని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ లేనట్టే!

వేసవి కాలం వచ్చిందంటే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీలు అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో కూలీలకు వేసవి అలవెన్స్ ప్రకటించేవారు. అందువల్ల వేసవి కాలం నాలుగు నెలల్లో (మార్చి, ఏప్రిల్, మే, జూన్) కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారణంగానే వేతనం చెల్లించేవారు. అయితే ఈసారి వేసవి అలవెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాలేదు. ఉపాధి కూలీలకు చెల్లించే రోజువారి వేతనం రూ.300లకు పెంచడంతో వేసవి అలవెన్స్ కూడా అందులోనే ఉంటుందని చెబుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- గతంలో ఐదు నెలలపాటు అమలు
- నేటికీ విడుదల కాని మార్గదర్శకాలు
- పెరుగుతున్న ఎండలు
- కూలి గిట్టుబాటు అయ్యేనా!?

జిల్లాలోని 37 మండలాల్లో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో సుమారు 3.75 లక్షల మంది ఉపాధి పనులకు వెళ్లేవారున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరి 44 వేల మంది పనులకు హాజరవుతున్నారు. వేసవిలో కూలీలు పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి వంద శాతం పనికి వేతనం అందించే వారు. అంటే వేసవిలో నేల గట్టిగా ఉండటంతో పని తక్కువ జరిగినా వేసవి అలవెన్సుతో కలిపి ఇస్తారు. దీంతో కూలి గిట్టుబాటు అయ్యేది.

- **జోరుగా పనులు**

ఉపాధి పనులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కూలీల హాజరుశాతం కూడా బాగా పెరిగింది. గతంలో ఈ సమయంలో రోజువారీ 30-35 వేల మంది పనులకు హాజరయ్యేవారు. ఇప్పుడు 44 వేల మంది వరకు పనులు చేస్తున్నట్లు డ్వామా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలయ్యాయి. ఇవి పూర్తయితే ఈ సంఖ్య లక్ష దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో చెరువుల పూడికతీత పనులు, కందకాలు, వ్యక్తిగత ఇంకుడు గుంటలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనుల ప్రతిపాదనలు పంపారు. మరో 20 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఉపాధి హామీకి కొత్త బడ్జెట్‌లో కోటి పని దినాలు కల్పించే అవకాశం ఉంది.

- **మేట్‌లకు ప్రోత్సాహకాలు**

ఉపాధి హామీ పథకంలో మేట్‌లకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు. ఒక్కో మేట్ 50 మంది కూలీలను పనులకు తీసుకువస్తుంటారు. అందువల్లే ప్రతి మేట్‌కు వారు తీసుకువచ్చే ప్రతి కూలీకి రూ.రూపాయిన్నర వంతున అదనపు వేతనం అందిస్తారు. ఉపాధి కూలీలను పనులకు తీసుకురావటానికి మేట్‌లకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు.

అలవెన్స్ లేనట్టే

ఉపాధి కూలీలకు ప్రతి ఏడాది అలవెన్స్‌ను జనవరిలోనే ప్రకటించి మార్గదర్శకాలు విడుదల చేసేవారు. కానీ ఇటీవల ఉపాధి కనీస కూలి రూ. 275 నుంచి 300 కు తగ్గకుండా కల్పించాలని కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులోనే వేసవి అలవెన్స్ ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక మార్చి నెల సగం పూర్తి కావస్తోంది. దీంతో ఈ ఏడాది ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ లేనట్టేనని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలకు వేసవిలో రూ.300 కూలి ఖచ్చితంగా గిట్టుబాటు అయ్యేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు

- లింగనిర్ధారణ చేస్తే కఠిన శిక్షలు : డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 18 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, ఆసుప త్రులపై డెకాయ్ ఆపరే షన్లు ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. మంగళవారం ఆమె చాంబర్‌లో గర్భస్థ పిండ నిర్ధార ణ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతిక చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశువుల ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఇందుకు 8 మంది అధికా రులను నియమించామని తెలిపారు. ఈ బృందం గతంలోనూ జిల్లాలో 31 డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించిందని వివరించారు. భ్రూణ హత్యలను అరికట్టడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్య క్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్, కమిటీ సభ్యులు డాక్టర్ పద్మజ, కరీముల్లా, డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, ఎన్‌జీవోలు కవితారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోమశిల ఈఈ బదిలీ

అనంతసాగరం మార్చి18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం ఈఈ ఎం దశరథ రామిరెడ్డి మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరు ఇరిగేషన్ డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసకుమార్ పదోన్నతిపై నియమితులయ్యారు. త్వరలో ఆయన విధుల్లో చేరను న్నారు.

రేపటి నుంచే ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

నెల్లూరు (విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ స్పాట్ వాల్యుయేష న్‌లో భాగంగా ఈనెల 22న ప్రారంభం కావాల్సిన ఫిజిక్స్, ఎకనామిక్స్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని 20వ తేదీ నుంచే ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు ఈ మార్పును గమనించి ఈనెల 20వతేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ కేంద్రం వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు. కాగా, మంగళవారం జరిగిన ఒకేషనల్ మైనర్ సబ్జెక్ట్ పరీక్షలకు 476 మందికి గాను 416 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

'మాగుంట' పేరుతో దరఖాస్తు చేసిందెవరు?

- సర్వేపల్లి గ్రావెల్ కేసుపై ముమ్మరంగా సిట్ విచారణ
- హాజరైన ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు సంబంధించిన కేసు విచారణ ముమ్మరంగా సాగుతోం ది. సిట్ ఇన్‌చార్జి అయిన బాపట్ల డీఎస్పీ కార్యాలయం వేదికగా జరుగు తున్న విచారణకు మంగళవారం ఇరిగేషన్ నెల్లూరు సెంట్రల్ డివిజన్ గత ఈఈ, ప్రస్తుత ఈఈతోపాటు ఆ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ అటెండర్ హాజరయ్యారు. వీరిని వేర్వేరుగా విచారించారు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుతో దరఖాస్తు చేసిందెవరు?, ఎంపీ పేరిట వేరొక వ్యక్తి దరఖాస్తు చేసుకుంటే ఎలా అనుమతులిచ్చారు..? అని గత ఈఈని ప్రశ్నించినట్లు తెలిసింది. దరఖాస్తు చేసుకున్నది ఒకరి పేరుతో, చలానాలు కట్టింది మరొకరి పేరుతో అయితే ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేదని అడిగినట్లు సమాచారం. పోలీసు కేసు విచారణ జరుగుతుండగానే పెనాల్టీకి సంబంధించిన డీడీలను ఎలా తీసుకుంటారని ప్రస్తుత ఈఈని ప్రశ్నించినట్లు తెలిసింది. సెంట్రల్ డివిజన్ కార్యాలయానికి ఎవరెవరు వచ్చి వెళుతుంటారు..? దరఖాస్తులు, డీడీలు ఎవరు తెచ్చిచ్చారు..? వంటి ప్రశ్నలకు అటెండర్ సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో అప్పట్లో పనిచేసిన మైనింగ్ ఉన్నతాధికారిని కూడా విచారణకు పిలిచారు. ఇరిగేషన్ అధికారులు సర్వేపల్లి రిజర్వాయ ర్‌లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసిన సంగతే ముం దుగా మైనింగ్ శాఖకు తెలియనప్పుడు.. అక్కడ జరిగిన అక్రమ తవ్వ కాలకు ఏ విధంగా పెనాల్టీలు విధిస్తారని మైనింగ్ అధికారిని సిట్ బృందం ప్రశ్నించినట్లు సమాచారం. ఈ అధికారులే కాకుండా తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నట్లు రికార్డుల్లో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కూడా విచారణకు హాజరయ్యారు. అయితే గ్రావెల్ కోసం దరఖాస్తు చేసుకున్నది తాము కాదని వారు స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, తమకు గ్రావెల్ సరఫరా చేసిన వ్యక్తి ఎవరో చెప్పినట్లు తెలిసింది. కాగా, ఈ కేసులో మరికొందరిని విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో దర్యాప్తునకు రానున్నట్లు తెలిసింది.

ప్రైవేట్ కళాశాలల గుర్తింపు దరఖాస్తు తేదీ పొడిగింపు

నెల్లూరు (విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రొవిజినల్ అఫిలియేషన్ రెన్యువల్‌కు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు ఆర్ఐవో శ్రీనివాసులు తెలిపారు. కళాశాల గుర్తింపుతోపాటు కోర్సుల మార్పిడి, కొత్త కోర్సులు, అదనపు సెక్షన్ల మంజూరు, ద్వితీయ భాష, మీడియం మార్పులకు అనుమతి, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కళాశాల తరలింపు, కళాశాల మూసివేత, మూతబడిన కళాశాల పునః ప్రారంభం, కళాశాలల పేరు మార్పు వంటి అంశాలకు ఈనెల 31వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కళాశాలల యాజమాన్యాలు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి చేనేతకు గుర్తింపు కార్డు ఇవ్వాలి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి చేనేతకు గుర్తింపు కార్డు ఇవ్వాలని శాసనమండలి మాజీ సభ్యుడు బూదాటి రాధయ్య, చేనేత ఐక్యకార్యాచరణ కమిటి అధ్యక్షుడు బుధరవపు బాలాజీలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా నేతన్న నేస్తాన్ని కూడా త్వరలో అమలు చేసి చేనేతల బతుకుల్లో వెలుగులు నింపుతారని ఆశిస్తున్నామన్నారు. మగ్గం ఉంటేనే చేనేత గుర్తింపు కార్డు ఇస్తామని అధికారులు చెబుతున్నారని అన్నారు. 50 ఏళ్ల మగ్గాలపై వస్త్రాలు నేసిన నేతన్నలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ చేనేత వృత్తికి దూరమయ్యారని అలాంటి వారికి గుర్తింపు కార్డుతోపాటు పెన్షన్ ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డు లేకపోతే సచివాలయాల్లో కనీసం దరఖాస్తు కూడా తీసుకో వడం లేదని అన్నారు. అనారోగ్య సమస్య లతో దయనీయ పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం సుమోటోగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అశ్వద్ధామ, నేతలు రామనాథం రాజశేఖర్, చింతలపూడి పెంచలయ్య, సోమాగోపాల్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

- సమగ్రశిక్ష ఎస్‌పీడీసీ రవీంద్రనాథ్ రెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా విద్యాశాఖ పనిచే స్తోందని సమగ్ర శిక్ష రాష్ట్ర అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని కోవూ రు జడ్పీ బాలికోన్నత పాఠ శాల, రేబాల జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటా యించి పలు కార్య క్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఎవరైనా విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డీ వెంకట సుబ్బయ్య, ఏఎంవో జీ సుధీర్‌బాబు, పాల్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఈవోలు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్ రెడ్డి

రేషన్ బియ్యం పట్టివేత

కలువాయి, మార్చి 18 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను మంగళవారం రాత్రి తోపుగుంట సమీపంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సుమారు 10 బస్తాల (500కేజీలు) బియ్యం ఆటోలో తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. మండలం నుంచి ప్రతి నెలా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున అక్ర మంగా తరలిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరుగుతుంది. ఆ సమయంలో ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కొనుగోలు చేసిన బియ్యం స్థానికంగా పలు చోట్ల దాచి ఉంచుతారు. 17 తరువాత నుంచి ఈ బి య్యం మండలం దాటిస్తుంటున్నారు. ఇలా దాచి ఉంచిన అక్రమ బి య్యం తరలిస్తుండగా పోలీసులకు చిక్కింది.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం మార్చి18 (ఆంధ్ర జ్యోతి): సోమ శిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎం సీలు కాగా, మంగళవారం నాటికి 55.080 టీఎం సీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలు వకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

భూమి కొనుగోలు పథకం వివరాలు బయటపెట్టాలి

కావలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలం ఊటుకూరులో భూమి కొనుగోలు పథకం ద్వారా కొనుగోలు చేసిన భూములలో జరుగు తోన్న భాగోతాలను అధికారులు బయట పెట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి లో మంగళవారం దళిత నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల కోసం భూమి కొనుగోలు పథకం ద్వారా 2018లో సర్వే నెంబరు 1288, 1294లో 90.86 ఎకరాలు భూమి కొనుగోలు చేసి దానిని 86 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. ఆ భూములకు సంబంధించిన రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించినా వాటిని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించకుండా రైతులే వాటిని సాగుచేసుకోవటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు రైతులతో లాలూచి పడి వారికి సహకరిస్తూ ఎస్సీలకు వాటిని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అయితే ఎస్సీలకు భూములు ఇచ్చినట్లు లబ్ధిదారుల జాబితాలో వారి పేర్లు ఉన్నా ఇంకా భూములను అప్పజెప్పక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆ భూములను సర్వే చేసి లబ్ధిదారులకు అప్పగించ కపోతే ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. ఆ తర్వాత అవసరమైతే ఉద్యమాలు చేపట్టాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో దళిత నేతలు రెబ్బా పాపారావు, అద్దంకి కార్తీక్, విజయరత్నం, జడ్డా వాసు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, హింస, అణచివేత వంటి అమానుష చర్యలను నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్ని జిల్లాలో కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఎస్పీ కృష్ణకాం త్‌తో కలిసి జిల్లాస్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ముందుగా కమిటీ సభ్యులు మురళీకృష్ణ యాదవ్, ప్రవల్లిక, శ్రీరాములు, ప్రభాకర్, సాయిప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షే మ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఏదైనా సమస్యపై కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఆయా కేసుల వివరాలు అందించడం లేదని వాపోయారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావే శాన్ని ప్రతి మూడు నెలలకొకసారి తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అంతకంటే ముందుగానే డివిజన్ స్థాయిలో కమిటీ సమావేశాలు జరగాలని సూచించారు. వసతి గృహాల్లోని పిల్లలతో పనులు చేయిస్తున్న వార్డెన్లు, ఇతర ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీలకు ఆధార్‌కార్డులు ఇప్పించేందుకు మండలాల వారిగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కమిటీ సభ్యుల వివరాలను అన్ని పోలీస్‌స్టేషన్లు, తహసీల్దారు కార్యాల యాలకు పంపించాలని సూచించారు. వసతి గృహాల నిర్వహణపై సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణికి సూచించారు. జిల్లాలో నమోదైన కేసులు, తీసుకున్న చర్యలను ఎస్పీ కృష్ణకాంత్ వివరించారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్‌కలెక్టర్ పూజ, డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీవోలు సన్ని వంశీకృష్ణ, అనూష, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.